పాపాల భైరవులు

దర్శిప్రాంతంలో కల్తీపాల తయారీ విచ్చలవిడిగా జరుగుతోంది. డబ్బాశతో కొందరు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో కల్తీపాలను తయారు చేస్తున్నారు. వాటిని సాధారణ పాలలో కలిపి విక్రయిస్తున్నారు. అసలుకు, కల్తీకి తేడా తెలుసుకోలేని విధంగా కనికట్టు ప్రదర్శిస్తున్నారు. దర్శి నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఇలా కల్తీపాలు తయారు చేస్తున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ఆహార భద్రత అధికారులు మొద్దు నిద్రపోతున్నారు. ఈనేపథ్యంలో పోలీసులు ఒకడుగు ముందుకేశారు. కొద్ది రోజుల క్రితం డెయిరీ ఫాంలను తనిఖీ చేశారు. అక్రమార్కులపై త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో కల్తీపాల తయారీదారుల వెన్నులో వణుకు మొదలైంది.



కల్తీ పాలను పారబోస్తున్న అధికారులు (ఫైల్)

దర్శి ప్రాంతంలో విచ్చలవిడిగా కల్తీపాల తయారీ

- యూరియా, ప్రమాదకరమైన రసాయనాల వినియోగం
- రూ.100 ఖర్చుతో 10 లీటర్లు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అరకొర దాడులకే ఆహార భద్రత అధికారులు పరిమితం
- ఇటీవల పోలీసుల ముమ్మర తనిఖీలు

దర్శి, మే 7 (ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో కల్తీపాల తయారీ కుటీర పరిశ్రమగా మారింది. తక్కువ పెట్టుబడితో అనతికాలంలోనే కోటీశ్వరులు కావాలన్న ఉద్దేశంతో కొంతమంది ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నారు. వీటిని కొందరు ప్రైవేటు డెయిరీలకు పోస్తుండగా, మరికొందరు నేరుగా ప్రజలకు విక్రయిస్తున్నారు. విషయం తెలియని ప్రజలు ఆ పాలను తాగి రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన ఆహార భద్రతాశాఖ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పలు మండలాల్లో జోరుగా కల్తీ

దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో కల్తీపాల తయారీ జోరుగా జరుగుతోంది. తాళ్లూరు మండలంలో గతంలో ఒక వ్యక్తి రెండు గేదెలు మాత్రమే పెట్టుకొని రోజుకు 200 లీటర్ల పాలు శీతల కేంద్రానికి పంపేవారు. దర్శిలో మరో వ్యక్తి ఇంటిలోనే కల్తీపాలు తయారుచేసి పాలశీతల కేంద్రానికి సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. కల్తీపాల తయారీ కోసం నెలకు 30 టన్నుల పాలపొడి హైదరాబాద్ నుంచి ఇక్కడికి వస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులు తయారుచేసిన కల్తీపాలను దర్శి పట్టణంలోని ఒక పాలశీతల కేంద్రం ముమ్మరంగా కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ల్యాక్టోమీటర్ వినియోగించి పాలను తనిఖీ చేసి స్వచ్ఛమైనవని నిర్ధారించి కొనుగోలు చేయాలి. అలాచేస్తే పెద్దగా లాభాలు రావు. కల్తీపాలు తక్కువ ధరకు కొనుగోలు చేసినందున కంపెనీకి ముమ్మరంగా లాభాలు వస్తున్నాయి. దీంతో ఓ పాల శీతల కేంద్రం నిర్వాహకులు అక్రమార్కులకు అడ్వాన్సులు ఇచ్చి కల్తీపాల తయారీని ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం.

పట్టించుకోని ఆహారభద్రత అధికారులు

కల్తీపాల తయారీదారులపై చర్యలు తీసుకోవాల్సిన ఆహార భద్రత శాఖ అధికారులు ఆరునెలలకు ఒకసారి అరకొర తనిఖీలకు పరిమితమవుతున్నారు. కల్తీపాలు తయారుచేస్తున్న వ్యక్తులు, వాటిని సేకరిస్తున్న పాల శీతల కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్ర తశాఖ అధికారులకు ముడుపులు చెల్లిస్తూ అక్రమ వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అధికారులు తనిఖీ చేసిన ప్రతిసారీ వందల లీటర్ల కల్తీపాలు పట్టుబడ్డాయి. ఆ పాలు తయారుచేస్తున్న అక్రమార్కులపై పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొంతమందికి నామమాత్రపు జరిమానాలు విధించి మిన్నకుండిపోతున్నారు. దీంతో కొంతకాలం మౌనంగా ఉంటున్న అక్రమార్కులు ఆతర్వాత యథాతథంగా కల్తీపాలను తయారు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు స్వచ్ఛమైన పాలు ఎక్కడ దొరుకుతాయో అర్థంకాక సతమతమవుతున్నారు. అక్రమార్కులతో వాస్తవంగా గేదెలు పెంచుకొని స్వచ్ఛమైన పాలు విక్రయించే వ్యాపారులకు కూడా మచ్చ పడుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ వ్యాపారం గురించి పట్టించుకున్న నాథుడు లేడు. ఎవరి ఇష్టంవచ్చినట్లు వారు ప్రజల సొమ్మును దోచుకోవడంతోపాటు, వారి ఆరోగ్యంతో కూడా చెలగాటం ఆడారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలకు అడ్డుపడుతుందని ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారు.

కల్తీపాల తయారీ ఇలా..

గతంలో పాలలో నీళ్లు కలిపి కల్తీ చేసేవారు. ఆతర్వాత అధికపాల ఉత్పత్తి కోసం పశువులకు ఇంజక్షన్‌లు ఇవ్వడం ప్రారంభించారు. ఇప్పుడు ఏకంగా ప్రాణాలను హరించే పదార్థాలతో కల్తీ చేస్తున్నారు. కల్తీ పాలు తెల్లగా ఉండేందుకు పాలపొడిని ఉపయోగిస్తున్నారు. జిగురు వచ్చేందుకు పామాయిల్‌ను మిక్స్ చేస్తున్నారు. నురుగు కోసం యూరియా, సల్ఫర్‌ను కలుపుతున్నారు. ఇలా రూ.100 ఖర్చుతో 10 లీటర్ల కల్తీపాలు తయారు చేస్తున్నారు. దాన్ని లీటర్ రూ.70కు ప్రజలకు అమ్ముతున్నారు.





మారువేషంలో సిబ్బందితో కలిసి వెళ్లి కొత్తవెంకటాపురంలోని డెయిరీ ఫారాన్ని తనిఖీ చేస్తున్న దర్శి సీఐ రామారావు (ఫైల్)

పోలీసుల ముమ్మర తనిఖీలు

కల్తీపాల తయారీ నియంత్రణ గురించి ఆహార భద్రతశాఖ అధికారులు పట్టించుకోక పోయినప్పటికీ దర్శి పోలీసులు కొద్దిరోజులుగా ముమ్మర తనిఖీలు చేసి అక్రమ వ్యాపారాన్ని నియంత్రించేందుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల దర్శి సీఐ వై.రామారావు మారువేషంలో అనేక గ్రామాల్లో తిరిగారు. దర్శి ఎస్ఐ ఎం.మురళి, తాళ్లూరు, ముండ్లమూరు ఎస్ఐలు కూడా సిబ్బందితో కలిసి డెయిరీ ఫాంలను తనిఖీ చేశారు. అక్కడ ఉత్పత్తి అవుతున్న పాలను తనిఖీ చేశారు. దీంతో అక్రమార్కుల వెన్నులో వణుకు మొదలైంది. కొద్దిరోజుల క్రితం కల్తీపాలు తయారు చేస్తున్న అక్రమార్కులు ఒకచోట సమావేశమై ఈవిషయంపై ఏం చేయాలని చర్చించుకున్నట్లు తెలిసింది. వీరికి పెద్దన్నగా వ్యవహరిస్తున్న పాలశీతల కేంద్రం నిర్వాహకుడి సలహాను కూడా తీసుకున్నట్లు తెలిసింది. పోలీసు దూకుడు తగ్గేవరకు కొద్దిరోజులు మౌనంగా ఉంటే అంతా సర్దుకుంటుందని వారు భావించినట్లు సమాచారం. అయితే, తనిఖీలు నిర్వహించిన పోలీసు అధికారులు కల్తీపాలు ఎవరెవరు తయారుచేస్తున్నారనే సమాచారాన్ని పూర్తిగా తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఆహార భద్రత అధికారులతో చర్చించి అక్రమార్కులపై త్వరలో చర్యలకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం.

కొత్త రైస్ కార్డులకు దరఖాస్తులు

- జిల్లావ్యాప్తంగా మొదలైన స్వీకరణ
- చేర్పులు, మార్పులు, సవరణలు కూడా
- సంజీవరావుపేటలో ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



సంజీవరావుపేట సచివాలయంలో రైస్‌కార్డు సేవలను ప్రారంభిస్తున్న గిద్దలూరు శాసనసభ్యుడు అశోక్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల (రైస్ కార్డు) కోసం ఎదురుచూస్తున్న పేదలకు కొత్తవి ఇచ్చేందుకు బుధవారం నుంచి సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏడాదిన్నర నుంచి కొత్త కార్డులతోపాటు ప్రస్తుతం ఉన్న వాటిలో చేర్పులు, మార్పుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ కొత్త రేషన్ కార్డుల జారీకి అర్హులైన పేదల నుంచి దరఖాస్తుల స్వీకరణకు నిర్ణయించారు. బుధవారం నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. సచివాలయాల్లో రైస్ కార్డులకు సంబంధించి ఏడు రకాల సర్వీసులను ప్రారంభించారు. కొత్త బియ్యం కార్డు, సభ్యుల చేరిక, కార్డును విభజించడం, ఉన్న సభ్యుల తొలగింపు, కార్డును అప్పగించడం, చిరునామా మార్పులు, తప్పు ఆధార్ సీడింగ్‌ను సరిదిద్దడం వంటి సేవలను ప్రారంభించారు. సచివాలయాల్లో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. కాగా గిద్దలూరు మండలం సంజీవరావుపేట సచివాలయంలో రైస్‌కార్డుల సేవలను అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. అలా జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో రైస్‌కార్డులు, చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నారు. అర్హత ఉండి రైస్‌కార్డు లేని పేదలందరూ దరఖాస్తులు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్‌కృష్ణ ఒక ప్రకటనలో కోరారు.

ఆదిలోనే అడ్డుకట్ట!

- జిల్లాలో 75 తలసీమియా కేసులు
- బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులు
- నేడు ప్రపంచ తలసీమియా వ్యతిరేక దినం



లోపలి పేజీల్లో..



ఒంగోలులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే జనార్దన్ తదితరులు

అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలి

- కలెక్టర్ అన్సారియా పిలుపు
- వర్ధంతి సందర్భంగా మన్యం వీరుడికి నివాళి

6

ఒంగోలు తాలూకా సీఐపై వేటు

- వీరయ్య చౌదరి హత్య కేసులో నిర్లక్ష్యమే కారణం
- విజయకృష్ణ నియామకం

6

వైసీపీ సర్పంచ్ అక్రమాలపై నిరసన

- పురుగు మందు డబ్బాలతో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన
- సమస్య పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో విరమణ

మార్కాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి) : 'బంధువులని కూడా చూడకుండా గ్రామ సర్పంచ్ తమ భూములను అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నాడు. కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. ఇక మాకు చావే శరణ్యం' అని మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పురుగుల మందు డబ్బాలతో మండలంలోని బోడపాడు గ్రామానికి చెందిన కొందరు బుధవారం ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం వరకు నిరసనను కొనసాగించారు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు అక్కడకు చేరుకొని వారితో మాట్లాడినా ససేమిరా అన్నారు. తహసీల్దార్ చిరంజీవి వెళ్లి తప్పక న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని పెద్దయాచవరం ఇలాకాలోని సర్వే నంబర్ 3/5లో 2.22 ఎకరాల భూమి ఉంది. అది పూర్వీకుల నుంచి ఐదుగురు అన్నదమ్ములకు చెందినది. కానీ వైసీపీ నాయకుడు, బోడపాడు గ్రామ సర్పంచ్ రమణారెడ్డి రాజకీయ అండతో అతని మామ, ఐదుగురు అన్నదమ్ముల్లో పెద్దవాడైన పోరెడ్డి కాశిరెడ్డి పేరున పొలాన్ని ఆన్‌లైన్ చేయించుకున్నారు. అంతేకాక ఆ భూమిని కాశిరెడ్డి కుమార్తె, సర్పంచ్ భార్య అయిన వరలక్ష్మి పేరున రిజిస్టర్ చేయించుకున్నారని బాధితులు తెలిపారు. ఈ విషయమై తామంతా కలిసి సర్పంచ్ రమణారెడ్డిని నిలదీస్తే దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నారన్నారు. గట్టిగా మాట్లాడిన తమపై ఇప్పటికే మూడుసార్లు దాడులు చేశాడని చెప్పారు. వారం క్రితం కూడా తమపై సర్పంచ్ రమణారెడ్డి అతని తమ్ముళ్లు, కుమారులు, బావమరుదులతో కలిసి దాడి చేశారని వారు ఆరోపించారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైందని తెలిపారు. ఎంత పోరాడినా తమకు న్యాయం జరగడంలేదు కాబట్టే చావే శరణ్యమని భావించి పురుగుమందుల డబ్బాలతో అధికారుల వద్దకు వచ్చామన్నారు. బాధితులు పోరెడ్డి నాగమ్మ, అల్లూరమ్మ, శివారెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.



పురుగు మందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న బాధితులు

6



ఒంగోలు రైల్వే స్టేషన్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) మాక్ డ్రిల్‌లో పాల్గొనేందుకు వస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు



ఒంగోలులో మాక్‌డ్రిల్

విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం యంత్రాంగం తీసుకునే చర్యలపై ఒంగోలులోని రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో వివిధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఆరోగ్య శాఖ సిబ్బంది, రైల్వే పోలీసులు పాల్గొన్నారు. సంఘవిద్రోహ శక్తుల చర్యలను నిర్వీర్యం చేసేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా కల్పించారు.

లోపలి పేజీల్లో..



డైట్ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

20 మంది జాబితాకు ఆమోదం

ఎంఎస్ఎంఈ పార్క్ వరం

- పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగావకాశాలు
- మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- మేకలవారిపల్లి టోల్‌గేట్ సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన

తర్లుపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు ఇలాకా మేకలవారిపల్లి టోల్‌గేట్ వద్ద ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయడం నియోజకవర్గానికి వరం అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 50 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఈ పార్కుకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్కాపురం ఎస్టేట్‌లో ఏవిధంగా ఏర్పాటు చేశారో అలాగే ఇక్కడ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. ఇందులో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటువల్ల నిరుద్యోగులకు వందల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. నియోజకవర్గంలోని కొనకనమిట్లలో రిలయన్స్ ఆధ్వర్యంలో రూ.1,500కోట్లతో త్వరలో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. రైతులకు ఎకరానికి రూ.30వేలు కౌలు చెల్లిస్తారని చెప్పారు. ఆ ప్లాంట్ ద్వారా కూడా వందల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఇక్కడి నుంచి రామాయపట్నంకు 100కి.మీ, ఎయిర్‌పోర్టుకు 150 కి.మీ దూరంలో ఉన్నాయన్న ఎమ్మెల్యే.. ఈ ప్రాజెక్టులు కూడా జాతీయ రహదారి పక్కనే ఉన్నందున పారిశ్రామిక వాడల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, గ్రామ సర్పంచ్ ముండ్లపాటి శిఖామణి, టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ పులివేముల ఏసుదాసు, మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, పి.గోపీనాథ్ చౌదరి, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

డైట్ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ 20 మంది జాబితాకు ఆమోదం

ఒంగోలు విద్య, మే 7 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న సీనియర్ లెక్చరర్, లెక్చరర్ పోస్టులను పొరుగు సేవల విధానంలో భర్తీ చేసేందుకు పాఠశాల విద్య కమిషనర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అందుకోసం ఎంపిక చేసిన 20 మంది ఫ్యాకల్టీ జాబితాకు ఆయన ఆమోదముద్ర వేశారు. డైట్‌లో ఆరు సీనియర్ లెక్చరర్, 17 అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వీటి కోసం మొదట 45 మంది దరఖాస్తు చేశారు. ఎంపికకు నిర్వహించిన ట్యాబ్ పరీక్షకు 33 మంది హాజరయ్యారు. వీరందరికీ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో 50 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్యాబ్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ మార్కులు కలిపి మెరిట్ జాబితాను తయారు చేశారు. వీరిలో 20 మందిని ఎంపిక చేస్తూ జాబితాను కమిషనర్ బుధవారం విడుదల చేశారు. మొత్తం 23 ఖాళీలకు 20 మాత్రమే భర్తీ అవుతున్నాయి. ప్రస్తుత డైట్‌కు ఎంపికైన వారు పొరుగు సేవల విధానంలో పనిచేయాలి. డైట్‌లో వీరి ప్రాథమిక కాలపరిమితి ఒక సంవత్సరమే. విధుల్లో చేరాక అందరూ ఒక అంగీకారపత్రాన్ని ఇవ్వాలి. ఏమైనా కారణాలతో తమను ఎప్పుడైనా, ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించేందుకు సమ్మతమేనని అందులో పేర్కొనాలి. ఆర్జేడీ, డీఈవోలు వీరిని వెంటనే రిలీవ్ చేసి వీరి స్థానంలో బోధనకు ఆటంకం కలగకుండా పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పోస్టులకు ఎంపికైంది వీరే..

టీచర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌కు పి.విజయకృష్ణ, పి.మెర్సిన్‌బాబు, పి.లక్ష్మీనాగప్రసూన, ఎం.మల్లికార్జునరావు ఎంపికయ్యారు. డిపార్టుమెంట్ ఆఫ్ తెలుగుకు ఈ.శివప్రసాద్‌రెడ్డి, కేఎన్‌వీ భార్గవి, జి.కోటిరెడ్డి, డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లీషుకు పి.రమేష్‌బాబు, ఎన్.కిషోర్‌బాబు, యూ.నాగకుమారి సెలక్ట్ అయ్యారు. డిపార్టుమెంట్ ఆఫ్ మేథమాటిక్స్‌కు వి.మార్కండేయులు, యు.రామకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసరావు, డిపార్టుమెంట్ ఆఫ్ ఈవీఎస్‌కు బి.తిరుపతయ్య, ఆర్.జగన్నాథరావు, ఎన్‌వి.సుబ్బయ్యలు ఎంపికయ్యారు. డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్‌కు ఎన్. మహేంద్రబాబు, ఎం.శ్రీనివాసులు, డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ స్టడీస్ అండ్ హ్యూమనిటీస్‌కు ఐ.సర్దార్ పాపారాయుడు, టి.వి.రామచంద్రరావులను ఎంపిక చేశారు.

తాలూకా సీఐపై వేటు

● వీరయ్య చౌదరి హత్య కేసులో నిర్లక్ష్యమే కారణం

● విజయకృష్ణ నియామకం

ఒంగోలు క్రైం, మే7 (ఆంధ్రజ్యోతి) : వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసుల వైఫల్యం గుర్తించిన ఉన్నతాధికారులు తాలూకా సీఐగా పనిచేస్తున్న అజయ్‌కుమార్‌ను వీఆర్‌కు పిలిచారు. వీఆర్‌లో ఉన్న విజయకృష్ణను తాలూకా సీఐగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. తాలూకా పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో వీరయ్యచౌదరి కార్యాలయం ఉంది. అక్కడ విచక్షణారహితంగా కిరాయి హంతకులు వీరయ్యచౌదరిని హత్య చేశారు. అదే సమయంలో తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న హోటల్‌లో రెండు నెలల పాటు మకాం వేసి రెక్కీ నిర్వహించారు. ఇలా అనేక వైఫల్యాలు పోలీసులవైపు నుంచి ఉన్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు తాలుకా సీఐ అజయ్‌కుమార్‌పై వేటు వేశారు. వీరయ్య చౌదరి హత్య జరిగిన తర్వాత కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మరో హత్య జరిగింది. ఇలా నగరంలో రౌడీషీటర్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో మొదటి చర్యగా తాలూకా సీఐని వీఆర్‌కు పిలిపించారు. ఇంకా కొంతమంది అధికారులపై చర్యలు ఉండే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

శ్రీకరి విల్లాస్ వద్ద బాధితుడి ధర్నా

ఒంగోలు క్రైం, మే7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగముక్కపాలెం వద్ద ఉన్న శ్రీకరివిల్లాస్ ప్రధాన ద్వారం వద్ద దుగ్గిరాల అజయ్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. విల్లాస్ యజమాని తనతో 2022 నుంచి తన టిప్పర్లతో ఇసుక, గ్రావెల్ తోలించుకున్నాడని, అందుకు సంబంధించి రూ.57 లక్షలు నగదు ఇవ్వాలని, అడుగుతుంటే కొంతకాలం ఎన్నికల కారణం చెప్పి వాయిదా వేశాడని, ఇప్పుడు ఫోన్‌కు కూడా స్పందించడం లేదని వాపోయారు. ఎలాంటి సమాధానమూ ఇవ్వడంలేదని అజయ్ కుమార్ వాపోయరు. తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని, తనకు రావలసిన డబ్బులు ఇప్పించి తమ కుటుంబాన్ని రోడ్డున పడకుండా చూడాలని వేడుకున్నారు.

అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక గుంటూరు రోడ్డులోని ఆయన విగ్రహానికి ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్. విజయకుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి ఎదురొడ్డి అడవిబిడ్డలకు అండగా నిలిచి 27 ఏళ్ల వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన యోధుడు అల్లూరి అని కీర్తించారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గద్దలగుంట మూడుబొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. 30వ డివిజన్ అధ్యక్షుడు కనకారావు డీజేఆర్ ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

200మందికి వైద్యసేవలు

ఒంగోలు విద్య, మే 7(ఆంధ్రజ్యోతి): సర్వేరెడ్డిపాలెంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ విభాగం, కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సునీత కృష్ణన్, డాక్టర్ వాసుబాబు, శిరీష, వేణుగోపాల్, పి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, హెచ్ఎం రత్నప్రసాద్, కిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై వైసీపీ హర్షం

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన సైన్యం చేసిన దాడులపై ఒక భారతీయుడుగా గర్వపడుతున్నట్లు వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి నెలకొంటుందని, సైన్యం శక్తి సామర్థ్యాలను ఆయన అభినందించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 216పై మంగళవారం అర్ధరాత్రి ఇరువురు యువకులపై దాడికి పాల్పడిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన గవిని విజయ్‌కుమార్, కీర్తివారిపాలేనికి చెందిన మరొక వ్యక్తితో కలిసి రేపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. తోటవారిపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద స్టూవర్టుపురంకు చెందిన చౌట అభినయ్, బొజ్జగాని సంపత్, సిరాజ్ సాహ, కాశీంలు కారుతో వెంబడించి ఆపి విచక్షణ రహితంగా దాడి చేశారు. అయితే అదే సమయంలో వారు పారిపోయి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి, బాధితులు బంధువుల ట్రాక్టర్ ఎదురు రావడంతో వారు నింధితులను పట్టుకుని ఈపూరుపాలెం పోలీసులకు అప్పగించారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. అలాగే కారును సీజ్ చేశారు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధం

● కలెక్టర్ తమీమ్ అన్సారీయా

● మాక్ డ్రిల్ నిర్వహించిన యత్రాంగం

ఒంగోలు క్రైం, మే7(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్, బస్టాండ్ ముఖ్యమైన ప్రాంతాల్లో విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం యంత్రాంగం తీసుకునే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించామని అన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా జిల్లా యంత్రాంగం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, రైల్వే పోలీసులతో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంఘవిద్రోహ శక్తుల చర్యలను నిర్వీరం చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా కల్పించేందుకే మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఇలాంటి మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్

రైల్వేస్టేషన్‌లో విద్రోహ శక్తులు కొన్ని ప్రాంతాల్లో తగులబెట్టి అల్లర్లు సృష్టించారు. ఈ సమాచారం తెలుసుకున్న కలెక్టర్, ఎస్పీ తమ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో తొలుత రైల్వేస్టేషన్ ముందు అల్లర్లలో గాయపడిన వారికి ఆరోగ్య శాఖ తరుపున డాక్టర్లు ప్రథమ చికిత్స నిర్వహించారు. వారికి భద్రత కల్పించడానికి పోలీసు యంత్రాంగం అంతా అక్కడికి చేరుకుంది. గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రికి పంపించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీలు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా ఆ ప్రదేశంలో టిక్కెట్ కౌంటర్ వద్ద ఉన్న ప్రేలుడు పదార్థాలున్న బ్యాగ్‌ను బాంబు స్క్వాడ్ గుర్తించింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ వచ్చి బాంబును నిర్వీరం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ అంతా డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఇలా మాక్‌డ్రిల్ నిర్వహించిన తరువాత కలెక్టర్, ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడి భరోసా కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు కొన్ని ఆసుపత్రులను బాంబ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, అదనపు సీఐ కె.నాగేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీ నివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), మే7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని పొగాకు వేలంకేంద్రం-2లో జరుగుతున్న వేలం ప్రక్రియను ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్సీ సమావేశం జరుగుతుందని, ఈక్రమంలో పొగాకు వ్యాపారులు, ఆయా సంస్థల యజమానులను పిలిపించి మాట్లాడతామని చెప్పారు. పొగాకు వ్యాపారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం కచ్చితంగా కొనుగోలు చేయాల్సి ఉందని, అలా చేయని వ్యాపారులపై చర్యలు తీసుకునేలా నివేదిస్తామని తెలిపారు. అనంతరం రైతు సంఘం నాయకుడు కేవీ వీ.ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ రైతుల నుంచి కొనుగోలు చేయక పోవటం మోసపూరితంగా ఉందని చెప్పారు. రైతులు తెచ్చిన బేళ్లను నోబిడ్ చేయకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి తులసి, రైతు సంఘం నాయకులు వి.హనుమారెడ్డి, వీరారెడ్డి, వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునీల్, బండారు రామాంజనేయులు, పోలరపు వెంకటరామయ్య, వై.వెంకటశేషయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఎమ్మెల్యే బీఎన్

ఆపరేషన్ సిందూర్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలి : సీఎం

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా శత్రువుల దాడి జరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికలతో ప్రజలు భయపడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పల్లామల్లిలో త్రీఫేస్ కరెంటు సరఫరా ప్రారంభం

చీమకుర్తి, మే7(ఆంధ్రజ్యోతి) : పల్లామల్లి గ్రామంలోని సబ్ స్టేషన్‌లో త్రీఫేస్ కరెంట్ సరఫరాకు వీలుగా నూతనంగా ఏర్పాటు చేసిన సిస్టమ్‌ను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రేడియేరూమ్ సెంటర్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, బీసీకాలనీలో ఉన్న బ్రహ్మంగారి గుడిని ఎమ్మెల్యే సందర్శించి పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జా సుబ్బారావు, అన్నమనేని రాఘవయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాసరావు, లోకేష్, రామబ్రహ్మం, మన్నం శేషయ్య, సుబ్బారావు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



స్విచ్ఛాన్ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఏడుకొండలు

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలను నియమిస్తూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ టి.జమున కడప మెడికల్ కాలేజీకి బదిలీ కాగా ఆమె బుధవారం రిలీవ్ అయ్యారు. దీంతో డాక్టర్ ఏడుకొండలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కొనసాగిన సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారానికి తొమ్మిదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, జీవనజ్యోతి, ప్రసన్న, రమేష్, దీప్తి పాల్గొన్నారు.

గ్రోత్‌సెంటర్‌లో నేడు వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ





హోమంలో పాల్గొన్న నిర్వాహకులు, ప్రతిష్ఠకు సిద్ధమైన ఆలయం

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో గురువారం వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పంచామృత స్నానం, ప్రత్యేక పూజలు ఆగమ పండితులు వింజమూరి అర్యుతానం దశర్మ, రవికుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ ఆలయాన్ని దాదాపు రూ.1.50కోట్లకుపై పైగా ఖర్చు చేసి సర్వాంగసుందరంగా నిర్మించారు. ఇందులో పరిశ్రమల యజమానులు చేయూతనివ్వగా, మైనంపాడుకు చెందిన ఆళ్ల రవి నేతృత్వంలో ఆలయానికి అన్ని హంగులు సమకూర్చారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం కాగా గురువారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్ అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతంచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో సీహెచ్.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహేష్, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, జి.రమేష్, కృష్ణమోహన్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

ఒంగోలు క్రైం, మే7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాల్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎస్పీ ఏఆర్.దామోదర్ పూల పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్రిటీష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కంచె తగిలి కూలీ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు



వెంకటేశ్వర్లు మృతదేహం

సంతనూతలపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం పొలానికి వేసిన విద్యుత్ కంచె తగి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన పి.గుడిపాడు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పి.గుడిపాడులోని ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలోని సుబాబుల్ పొలాల్లో కర్రను కొట్టేందుకు మాలికల వెంకటేశ్వర్లు, కత్తి దుర్గారావు వెళుతున్నారు. అయితే పక్కనే మరో పొలంలో అడవిపందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి వెంకటేశ్వర్లు(45) అక్కడిక్కడే మృతి చెందాడు. దుర్గారావు తీవ్రగాయాలు కాగా అతని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులుకు గిట్టుబాటు ధరలు కల్పించే వరకు ఉద్యమం చేస్తామని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీపీ.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హను మారెడ్డి, వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, పి.అంజయ్య, శరత్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేలం కేంద్రాన్ని పరిశీలించిన మలావి దేశ ప్రతినిధి

వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం మలావి దేశం పొగాకు కంపెనీ ఎలయన్స్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధి మిలోనేవో సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కంపెనీ బయ్యర్ వెంకటేశ్వర్లు, రైతు నాయకులు మిలోనేవోతో మాట్లాడారు.

ఆర్‌బీఎస్‌కే ద్వారా పిల్లలకు ఉచిత శస్త్రచికిత్సలు

● కలెక్టర్ అన్సారీయా

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కింద చిన్న పిల్లలకు ఎలాంటి చికిత్సలైనా ఉచితంగా చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని జీజీహెచ్‌లో జిల్లా బాల భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్‌రే యూనిట్‌ను, పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక టెస్ట్ స్క్రీనింగ్ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 30 మంది పిల్లలను ఆపరేషన్ల కోసం గుర్తించామని, వీరికి జీజీహెచ్‌లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పిల్లలకు ఒకొక్కరికి మూడు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉండగా రూ.1.50లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అయితే వాటిని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, స్మైల్ ఫౌండేషన్ సహకారం ఉచితంగా చేస్తారని చెప్పారు. చికిత్స అనంతరం స్పీచ్ థెరపీ, టీత్ అలైన్‌మెంట్ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ జమున, స్మైల్ ట్రైన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుధా నాగేశ్వరరావు, జీజీవాచ్ వైద్యులు పాల్గొన్నారు.

అనంతరం జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చర్మ సంబంధిత అత్యాధునిక లేజర్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ సౌకర్యం ప్రజలందరికీ తెలిసేలా, ఉపయోగపడేలా వైద్యులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ జిల్లా వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ బాషా పాల్గొన్నారు.



కలెక్టర్ అన్సారియాకు వైద్యసేవలు గురించి వివరిస్తున్న వైద్యులు

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

● నేడు ఒంగోలులో కల్యాణోత్సవం

ఒంగోలు(కల్చరల్), మే 7(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానం సృష్టికర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమిని స్వామివారి ఆరాధనోత్సవంగా భావించి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయనను కొలుస్తారు. ఇక ఈ ఆరాధనోత్సవాలను అనేకచోట్ల పంచాహ్నికంగా అంటే ఐదు రోజులు నిర్వహించి చివరి రోజున శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. జిల్లాలోని అనేక ప్రాంతాలలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని అచలానంద ఆశ్రమం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి నిలయంగా ఎంతో ప్రసిద్ధి చెందగా దీని నిర్వాహకులు శ్రీపరిపూర్ణ సిద్ధానంద స్వామివారి భక్తులు. ఈ సందర్భంగా స్వామివారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం విశ్వశాంతి మహాయజ్ఞం, ఆరాధనోత్సవం, కోలాట ప్రదర్శన కన్నుల పండుగగా జరిగాయి. ఇక గురువారం ఉదయం 9 గంటల నుంచి కల్యాణోత్సవం జరుగుతుందని, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని శ్రీపరిపూర్ణ సిద్ధానంద స్వామి తెలిపారు.

స్థానిక కర్నూల్‌రోడ్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం ప్రధాన అర్చకులు మధుసూదనాచారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు గోనుగుంట వెంకటనాగబ్రహ్మాచారి, నూతలపాటి వెంకటశేషాచార్యులు పర్యవేక్షించారు.

త్రోవగుంటలో..

ఒంగోలు(రూరల్): త్రోవగుంటలో గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన సంతర్పణ జరిగింది.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు గజవాహనంపై దర్శనమిచ్చారు. గురుస్వామి శివ ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.



త్రోవగుంట బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఫిజియోథెరపీపై అవగాహన

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): కొన్ని వ్యాధుల చికిత్సలో ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిమ్స్ ఫిజియోథెరపిస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ వైద్య బృందం అవగాహన సదస్సు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ కన్ను, మెదడు, వేళ్లు, భుజాలు ఇబ్బంది కలిగే విధంగా సెల్‌ఫోన్ వాడకూడదన్నారు. డీపీటీ తేజ సెక్రటరీలతో కొన్ని వ్యాయామాలు చేయించారు.

టూవీలర్స్ మెకానిక్‌ల సమస్యల పరిష్కారించాలి

ఒంగోలు, కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టూవీలర్ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలని టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దాయనేని ధర్మ కోరారు. బుధవారం గుడివాడలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారదిశగా చొరవ చూపాలని కోరారు.

నేడు టీడీపీ నేత వీరయ్యచౌదరి సంస్మరణ సభ

● ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దశదిన కర్మ, సంస్మరణ సభ గురువారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఆయా ఏర్పాట్లను బుధవారం రాత్రి ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ అమ్మనబ్రోలులో స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. వీరయ్యచౌదరికి టీడీపీ పెద్దలతో పాటు రాష్ట్రస్థాయి నాయకులతో పరిచయాలు ఉన్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు, వీరయ్యచౌదరి కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే బీఎన్ చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాజీ జడ్పీ చైర్మన్‌కు పరామర్శ

ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య సమాచారంతో గుండెపోటుకు గురై హైదరాబాద్‌లో చికిత్స అనంతరం అమ్మనబ్రోలు చేరుకొన్న మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబును ఎమ్మెల్యే బీఎన్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఈదర మోహన్, తేళ్ల మనోజ్‌కుమార్, గుమ్మడి సాయిబాబా, రంపతోటి అంకారావు పాల్గొన్నారు.

నేడు శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఒంగోలు(రూరల్), మే7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కమ్మపాలెం సమీపంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వార్ల విగ్రహాలను గురువారం ఉదయం 6.55గంటలకు ప్రతిష్ఠాపన జరుగుతుందని దేవాలయ ధర్మకర్త అబ్బూరి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గత మూడు రోజులు నుంచి దేవాలయ ప్రాంగణంలో హోమాలు, యాగాలను నిర్వహిస్తున్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు అబ్బూరి అనిల్, దాచర్ల రమణయ్య, భైరపునేని తిరుపతిరావు, బొల్లినేని కోటేశ్వరరావు, నన్నపనేని అంజనేయులు (ఎస్‌వీబీసీ కన్వెన్షన్‌హాల్) పర్యవేక్షించారని తెలిపారు.

రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ వీరపాణ్యన్

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ వీరపాణ్యన్ ఆదేశించారు. బుధవారం మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయటం ద్వారా వారు ఎక్కడికి వెళ్లినా ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవచ్చని, అందువల్ల అక్కడ ఉన్న డాక్టర్లకు వైద్యం చేయడం సులభం అవుతుందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో టి. వెంకటేశ్వర్లు, వైద్యులు శ్రావణ్‌కుమార్, ఆనంద్‌మోహన్, జగదీష్, వినీల చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి

చీమకుర్తి, మే7 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత జయంతి వేడుకలు బుధవారం చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రం లో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయం నుంచి కలశాలతో తీసుకువచ్చిన జలాలతో అమ్మవారికి అభిషేకం కనులపండవగా నిర్వహించారు. తదుపరి మహిళలు సామూహిక పారాయణ,సంకీర్తన నిర్వహించారు. రాత్రివేళ అమ్మవారి నగరోత్సవం విశేషంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీపద్మావతి, కుటుంబ సభ్యులు, వాసవీ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



తలసీమియాకు ఆదిలోనే అడ్డుకట్ట!


- జిల్లాలో 75 కేసులు నమోదు
- బాధితుల్లో ఎక్కువమంది చిన్నారులు
- నేడు ప్రపంచ తలసీమియా వ్యతిరేక దినం

ఎర్రరక్త కణాల్లో ఉండే హిమోగ్లోబిన్‌ను శరీరం తగినంతగా ఉత్పత్తి చేయనప్పుడు ఏర్పడే రక్తవ్యాధినే తలసీమియా అంటారు. రక్తంలోని అక్సిజన్‌ను శరీరంలోని వివిధ భాగాలకు తీసుకెళ్లడంలో హిమోగ్లోబిన్ కీలకపాత్ర పోషిస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో ఎముక మజ్జ (బోన్ మ్యారో) శరీరానికి కావాల్సిన హిమోగ్లోబిన్ లేదా ఎర్రరక్త కణాలను తయారు చేయకపోవడంతో శరీరంలోని అన్ని కణాలకు తగినంత ఆక్సిజన్ అందదు. చిన్నారుల్లో ఎక్కువగా ఉండే ఈ సమస్య నివారణ కోసం ప్రపంచ వ్యాప్తంగా తలసేమియా వ్యతిరేక దినాన్ని ఏటా మే 8వ తేదీన నిర్వహిస్తున్నారు.

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మండలాల్లో ఒకట్రెండు తలసీమియా కేసులు ఉన్నాయి. అంటే విభజిత జిల్లాలో ప్రస్తుతం 75 తలసీమియా కేసులు నమోదయ్యాయి. ఎక్కువగా రెండు సంవత్సరాల్లోపు వారికి వస్తోంది. మన శరీరంలో ఎర్రరక్తకణాలు లేదా హిమోగ్లోబిన్ ఉండాల్సిన మోతాదులో లేనప్పుడు తలసీమియాతో పాటు రక్తహీనత సమస్య కూడా కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొన్ని జన్యుపరమైన మార్పుల వల్ల కూడా తలసేమియా రావచ్చని వైద్యులు చెప్తున్నారు.

తలసీమియాలో రెండు రకాలు ఉంటాయి. ఆల్ఫా(ఏ) తలసీమియా, బీటా(బీ) తలసీమియా ఉంటాయి. ఇందులో ఒక్కొక్క రకానికి వేర్వేరు జన్యువులు ప్రభావం అవుతాయి. అలా శరీరంలోని హిమోగ్లోబిన్ తయారు చేసే నాలుగు జన్యువులు దెబ్బతిన్నప్పుడు ఈ తలసీమియా వస్తుందని, ఈ ఆల్ఫా తలసీమియాలో రకాలు ఉంటాయని

Thalassemia



వైద్యులు చెప్తున్నారు. ఆల్ఫా-గ్లోబిన్ జన్యువులలో ఒకటి దెబ్బతిన్నప్పుడు మిగిలిన మూడు సాధారణంగా పనిచేసే స్థితినే ఆల్ఫా తలసీమియా సైలెంట్ క్యారియర్ అంటారు. ఈ దశలో ఎర్రరక్త కణాలు సాధారణం కంటే చిన్నవిగా ఉంటాయి. ఈ సమయంలో తలసీమియా వ్యాధి లక్షణాలు ఏమీ కనిపించవు. ఈ దశలో రెండు జన్యువులు దెబ్బతిన్నప్పుడు మిగతా రెండు పనిచేసే స్థితిలో ఆల్ఫా తలసీమియా ఉన్నవారు సాధారణ రక్తహీనతతో బాధపడుతుంటారు.

హిమోగ్లోబిన్ (హెచ్) వ్యాధి : నాలుగు ఆల్ఫా-గ్లోబిన్ జన్యువుల్లో మూడు దెబ్బతిన్నప్పుడు ఒక జన్యువు మాత్రమే పనిచేసే స్థితిని హిమోగ్లోబిన్ (హెచ్) వ్యాధి అంటారు. దీని ఫలితంగా తీవ్రమైన రక్తహీనత ఏర్పడుతుంది.

ఆల్ఫా తలసీమియా మేజర్ : ఈ దశలో మొత్తం నాలుగు ఆల్ఫా-గ్లోబిన్ జన్యువులు దెబ్బతింటాయి. అందువల్ల తీవ్రమైన రక్తహీనత కలుగుతుంది. గర్భధారణ సమయంలో ఈ వ్యాధి సోకితే కడుపులో బిడ్డకు సైతం ప్రమాదం కలిగే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్తున్నారు.



బీటా తలసీమియా : బీటా తలసీమియా కూడా వారసత్వంగా వచ్చే జన్యుపరమైన వ్యాధి. బీటా తలసీమియా ఉన్నవారు ఎర్రరక్త కణాల్లో సాధారణ హిమోగ్లోబిన్(ఏ), అసాధారణమైన హిమోగ్లోబిన్(బీ) రెండింటిని కలిగి ఉంటాయి. బీటా తలసీమియాతో బాధపడుతున్న వ్యక్తులకు రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటం వల్ల శరీరంలోని వివిధ భాగాలకు తగినంతగా అక్సిజన్ అందక ఇబ్బంది పడుతుంటారు.

బీటా తలసీమియా మేజర్ (కూలీస్ అనీమియా) : ఇది అత్యంత తీవ్రవమైన రకం. బీటా తలసీమియా మేజర్‌లో రెండు దెబ్బతిన్న బీటా-గ్లోబిన్ జన్యువులను కలిగి ఉంటుంది. ఈ పరిస్థితి ఉన్న వ్యక్తులకు తరుచూ రక్తమార్పిడి చేయాల్సి అవసరం ఉంటుంది.

బీటా తలసీమియా మైనర్ : నాలుగు బీటా-గ్లోబిన్ జన్యువులలో ఒకటి దెబ్బతిన్న బీటా-గ్లోబిన్ జన్యువును మాత్రమే కలిగి ఉంటుంది. అందువల్ల తేలికపాటి రక్తహీనత లక్షణాలు కలిగి ఉంటారు. బీటా తలసీమియా మైనర్ రెండు రకాలు ఉంటాయి. ఈ దశలో రెండు దెబ్బతిన్న బీటా-గ్లోబిన్ జన్యువులను కలిగి ఉంటుంది. ఈ రకమైన తలసీమియా ఉన్నవారికి తరుచూ రక్తమార్పిడి అవసరం ఉండదు. ఇది మధ్యస్థ నుంచి తీవ్రమైన రక్తహీనతకు కారణమయ్యే పరిస్థితి ఉంటుంది.

- తలసీమియాకు సరైన చికిత్స లేదనేది అపోహ మాత్రమే. ప్రస్తుతం మారిన కాలానుగుణంగా ఈ సమస్యకు రక్తమార్పిడి, ఐరన్ కిలేషన్ థెరపి, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ వంటి ఆధునాతన చికిత్సలతో తలసీమియాను నయం చేసుకోవడమే కాక సుదీర్ఘమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చును.
- తలసీమియాకు ప్రస్తుతం ఎముకల మజ్జలో ఉన్న కణాలను మార్పిడి చేసే (బోన్‌మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్) నూతన చికిత్స ద్వారా ఈ వ్యాధిని నయం చేసుకోవచ్చు. అయితే ఈ వ్యాధిగ్రస్తులు ఎల్లప్పుడు హిమోగ్లోబిన్ కనీస స్థాయిలు 9-10 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. ఐరన్ సంబంధిత మందులు, వంటపాత్రలను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. కాల్షియం (ఎముకలను బలపరిచే) పదార్థాలను ఎక్కువగా తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

శ్రామికులకు భరోసా

- ప్రమాద బీమా వర్తింపు ● 80 శాతం పూర్తి చేశామంటున్న అధికారులు
- ప్రమాదం జరిగితే బ్యాంక్‌లను సంప్రదించాలంటున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 7 (ఆంధ్రజ్యోతి) : జాబ్‌కార్డు కలిగి జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న శ్రామికులందరికీ ప్రమాద బీమా చేయించి వారికి వారి కుటుంబ సభ్యులకు బీమా ఉండేందుకు కూటమి ప్రభుత్వం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డిప్యూటీ ఉపముఖ్య మంత్రి కొణిదేల పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఎర్రగొండపాలెం మండల పరిధిలో సుమారు 19వేలు జాబ్ కార్డులు (జనరల్ మరియు చెంచు) ఉన్నాయి. వాటిలో సుమారు 40వేల మంది శ్రామికులు పనులు చేస్తున్నారు. శ్రామికులందరికీ ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంపై అవగాహన కల్పిండంతో పాటు వారందరికి ప్రమాద బీమా చెల్లింపు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, ఏపీఓ శైలజ చెబుతున్నారు.

బీమా పథకంతో లబ్ధి ఇలా..

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా ఏడాదికి ఒక వ్యక్తికి రూ.20 ప్రీమియం చల్లించాలి. 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులు.

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం ఒకరికి ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలి. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లవారు ఈ పథకానికి అర్హులు అవుతారు. ప్రీమియం చెల్లింపు ఏడాదిలోపు శ్రామికులకు ప్రమాదం, ఏ కారణం చేత మరణిస్తే కుటుంబంలోని నామినీకి రూ.2లక్షల బీమా బ్యాంక్ అధికారులు అందజేస్తారు. ఈ రెండు పథకాల ద్వారా ఉపాధి హామీ పనులు చేసే వారి కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. అందుకు సంబంధించిన వివరాలను ఆ శాఖ అధికారులు సేకరించి బ్యాంకులకు అందజేస్తున్నారు.

ఉపాధి శ్రామికుల ప్రమాద పరిహారం పెంపుపై హర్షం

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న సమయంలో చనిపోతే గతంలో రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేది. కానీ ఈ ఎక్స్‌గ్రేషియా రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు పెంచుతూ సోమవారం జీవో జారీ చేయడంతో పలువురు శ్రామికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశాల్లో గాయపడి శాశ్వత వైకల్యం చెందిన, పూర్తిగ మంచానపడిన వాటి పరిహారాన్ని కూడా ప్రభుత్వం పెంచింది.

ప్రమాద బీమాపై పూర్తిస్థాయిలో అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రమాద బీమా పథకంపై ఎప్పటికప్పుడు మండలంలోని ప్రతి శ్రామికులకు పని ప్రదేశాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా వయస్సు పెద్దవారికి అవగాహన కల్పిస్తున్నాం. పనులు జరిగే ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించాం.

- బండారు శ్రీనివాసులు, ఎంపీడీవో

80 శాతం పూర్తి చేశాం

రాష్ట్ర ప్రభుత్వ అదేశాలతో మండలంలోని అన్ని గ్రామాల్లోని శ్రామికులకు ఈ రెండు పథకాలపై అవగాహన కల్పించాం. అందరి సహకారంతో ఇప్పటికీ 80 శాతం పూర్తి చేశాం.

- శైలజ, ఏపీవో

బ్యాంకులను సంప్రదించాలి

ఉపాధి శ్రామికులకు ప్రమాద, సాధారణ మరణాలు జరిగితే వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా బ్యాంక్‌లను సంప్రదించాలి. మరణించిన వారి ఖాతా, ఆధార్, డెత్ తదితర పత్రాలు అందజేస్తే వారి బీమాను పరిశీలించి అర్హత ఉంటే నామినీకి రూ.2లక్షలు అందిస్తుంది.

- నాగేశ్వరరావు, ఐటీడీఏ ప్రత్యేకాధికారి



పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఎర్రగొండపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ రాజశేఖరరెడ్డిని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ్ సస్పెండ్ చేశారు. ఈమేరకు ఒంగోలు డీపీవో కార్యాలయానికి ఉత్తర్వులు పంపినట్లు డీపీవో వెంకటపతి నాయుడు బుధవారం తెలిపారు. ఎర్రగొండపాలెంలోని మాచర్ల-మార్కాపురం రోడ్‌లో ఒక ప్రైవేటు స్థిరాస్తి సర్వే నెం. 58/1లో 570 చదరపు గజాలకు పన్ను రసీదు ఇచ్చినందుకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. స్థల యజమాని కాకుండా, మరొకరికి అంటే శ్రీనివాసరావుకు పన్ను రసీదు ఇవ్వడంతో స్థల యజమాని ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ స్థలానికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసిన అప్పటి తహసీల్దార్ బాలకిషోర్ 2025 ఫిబ్రవరి 18న సస్పెండ్ అయ్యారు. అదే విషయంలో రసీదు మంజూరు చేసిన పంచాయతీ కార్యదర్శి రాజశేఖర రెడ్డిని కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందినట్లు డీపీవో తెలిపారు.


రాజశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ కార్యదర్శులకు నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) :గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన 65 జీవో పట్ల తాత్సారం చేస్తున్నారన్నారు పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన సీనియారిటీ జాబితాలో పంచాయతీ కార్యదర్శులు లెవనెత్తిన న్యాయబద్ధమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తమకు పదోన్నతులు కల్పించి న్యాయంచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి బెన్‌హర్, శివరంగారావు, వెంకట్రావు, పి.నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎస్కే మీరాసాహెబ్ ఉన్నారు.

విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు సిద్ధం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ● మాక్‌డ్రిల్ నిర్వహించిన యంత్రాంగం


బాంబ్ డిస్పోజ్ చేస్తున్న సిబ్బంది

ఒంగోలు క్రైం, మే7(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్, బస్టాండ్ ముఖ్యమైన ప్రాంతాల్లో విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం యంత్రాంగం తీసుకునే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించామని అన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైయినా జిల్లా యంత్రాంగం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, రైల్వే పోలీసులతో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంఘవిద్రోహ శక్తుల చర్యలను నిర్వీరం చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా కల్పించేందుకే మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఇలాంటి మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్

రైల్వేస్టేషన్‌లో విద్రోహ శక్తులు కొన్ని ప్రాంతాల్లో తగులబెట్టి అల్లర్లు సృష్టించారు. ఈ సమాచారం తెలుసుకున్న కలెక్టర్, ఎస్పీ తమ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో తొలుత రైల్వేస్టేషన్ ముందు అల్లర్లలో గాయపడిన వారికి ఆరోగ్య శాఖ తరుపున డాక్టర్లు ప్రథమ చిక్సిత నిర్వహించారు.


బస్టాండ్‌లో మాక్ డ్రిల్

వారికి భద్రత కల్పించడానికి పోలీసు యంత్రాంగం అంతా అక్కడికి చేరుకుంది. గాయపడిన వారిని అంబులెన్స్‌లు ద్వారా ఆసుపత్రికి పంపించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీలు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా ఆ ప్రదేశంలో టిక్కెట్ కౌంటర్ వద్ద ఉన్న ప్రేలుడు పదార్థాలున్న బ్యాగ్‌ను బాంబు స్క్వాడ్ గుర్తించింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ వచ్చి బాంబును నిర్వీరం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ అంతా డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఇలా మాక్‌డ్రిల్ నిర్వహించిన తరువాత కలెక్టర్, ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడి భరోసా కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు కొన్ని ఆసుపత్రులను బాంబ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణణ, అదనపు సీఐ కె.నాగేశ్వరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు అవార్డులు

- మంత్రుల చేతుల మీదుగా అందుకున్న జిల్లా విద్యార్థులు

ఒంగోలు నగరం, మే 7 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన వసతి గృహ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ వసతి గృహాలు, సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలు, గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి, ఇంటర్ చదువుతూ ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో అత్యంత ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులకు మంత్రులు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లాలోని పీసీపల్లి ఎస్సీ హాస్టల్ విద్యార్థి గుత్తికంటి సుదర్శన్ పదవ తరగతిలో 580 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఏడవ స్థానంలో నిలిచాడు. మార్కాపురం ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న బి.మహాలక్ష్మి 578 మార్కులు సాధించి రాష్ట్రంలో తొమ్మిదో స్థానంలో నిలిచారు. పిసిపల్లి ఎస్సీ హాస్టల్‌కు చెందిన మోనిత్ 577 మార్కులు సాధించి పదవ స్థానంలో నిలిచాడు. పి.తిరుపతిరావు 575 మార్కులు సాధించి జిల్లా నుంచి ప్రతిభా అవార్డులు అందుకున్నారు. ఇంటర్‌లో ఎర్రగొండపాలెం ఎస్సీ కళాశాల వసతి గృహం విద్యార్థిని ఎం.నవ్వబాయి 961 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానం, కంభం హాస్టల్ విద్యార్థి బడిపాటి సతీష్ 929 మార్కులు, వలపర్ల వసతి గృహం అగస్టీన్ అనే విద్యార్థి 914 మార్కులు సాధించి మంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. ముండ్లమూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 17 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులు సాధించారు.


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న మంత్రులు స్వామి, సంధ్యారాణి

ఇంత మంచి ఫలితాలు రావటానికి కారణమైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.అంజనేయరెడ్డికి మంత్రుల చేతుల మీదుగా ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిగా అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, కమిషనర్ లావణ్య, గురుకుల పాఠశాల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షల షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఓపెన్ స్కూలు డైరెక్టర్ ఆర్.నరసింహరావు బుధవారం విడుదల చేశారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 19నుంచి 24వతేదీ వరకు జరుగుతాయి. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. పదవ తరగతికి 19న హిందీ, 20న ఇంగ్లీషు, 21న తెలుగు, ఉర్దు, కన్నడ, ఒరియా, తమిళం, 22న గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం, 23న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం, 24న సాంఘిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియెట్‌కు 19న ఇంగ్లీషు, 20న హిందీ, తెలుగు, ఉర్దు, 21న రసాయన శాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, 22న భౌతికశాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌరశాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, 23న గణితం, చరిత్ర, వ్యాపారగణాంక శాస్త్రం, 24న జీవశాస్త్రం, వ్యాపారశాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 26నుంచి 30 వరకు జరుగుతాయని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

నేడు టీడీపీ నేత వీరయ్యచౌదరి సంస్మరణ సభ

● ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బీఎన్



దశదిన కర్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


నాగులుప్పలపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దశదిన కర్మ, సంస్మరణ సభ గురువారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఆయా ఏర్పాట్లను బుధవారం రాత్రి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అమ్మనబ్రోలులో స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. వీరయ్యచౌదరికి టీడీపీ పెద్దలతో పాటు రాష్ట్రస్థాయి నాయకులతో పరిచయాలు ఉన్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు, వీరయ్యచౌదరి కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే బీఎన్ చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాజీ జడ్పీ చైర్మన్‌కు పరామర్శ

ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య సమాచారంతో గుండెపోటుకు గురై హైదరాబాద్‌లో చికిత్స అనంతరం అమ్మనబ్రోలు చేరుకొన్న మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబును ఎమ్మెల్యే బీఎన్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఈదర మోహన్, తేళ్ల మనోజ్‌కుమార్, గుమ్మడి సాయిబాబా, రంపతోటి అంకారావు పాల్గొన్నారు.

నేడు శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ





స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న వేదపండితులు, ప్రతిష్ఠకు సిద్ధమైన ఆలయం

ఒంగోలు(రూరల్), మే7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కమ్మపాలెం సమీపంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వార్ల విగ్రహాలను గురువారం ఉదయం 6.55గంటలకు ప్రతిష్ఠాపన జరుగుతుందని దేవాలయ ధర్మకర్త అబ్బూరి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గత మూడు రోజులు నుంచి దేవాలయ ప్రాంగణంలో హోమాలు, యాగాలను నిర్వహిస్తున్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు అబ్బూరి అనిల్, దాచర్ల రమణయ్య, భైరపునేని తిరుపతిరావు, బొల్లినేని కోటేశ్వ రరావు, నన్నపనేని ఆంజనేయులు (ఎస్‌వీబీసీ కన్వెన్షన్‌హాల్) పర్యవేక్షించారని తెలిపారు.

భగవద్గీత పారాయణంలో బంగారు పతకం



చరితారెడ్డి

ఒంగోలు(కల్చరల్), మే 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో చదువుతున్న ఇ.చరితారెడ్డి మైసూర్‌కు చెందిన గణపతి సచ్చి దానంద భగవద్గీత పారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలలో బంగారు పతకం సాధించారు. శ్రీనివాసరెడ్డి, ఉమాదేవి దంపతుల కుమార్తె అయిన చరితారెడ్డి జాతీయస్థాయిలో బంగారుపతకం సాధించటం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 18వ తేదీన మైసూర్‌లో జరిగే కార్యక్రమంలో శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదగా ఆమె బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి



పూజల్లో పాల్గొన్న భక్తులు

చీమకుర్తి, మే7 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత జయంతి వేడుకలు బుధవారం చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయం నుంచి కలశాలతో తీసుకువచ్చిన జలాలతో అమ్మవారికి అభిషేకం కనులపండవగా నిర్వహిం చారు. తదుపరి మహిళలు సామూహిక పారాయణ,సంకీర్తన నిర్వహించారు. రాత్రివేళ అమ్మవారి నగరోత్సవం విశేషంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీపద్మావతి, కుటుంబ సభ్యులు, వాసవీ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై వైసీపీ హర్షం

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన సైన్యం చేసిన దాడులపై ఒక భారతీయుడుగా గర్వపడుతున్నట్లు వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి నెలకొంటుందని, సైన్యం శక్తి సామర్థ్యాలను ఆయన అభినందించారు.

రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ వీరపాణ్యన్

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ వీరపాణ్యన్ ఆదేశించారు. బుధవారం మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయటం ద్వారా వారు ఎక్కడికి వెళ్లినా ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవచ్చని, అందువల్ల అక్కడ ఉన్న డాక్టర్లకు వైద్యం చేయడం సులభం అవుతుందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, వైద్యులు శ్రావణ్‌కుమార్, ఆనంద్‌మోహన్, జగదీష్, వినీల చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులుకు గిట్టుబాటు ధరలు కల్పించే వరకు ఉద్యమం చేస్తామని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీపీ.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి, వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, పి.అంజయ్య, శరత్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేలం కేంద్రాన్ని పరిశీలించిన మలావి దేశ ప్రతినిధి

వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం మలావి దేశం పొగాకు కంపెనీ ఎలయన్స్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధి మిలోనేవో సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కంపెనీ బయ్యర్ వెంకటేశ్వర్లు, రైతు నాయకులు మిలోనేవోతో మాట్లాడారు.

డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గద్దలగుంట మూడుబొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. 30వ డివిజన్ అధ్యక్షుడు కనకారావు డీజేఆర్ ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

200మందికి వైద్యసేవలు

ఒంగోలు విద్య, మే 7(ఆంధ్రజ్యోతి): సర్వేరెడ్డిపాలెంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ విభాగం, కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సునీత కృష్ణన్, డాక్టర్ వాసుబాబు, శిరీష, వేణుగోపాల్, పి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, హెచ్ఎం రత్నప్రసాద్, కిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధం

● కలెక్టర్ తమీమ్ అన్సారీయా

● మాక్ డ్రిల్ నిర్వహించిన యత్రాంగం



ఒంగోలు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

ఒంగోలు క్రైం, మే7(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ ముఖ్యమైన ప్రాంతాల్లో విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం యంత్రాంగం తీసుకునే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించామని అన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా జిల్లా యంత్రాంగం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, రైల్వే పోలీసులతో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంఘవిద్రోహ శక్తుల చర్యలను నిర్వీరం చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా కల్పించేందుకే మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఇలాంటి మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్

రైల్వేస్టేషన్‌లో విద్రోహ శక్తులు కొన్ని ప్రాంతాల్లో తగులబెట్టి అల్లర్లు సృష్టించారు. ఈ సమాచారం తెలుసుకున్న కలెక్టర్, ఎస్పీ తమ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో తొలుత రైల్వేస్టేషన్ ముందు అల్లర్లలో గాయపడిన వారికి ఆరోగ్య శాఖ తరుపున డాక్టర్లు ప్రథమ చికిత్స నిర్వహించారు. వారికి భద్రత కల్పించడానికి పోలీసు యంత్రాంగం అంతా అక్కడికి చేరుకుంది. గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రికి పంపించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీలు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా ఆ ప్రదేశంలో టిక్కెట్ కౌంటర్ వద్ద ఉన్న ప్రేలుడు పదార్థాలున్న బ్యాగ్‌ను బాంబు స్క్వాడ్ గుర్తించింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ వచ్చి బాంబును నిర్వీరం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ అంతా డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఇలా మాక్‌డ్రిల్ నిర్వహించిన తరువాత కలెక్టర్, ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడి భరోసా కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు కొన్ని ఆసుపత్రులను బాంబ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, అదనపు సీఐ కె.నాగే శ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీ నివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు(రూరల్), మే7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని పొగాకు వేలంకేంద్రం-2లో జరుగుతున్న వేలం ప్రక్రియను ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్సీ సమావేశం జరుగుతుందని, ఈక్రమంలో పొగాకు వ్యాపారులు, ఆయా సంస్థల యజమానులను పిలిపించి మాట్లాడతామని చెప్పారు. పొగాకు వ్యాపారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం కచ్చితంగా కొనుగోలు చేయాల్సి ఉందని, అలా చేయని వ్యాపారులపై చర్యలు తీసుకునేలా నివేదిస్తామని తెలిపారు. అనంతరం రైతు సంఘం నాయకుడు కేవీవీ.ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ రైతుల నుంచి కొనుగోలు చేయక పోవటం మోసపూరితంగా ఉందని చెప్పారు. రైతులు తెచ్చిన బేళ్లను నోబిడ్ చేయకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి తులసి, రైతు సంఘం నాయకులు వి.హనుమారెడ్డి, వీరారెడ్డి, వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునీల్, బండారు రామాంజనేయులు, పోలరపు వెంకటరామయ్య, వై.వెంకటశేషయ్య పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలి : సీఎం

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా శత్రువుల దాడి జరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికలతో ప్రజలు భయపడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పల్లామల్లిలో త్రీఫేస్ కరెంటు సరఫరా ప్రారంభం



స్విచ్చాన్ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, మే7(ఆంధ్రజ్యోతి) : పల్లామల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో త్రీఫేస్ కరెంట్ సరఫరాకు వీలుగా నూతనంగా ఏర్పాటు చేసిన సిస్టమ్‌ను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రేడియేరూమ్ సెంటర్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, బీసీకాలనీలో ఉన్న బ్రహ్మంగారి గుడిని ఎమ్మెల్యే సందర్శించి పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జా సుబ్బారావు, అన్నమనేని రాఘవయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాసరావు, లోకేష్, రామబ్రహ్మం, మన్నం శేషయ్య, సుబ్బారావు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఏడుకొండలు

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలను నియమిస్తూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ టి.జమున కడప మెడికల్ కాలేజీకి బదిలీ కాగా ఆమె బుధవారం రిలీవ్ అయ్యారు. దీంతో డాక్టర్ ఏడుకొండలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కొనసాగిన సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారానికి తొమ్మిదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, జీవనజ్యోతి, ప్రసన్న, రమేష్, దీప్తి పాల్గొన్నారు.

గ్రోత్‌సెంటర్‌లో నేడు వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ





హోమంలో పాల్గొన్న నిర్వాహకులు, ప్రతిష్ఠకు సిద్ధమైన ఆలయం

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో గురువారం వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పంచామృత స్నానం, ప్రత్యేక పూజలు ఆగమ పండితులు వింజమూరి అర్యుతానం దశర్మ, రవికుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ ఆలయాన్ని దాదాపు రూ.1.50కోట్లకుపై పైగా ఖర్చు చేసి సర్వాంగసుందరంగా నిర్మించారు. ఇందులో పరిశ్రమల యజమానులు చేయూతనివ్వగా, మైనంపాడుకు చెందిన ఆళ్ల రవి నేతృత్వంలో ఆలయానికి అన్ని హంగులు సమకూర్చారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం కాగా గురువారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్ అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతంచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో సీహెచ్.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహేష్, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, జి.రమేష్, కృష్ణమోహన్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

ఒంగోలు క్రైం, మే7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాల్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎస్పీ ఏఆర్.దామోదర్ పూల పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్రిటీష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కంచె తగిలి కూలీ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు



వెంకటేశ్వర్లు మృతదేహం

సంతనూతలపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన పి.గుడిపాడు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు, పి.గుడిపాడులోని ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలోని సుబాబుల్ పొలాల్లో కర్రను కొట్టేందుకు మాలికల వెంకటేశ్వర్లు, కత్తి దుర్గారావు వెళుతున్నారు. అయితే పక్కనే మరో పొలంలో అడవిపందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి వెంకటేశ్వర్లు(45) అక్కడిక్కడే మృతి చెందాడు. దుర్గారావు తీవ్రగాయాలు కాగా అతని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌బీఎస్‌కే ద్వారా పిల్లలకు ఉచిత శస్త్రచికిత్సలు

● కలెక్టర్ అన్సారీయా



కలెక్టర్ అన్సారియాకు వైద్యసేవలు గురించి వివరిస్తున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కింద చిన్న పిల్లలకు ఎలాంటి చికిత్సలైనా ఉచితంగా చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని జీజీహెచ్‌లో జిల్లా బాల భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్‌రే యూనిట్‌ను, పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక టెస్ట్ స్క్రీనింగ్ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 30 మంది పిల్లలను ఆపరేషన్ల కోసం గుర్తించామని, వీరికి జీజీహెచ్‌లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పిల్లలకు ఒక్కొక్కరికి మూడు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉండగా రూ.1.50లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అయితే వాటిని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, స్మైల్ ఫౌండేషన్ సహకారం ఉచితంగా చేస్తారని చెప్పారు. చికిత్స అనంతరం స్పీచ్ థెరపీ, టీత్ అలైన్‌మెంట్ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ జమున, స్మైల్ ట్రైన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుధా నాగేశ్వరరావు, జీజీహెచ్ వైద్యులు పాల్గొన్నారు.

అనంతరం జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చర్మ సంబంధిత అత్యాధునిక లేజర్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ సౌకర్యం ప్రజలందరికీ తెలిసేలా, ఉపయోగపడేలా వైద్యులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ జిల్లా వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ బాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

● నేడు ఒంగోలులో కల్యాణోత్సవం



త్రోవగుంట బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), మే 7(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానం సృష్టికర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమిని స్వామివారి ఆరాధనోత్సవంగా భావించి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయనను కొలుస్తారు. ఇక ఈ ఆరాధనోత్సవాలను అనేకచోట్ల పంచాహ్నికంగా అంటే ఐదు రోజులు నిర్వహించి చివరి రోజున శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. జిల్లాలోని అనేక ప్రాంతాలలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని అచలానంద ఆశ్రమం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి నిలయంగా ఎంతో ప్రసిద్ధి చెందగా దీని నిర్వాహకులు శ్రీపరిపూర్ణ సిద్ధానంద స్వామివారి భక్తులు. ఈ సందర్భంగా స్వామివారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం విశ్వశాంతి మహాయజ్ఞం, ఆరాధనోత్సవం, కోలాట ప్రదర్శన కన్నుల పండుగగా జరిగాయి. ఇక గురువారం ఉదయం 9 గంటల నుంచి కల్యాణోత్సవం జరుగుతుందని, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని శ్రీపరిపూర్ణ సిద్ధానంద స్వామి తెలిపారు.

స్థానిక కర్నూల్‌రోడ్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం ప్రధాన అర్చకులు మధుసూదనాచారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు గోనుగుంట వెంకటనాగబ్రహ్మాచారి, నూతలపాటి వెంకటశేషాచార్యులు పర్యవేక్షించారు.

త్రోవగుంటలో..

ఒంగోలు(రూరల్): త్రోవగుంటలో గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన సంతర్పణ జరిగింది.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవా ల్లో భాగంగా బుధవారం స్వామి వారు గజవాహనంపై దర్శనమిచ్చారు. గురుస్వామి శివ ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.

తప్పిపోయిన పాప తల్లిదండ్రుల చెంతకు..!



చిన్నారి లక్ష్మిని తల్లికి అప్పగిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గుజ్జుల యల్లమందారెడ్డి నగర్‌కు చెందిన గడిపూడి సురేష్, తిరుపతమ్మ దంపతుల ఐదేళ్ల కుమార్తె లక్ష్మి ఐదు నెలల క్రితం బాపట్ల రైల్వే స్టేషన్‌లో తప్పిపోయింది. దీంతో అక్కడ స్థానికులు పాపను ఒంగోలులోని చైల్డ్ హోంకు అప్పగించారు. అప్పటి నుంచి పాప తల్లిదండ్రుల గురించి సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో ఆరా తీయగా పాప తల్లిదండ్రులు గుజ్జుల యల్లమందారెడ్డికి చెందిన సురేష్, తిరుపతమ్మగా గుర్తించారు. దీంతో బుధవారం తల్లి తిరుపతమ్మను స్టేషన్‌కు పిలిపించి ఎస్సై మహేంద్ర వారి పాప లక్ష్మిని అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.

తలసీమియాకు ఆదిలోనే అడ్డుకట్ట!

జిల్లాలో 75 కేసుల నమోదు ● బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులు

నేడు ప్రపంచ తలసీమియా వ్యతిరేక దినం

ఎర్రరక్త కణాల్లో ఉండే హిమోగ్లోబిన్‌ను శరీరం తగినంతగా ఉత్పత్తి చేయనప్పుడు ఏర్పడే రక్తవ్యాధినే తలసీమియా అంటారు. రక్తంలోని ఆక్సిజన్‌ను శరీరంలోని వివిధ భాగాలకు తీసుకెళ్లడంలో హిమోగ్లోబిన్ కీలకపాత్ర పోషిస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో ఎముక మజ్జ (బోన్ మ్యారో) శరీరానికి కావాల్సిన హిమోగ్లోబిన్ లేదా ఎర్రరక్త కణాలను తయారు చేయకపోవడంతో శరీరంలోని అన్ని కణాలకు తగినంత ఆక్సిజన్ అందదు. చిన్నారుల్లో ఎక్కువగా ఉండే ఈ సమస్య నివారణ కోసం ప్రపంచ వ్యాప్తంగా తలసీమియా నివారణ దినాన్ని ఏటా మే 8వ తేదీన నిర్వహిస్తున్నారు..

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మండలాల్లో ఒకట్రెండు తలసీమియా కేసులు ఉన్నాయి. అంటే విభజిత జిల్లాలో ప్రస్తుతం 75 తలసేమియా కేసులు నమోదయ్యాయి. ఎక్కువగా రెండు సంవత్సరాల్లోపు వారికి వస్తోంది. మన శరీరంలో ఎర్రరక్తకణాలు లేదా హిమోగ్లోబిన్ ఉండాల్సిన మోతాదులో లేనప్పుడు తలసీమియాతో పాటు రక్తహీనత సమస్య కూడా కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొన్ని జన్యుపరమైన మార్పుల వల్ల కూడా తలసేమియా రావచ్చని వైద్యులు చెప్తున్నారు.

తలసీమియాలో రకాలు...

తలసీమియాలో రెండు రకాలు ఉంటాయి. ఆల్ఫా(ఏ) తలసేమియా, బీటా(బీ) తలసీమియా ఉంటాయి. ఇందులో ఒక్కొక్క రకానికి వేర్వేరు జన్యువులు ప్రభావం అవుతాయి. అలా శరీరంలోని హిమోగ్లోబిన్ తయారు చేసే నాలుగు జన్యువులు దెబ్బతిన్నప్పుడు ఈ తలసేమియా వస్తుందని, ఈ ఆల్ఫా తలసేమియాలో రకాలు ఉంటాయని వైద్యులు చెప్తున్నారు. ఆల్ఫా-గ్లోబిన్ జన్యువులలో ఒకటి దెబ్బతిన్నప్పుడు మిగిలిన మూడు సాధారణంగా పనిచేసే స్థితినే ఆల్ఫా తలసీమియా సైలెంట్ క్యారియర్ అంటారు. ఈ దశలో ఎర్రరక్త కణాలు సాధారణం కంటే చిన్నవిగా ఉంటాయి. ఈ సమయంలో తలసీమియా వ్యాధి లక్షణాలు ఏమీ కనిపించవు. ఈ దశలో రెండు జన్యువులు దెబ్బతిన్నప్పుడు మిగతా రెండు పనిచేసే స్థితిలో ఆల్ఫా తలసీమియా ఉన్నవారు సాధారణ రక్తహీనతతో బాధపడుతుంటారు.

హిమోగ్లోబిన్ (హెచ్)వ్యాధి : నాలుగు ఆల్ఫా-గ్లోబిన్ జన్యువుల్లో మూడు దెబ్బతిన్నప్పుడు ఒక జన్యువు మాత్రమే పనిచేసే స్థితిని హిమోగ్లోబిన్ (హెచ్) వ్యాధి అంటారు. దీని ఫలితంగా తీవ్రమైన రక్తహీనత ఏర్పడుతుంది.

ఆల్ఫా తలసీమియా మేజర్ : ఈ దశలో మొత్తం నాలుగు ఆల్ఫా-గ్లోబిన్ జన్యువులు దెబ్బతింటాయి. అందువల్ల తీవ్రమైన రక్తహీనత కలుగుతుంది. గర్భధారణ సమయంలో ఈ వ్యాధి సోకితే కడుపులో బిడ్డకు సైతం ప్రమాదం కలిగే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్తున్నారు.

బీటా తలసీమియా : బీటా తలసీమియా కూడా వారసత్వంగా వచ్చే జన్యుపరమైన వ్యాధి. బీటా తలసేమియా ఉన్నవారు ఎర్రరక్త కణాల్లో సాధారణ హిమోగ్లోబిన్(ఏ), అసాధారణమైన హిమోగ్లోబిన్(బీ) రెండింటిని కలిగి ఉంటాయి. బీటా తలసీమియాతో బాధపడుతున్న వ్యక్తులకు రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటం వల్ల శరీరంలోని వివిధ భాగాలకు తగినంతగా ఆక్సిజన్ అందక ఇబ్బంది పడుతుంటారు.

బీటా తలసీమియా మేజర్ (కూలీస్ అనీమియా) : ఇది అత్యంత తీవ్రవమైన రకం. బీటా తలసేమియా మేజర్‌లో రెండు దెబ్బతిన్న బీటా-గ్లోబిన్ జన్యువులను కలిగి ఉంటుంది. ఈ పరిస్థితి ఉన్న వ్యక్తులకు తరుచూ రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది.

బీటా తలసీమియా మైనర్ : నాలుగు బీటా-గ్లోబిన్ జన్యువులలో ఒకటి దెబ్బతిన్న బీటా-గ్లోబిన్ జన్యువును మాత్రమే కలిగి ఉంటుంది. అందువల్ల తేలికపాటి రక్తహీనత లక్షణాలు కలిగి ఉంటారు. బీటా తలసేమియా మైనర్ రెండు రకాలు ఉంటాయి. ఈ దశలో రెండు దెబ్బతిన్న బీటా-గ్లోబిన్ జన్యువులను కలిగి ఉంటుంది. ఈ రకమైన తలసీమియా ఉన్నవారికి తరుచూ రక్తమార్పిడి అవసరం ఉండదు. ఇది మధ్యస్థ నుంచి తీవ్రమైన రక్తహీనతకు కారణమవుతుంది.



సాధారణ రక్తకణాలు



తలసీమియా రక్తకణాలు

- తలసీమియాకు సరైన చికిత్స లేదనేది అపోహ మాత్రమే. ప్రస్తుతం మారిన కాలానుగుణంగా ఈ సమస్యకు రక్తమార్పిడి, ఐరన్ కిలేషన్ థెరపి, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ వంటి ఆధునాతన చికిత్సలతో తలసీమియాను నయం చేసుకోవడమే కాక సుదీర్ఘమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చును.
- తలసీమియాకు ప్రస్తుతం ఎముకల మజ్జలో ఉన్న కణాలను మార్పిడి చేసే (బోన్‌మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్) నూతన చికిత్స ద్వారా ఈ వ్యాధిని నయం చేసుకోవచ్చు. అయితే ఈ వ్యాధిగ్రస్తులు ఎల్లప్పుడు హిమోగ్లోబిన్ కనీస స్థాయిలు 9-10 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. ఐరన్ సంబంధిత మందులు, వంటపాత్రలను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. కాల్షియం (ఎముకలను బలపరిచే) పదార్థాలను ఎక్కువగా తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

తాలూకా సీఐపై వేటు

వీరయ్యచౌదరి హత్య కేసులో నిర్లక్ష్యమే కారణం

విజయకృష్ణ నియామకం

ఒంగోలు క్రైం, మే7 (ఆంధ్రజ్యోతి) : వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసుల వైఫల్యం గుర్తించిన ఉన్నతాధికారులు ఒంగోలు తాలూకా సీఐగా పనిచేస్తున్న అజయ్ కుమార్‌ను వీఆర్‌కు పిలిచారు. వీఆర్‌లో ఉన్న విజయకృష్ణను తాలూకా సీఐగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. తాలూకా పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో వీరయ్యచౌదరి కార్యాలయం ఉంది. అక్కడ విచక్షణారహితంగా కిరాయి హంతకులు వీరయ్యచౌదరిని హత్య చేశారు. అదే సమయంలో తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న హోటల్‌లో రెండు నెలల పాటు మకాం వేసి రెక్కీ నిర్వహించారు. ఇలా అనేక వైఫల్యాలు పోలీసులవైపు నుంచి ఉన్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు తాలుకా సీఐ అజయ్‌కుమార్‌పై వేటు వేశారు. వీరయ్య చౌదరి హత్య జరిగిన తర్వాత కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మరో హత్య జరిగింది. ఇలా నగరంలో రౌడీషీటర్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో మొదటి చర్యగా తాలూకా సీఐని వీఆర్‌కు పిలింపించారు. ఇంకా కొంతమంది అధికారులపై చర్యలు ఉండే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.



వసతిగృహ విద్యార్థులకు అవార్డులు

● మంత్రుల చేతుల మీదుగా అందుకున్న జిల్లా విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న మంత్రులు స్వామి, సంధ్యారాణి

ఒంగోలు నగరం, మే 7 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన వసతి గృహ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ వసతి గృహాలు, సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలు, గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి, ఇంటర్ చదువుతూ ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ప్రకాశం జిల్లాలోని పీసీపల్లి ఎస్సీ హాస్టల్ విద్యార్థి గుత్తి కంటి సుదర్శన్ పదవ తరగతిలో 580 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఏడవ స్థానంలో నిలిచాడు. మార్కాపురం ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న బి.మహాలక్ష్మి 578 మార్కులు సాధించి రాష్ట్రంలో తొమ్మిదో స్థానంలో నిలిచారు. పీసీపల్లి ఎస్సీ హాస్టల్‌కు చెందిన మోనిత్ 577 మార్కులతో పదవ స్థానంలో నిలిచాడు. పి.తిరుపతిరావు 575 మార్కులు సాధించి జిల్లా నుంచి ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఇంటర్‌లో ఎర్రగొండపాలెం ఎస్సీ కళాశాల హాస్టల్ విద్యార్థిని ఎం.నవ్యబాయి 961 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానం, కంభం హాస్టల్ విద్యార్థి బడిపాటి సతీష్ 929, వలపర్ల వసతిగృహం అగస్టిన్ అనే విద్యార్థి 914 మార్కులు సాధించి పు రస్కారాలు అందుకున్నారు. ముండ్లమూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 17 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులు సాధించారు. ఇంత మంచి ఫలితాలు రావటాని కి కారణమైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.అం జనేయరెడ్డికి మంత్రుల చేతుల మీదుగా ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిగా అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంఘి క సంక్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, కమిషనర్ లావణ్య, గురుకుల పాఠశాల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

డైట్ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

● 20 మంది జాబితాకు ఆమోదం

ఒంగోలు విద్య, మే 7 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న సీనియర్ లెక్చరర్, లెక్చరర్ పోస్టులను పొరుగు సేవల విధానంలో భర్తీ చేసేందుకు పాఠశాల విద్య కమిషనర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అందుకోసం ఎంపిక చేసిన 20మంది ఫ్యాకల్టీ జాబితాకు ఆమోదముద్ర వేశారు. డైట్‌లో 6 సీనియర్ లెక్చరర్, 17 అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వీటి కోసం మొదట 45 మంది దరఖాస్తు చేశారు. ఎంపికకు నిర్వహించిన ట్యాబ్ పరీక్షకు 33 మంది హాజరయ్యారు. వీరందరికీ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో 50 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్యాబ్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ మార్కులు కలిపి మెరిట్ జాబితాను తయారు చేశారు. వీరిలో 20 మందిని ఎంపిక చేస్తూ జాబితాను కమిషనర్ బుధవారం విడుదల చేశారు. మొత్తం 23 ఖాళీలకు 20 మాత్రమే భర్తీ అవుతున్నాయి. ప్రస్తుత డైట్‌కు ఎంపికైన వారు పొరుగు సేవల విధానంలో పనిచేయాలి. డైట్‌లో వీరి ప్రాథమిక కాలపరిమితి ఒక సంవత్సరమే. విధుల్లో చేరాక అందరూ ఒక అంగీకారపత్రాన్ని ఇవ్వాలి. ఏమైనా కారణాలతో తమను ఎప్పుడైనా, ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించేందుకు సమ్మతమేనని అందులో పేర్కొనాలి. ఆర్జేడీ, డీఈవోలు వీరిని వెంటనే రిలీవ్ చేసి వీరి స్థానంలో బోధనకు ఆటంకం కలగకుండా పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పోస్టులకు ఎంపికైంది వీరే..

టీచర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు పి.విజయకృష్ణ, పి.మెర్సీన్‌బాబు, పి.లక్ష్మీనాగప్రసూన, ఎం.మల్లికార్జునరావులు ఎంపికయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగుకు ఈ.శివప్రసాదరెడ్డి, కేఎన్‌వీ భార్గవి, జి.కోటిరెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీషుకు పి.రమేష్‌బాబు, ఎన్.కిషోర్‌బాబు, యూ.నాగకుమారి సెలక్ట్ అయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమాటిక్స్‌కు వి.మార్కండేయులు, యు.రామకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈవీఎస్‌కు బి.తిరుపతయ్య, ఆర్.జగన్నాథరావు, ఎన్‌వి.సుబ్బయ్యలు ఎంపికయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్‌కు మహేంద్రబాబు, ఎం.శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ స్టడీస్ అండ్ హ్యూమనిటీస్‌కు ఐ.సర్దార్ పాపారాయుడు, టి.వి.రామచంద్రరావులను ఎంపిక చేశారు.

అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక గుంటూరు రోడ్డులోని ఆయన విగ్రహానికి ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్. విజయకుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి ఎదురొడ్డి అడవిబిడ్డలకు అండగా నిలిచి 27 ఏళ్ల వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన యోధుడు అల్లూరి అని కీర్తించారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, సెప్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకరి విల్లాస్ వద్ద టిప్పర్ల వ్యాపారి ధర్నా

ఒంగోలు క్రైం, మే7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగముక్కపాలెం వద్ద ఉన్న శ్రీకరివిల్లాస్ ప్రధాన ద్వారం వద్ద టిప్పర్ల వ్యాపారి దుగ్గిరాల అజయ్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. విల్లాస్ యజమాని తనతో 2022 నుంచి ఇసుక, గ్రావెల్ తోలించుకొని అందుకు సంబంధించి రూ.57 లక్షలు నగదు ఇవ్వాలని అన్నారు. అడుగుతుంటే కొంతకాలం ఎన్నికల కారణం చెప్పి వాయిదా వేశాడని, ఇప్పుడు ఫోన్‌కు కూడా స్పందించడం లేదని, ఎలాంటి సమాధానమూ ఇవ్వడంలేదని అజయ్ కుమార్ వాపోయరు. తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని, తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించి తమ కుటుంబాన్ని రోడ్డున పడకుండా చూడాలని వేడుకున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) :గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన 65 జీవో పట్ల తాత్సారం చేస్తున్నారన్నారు పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన సీనియారిటీ జాబితాలో పంచాయతీ కార్యదర్శులు లెవనెత్తిన న్యాయబద్ధమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తమకు పదోన్నతులు కల్పించి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, ప్రధానకార్యదర్శి బెన్‌హర్, శివరంగారా వు, వెంకట్రావు, పి.నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, మీరాసాహెబ్ ఉన్నారు.

ఓపెన్ స్కూలు పరీక్షల షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఓపెన్ స్కూలు డైరెక్టర్ ఆర్.నరసింహారావు బుధవారం విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 19నుంచి 24వతేదీ వరకు జరుగుతాయి. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. పదవ తరగతికి 19న హిందీ, 20న ఇంగ్లీషు, 21న తెలుగు, ఉర్దు, కన్నడ, ఒరియా, తమిళం, 22న గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం, 23న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం, 24న సాంఘిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియెట్‌కు 19న ఇంగ్లీషు, 20న హిందీ, తెలుగు, ఉర్దు, 21న రసాయన శాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, 22న భౌతికశాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌరశాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, 23న గణితం, చరిత్ర, వ్యాపారగణాంక శాస్త్రం, 24న జీవశాస్త్రం, వ్యాపారశాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 26నుంచి 30 వరకు జరుగుతాయని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

సమ్మె నోటీసుల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 20వతేదీన జరగనున్న సమ్మె నోటీసును బుధవారం ఏపీ పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ జిల్లా కమిటీ ప్రతినిధులు ఒంగోలులో సివిల్ సప్లయీస్ డీఎంకు అందజేశారు. సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు, గోపీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రునివాళి



మరణం:
22-04-2025

కీ॥శే॥ శ్రీ ముప్పవరపు వీరయ్యచౌదరి గారు, Ex.MPP

(తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి)

అతనొక నిప్పు కణిక... భయమే తెలియని ధీరుడు
అతనొక యోధుడు... బంధుత్వాలకన్నా పార్టీనే ప్రాణం అంటూ అడుగులు వేశాడు.
తెలుగుదేశం పార్టీకి కష్టకాలంలో అండగా నిలబడి.. యువనేతకు దగ్గరయ్యాడు...
మా **వీరయ్య చౌదరి** గారిని ఎదురుగా ఎదుర్కొనలేని వాళ్ళు కాపు కాసి కిరాయిహత్య చేయించారు...
ఆయన హత్య వార్త మమ్మల్ని ఎంతగానో కలచివేసింది...
ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...

తేళ్ళ మనోజ్‌కుమార్
తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు
నాగులుప్పలపాడు మండలం

ఇంటూరి శ్రీనివాసరావు
సంతనూతలపాడు నియోజకవర్గ
తెలుగు రైతు అధ్యక్షులు, చేకూరపాడు

మెట్టు సుబ్బయ్యనాయుడు
తెలుగుదేశం పార్టీ మండల
కోశాధికారి, మెట్టువానిపాలెం

స్వర్ణ కిషోర్‌బాబు
తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు
మద్దిరాలపాడు

ఈదర వెంకట కృష్ణారావు(నాని)
కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షులు
10వ క్లస్టర్ ఇన్‌చార్జి, అమ్మనబ్రోలు

భాష్పాంజలి



మరణం:
22-04-2025

స్వర్గీయ ముప్పవరపు వీరయ్యచౌదరి గారు

Ex.MPP - నాగులుప్పలపాడు

(తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి)

అత్యంత ఆప్తుడు, శ్రేయోభిలాషి, మా అందరితో కలిసిమెలిసి ఉంటూ మృత్యువుకు దగ్గరై
తిరిగిరానిలోకాలకు వెళ్ళిన శ్రీ **ముప్పవరపు వీరయ్యచౌదరి** గారి మరణానికి చింతిస్తూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

మీ మామ
ఈదర మోహన్‌బాబు
Ex.చైర్మన్, ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్

మీ సోదరులు
కామేపల్లి శ్రీనివాసరావు
Ex.AMC చైర్మన్

మీ సోదరులు
నాగబోయిన చలపతిరావు

మీ మామ
ఈదర రంగారావు

అశ్రునివాళి



కీ॥శే॥ శ్రీ ముప్పవరపు వీరయ్యచౌదరి గారు

మాజీ ఎంపీపీ, నాగులుప్పలపాడు

(తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి)

మరణం : 22-04-2025

స్వర్గీయ శ్రీ **ముప్పవరపు వీరయ్యచౌదరి** గారి
అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ... "ఓం శాంతి"
మీ...

గుమ్మడి సాయిబాబు మద్దిరాలపాడు	కాకర్ల లక్ష్మీవరప్రసాద్ కె.తక్కెళ్ళపాడు (చిన్నా) మండల టీడీపీ కార్యదర్శి, నాగులుప్పలపాడు	యస్.కె.ఖాజావలి మండల టీడీపీ మాజీ అధ్యక్షులు, మద్దిరాలపాడు	కనగాల శ్రీనివాసరావు టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి, ఉప్పుగుండూరు
కాట్రగడ్డ చంద్రబాబు గ్రామ టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరు	నెప్పల కృష్ణమూర్తి మాజీ సర్పంచ్ మద్దిరాలపాడు	స్వర్ణ అనూరాధ సర్పంచ్ మద్దిరాలపాడు	పెనుబోతు సునీల్‌బాబు ఉప సర్పంచ్, గ్రామ టీడీపీ అధ్యక్షులు, మద్దిరాలపాడు
నెప్పల శివకృష్ణ యూనిట్ ఇన్‌చార్జి మద్దిరాలపాడు	కాటా శ్రీనివాసరావు మద్దిరాలపాడు	పెనుబోతు శ్రీనివాసరావు మద్దిరాలపాడు	తాళ్ళూరి శ్రీఆంజనేయులు మద్దిరాలపాడు
పాలడుగు మురళి మద్దిరాలపాడు	శిరిమళ్ళ జక్రయ్య డీలర్, మద్దిరాలపాడు	స్వర్ణ ఆనిరిథ్ డీలర్, మద్దిరాలపాడు	అంచుపోగు ముత్తయ్య మద్దిరాలపాడు
షేక్ ఖాజావలి (జె.సి.బి) మద్దిరాలపాడు	బరకం పార్వతి ఫీల్డ్ అసిస్టెంట్, మద్దిరాలపాడు	మారెళ్ళ రాజేంద్రప్రసాద్ మండువవారిపాలెం	మన్నం వెంకటస్వామి మాజీ సర్పంచ్, ఏడుగుండ్లపాడు
కె.సెల్వం బీసీ నాయకులు ఉప్పుగుండూరు	నల్లూరి భాస్కరరావు ఉప్పుగుండూరు	బెల్లం శ్రీనివాసరావు ఉప్పుగుండూరు	పొట్లూరి నాగమల్లేశ్వరరావు ఎస్సీ నాయకులు, ఉప్పుగుండూరు
గోగినేని శేషగిరిరావు ఉప్పుగుండూరు	బెల్లం నమ్మయ్య ఉప్పుగుండూరు	పిన్నిక శ్రీకాంత్ ఉప్పుగుండూరు	గడ్డిపాటి రామకృష్ణ ఉప్పుగుండూరు
కరణం శివశంకరరావు చేకూరపాడు	కోడెల వెంకయ్య చేకూరపాడు	ముప్పవరపు సుబ్బారావు చేకూరపాడు	వద్దినేని ఆంజనేయులు చేకూరపాడు
కరణం మోహన్ గ్రామ టీడీపీ అధ్యక్షులు చేకూరపాడు	తుమ్మల పవన్‌భూషన్ చేకూరపాడు	దాసరి సురేష్ గ్రామ టీడీపీ అధ్యక్షులు చదలవాడ	కొల్లా ఆంజనేయులు మాజీ సర్పంచ్ చదలవాడ

గుమ్మా వేణుగోపాల్ చదలవాడ	వల్లంశెట్టి శ్రీనివాసరావు చదలవాడ	బోయిడి బ్రహ్మరాజు చదలవాడ	పోలినేని హనుమంతరావు ఓబన్నపాలెం	పోలినేని కిషోర్‌బాబు ఓబన్నపాలెం	పోలినేని వెంకటేశ్వర్లు సర్పంచ్, ఓబన్నపాలెం	కట్టా వెంకటరావు ఉప సర్పంచ్, ఓబన్నపాలెం	మండవ విజయ్‌కుమార్ Ex. సర్పంచ్, ఆడిటర్ ఓబన్నపాలెం	ఒక్కంటి శ్రీనివాసరావు Ex. సర్పంచ్ ఓబన్నపాలెం

మండవ ప్రసాదరావు సొసైటీ మాజీ అధ్యక్షులు ఓబన్నపాలెం	ఉన్నం చంద్రారావు, వినోదరాయునిపాలెం కరస్పాండెంట్ విజయభారతి విద్యాసంస్థలు, ఒంగోలు	ఈదర రాజశేఖర్ చవటపాలెం	గోరంట్ల మోహన్‌రావు చవటపాలెం	జాగర్లమూడి వెంకటేశ్వర్లు(జె.డి) చవటపాలెం	బైరపనేని రాజశేఖర్(బుజ్జి) చవటపాలెం	కాట్రగడ్డ రమేష్ చవటపాలెం

కొత్త రేషన్ కార్డులకు అవకాశం



మార్కాపురం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నూతన రేషన్ కార్డులతోపాటు అలాగే మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. బుధవారం కార్యాలయంలోని చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలలో నూతనంగా వివాహమైన వారు తల్లిదండ్రుల రేషన్ కార్డుల నుంచి డిలీట్ అయి నూతన రేషన్ కార్డులను తీసుకోవచ్చని తెలిపారు. పిల్లలు ఉంటే వారిని కూడా రేషన్ కార్డులో చేర్పించుకునేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు. అలాగే మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఉద్యోగంలో ఉన్నవారు కార్డులను తహసీల్దార్ కార్యాలయం లేదా సచివాలయాలలో అప్పగించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూతన రేషన్ కార్డులు పొందటానికి, మార్పులు చేర్పులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీఎస్ నారాయణరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. నూతన రేషన్ కార్డులు, కార్డు విభజన, కుటుంబ సభ్యుల చేర్పులు, మార్పులకు ఈనెల 7 నుంచి నెల రోజుల పాటు అందుబాటులోని సచివాలయాలలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

టీడీపీలో కార్యకర్తలకు సముచిత స్థానం

ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, మే 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో కార్యకర్తల కు సముచిత స్థానం ఉంటుందని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులోని ప్రైవేటు కళాశాలలో మండలంలో టీడీపీ అనుబంధ సంఘాల కమిటీ ఎంపిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చే స్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలతో రాష్ట్రం దివాళా తీసిన సంగతిని ప్రజలకు వివరించి, టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసులరెడ్డి, చంద్రగుంట్ల నాగేశ్వరరావు, గుమ్మా గంగరాజు, జడ్డా రవి, ఇజ్రాయిల్, ఆనెకాళ్ల శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గిద్దలూరు టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థులు, యువతలో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాచర్ల రోడ్డులో క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని పలువురు నిర్వాహకులు ఏర్పాటు చేయగా బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్తేజ పరిచారు. ఇటువంటి కేంద్రాలలో శిక్షణ పొందిన వారు భవిష్యత్‌లో రాణించాలన్నారు. గిద్దలూరు ప్రాంతంలో ఇటువంటి కేంద్రం రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, ఓబయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భరతనాట్యంపై శిక్షణ

గిద్దలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం చిన్నారులకు భరతనాట్యం నేర్పించారు. ఖోఖో పోటీల్లో మెళకువలను నేర్పించారు. మానసిక, శారీరక ఆనందం కోసం ఖాళీ సమయాలలో ఆట పాటల్లో పాల్గొనాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో బుధవారం జరిగిన శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. గ్రంథ పఠనం, కథలు చెప్పడం, చదవడం నేర్పించారు. స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు పీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న బలిజ సేవా సంఘం

కంభం, మే 7 (ఆంధ్రజ్యోతి) : గత మార్చిలో జరిగిన టెన్త్ పరీక్ష ఫలితాలలో మెరిట్ సాధించిన కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల కాపు సామాజిక వర్గానికి చెందిన 9 మంది విద్యార్థులకు శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం జ్ఞాపిక, శాలువలతో సన్మానించారు. కాత్యా యూనిట్ వారు ఒక్కో విద్యార్థికి రూ.500 ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఇంటర్‌లో కూడా మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘ అధ్యక్షుడు తోట కోటేశ్వరరావు, కార్యదర్శి రఘువీర్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్, పాండు, ఉపాధ్యక్షుడు సూరె ప్రసాద్, మల్లికార్జున పాల్గొన్నారు.

నైపుణ్యాలతో కూడిన ఉపాధి కల్పనే కీలకం

మార్కాపురం వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఉన్నత విద్యారంగంలో నైపుణ్యాలతో కూడిన ఉపాధి కల్పనే కీలకమని జిల్లా నైపుణ్య శిక్షణ సంస్థ మేనేజర్ జింకా రవితేజ అన్నారు. స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలోని నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కళాశాలకు అందించిన పరికరాలు, సాంకేతిక సామగ్రి నైపుణ్య శిక్షణ విధానాన్ని ఉపాధి కల్పన దిశగా డిగ్రీ కళాశాల అనుసరిస్తున్న విధానాలను రవితేజ పరిశీలించారు. రాష్ట్ర నైపుణ్య శిక్షణ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యోగ కల్పనలతో పాటు కళాశాల నేరుగా ప్రముఖ ఐటీ సంస్థలతో కుదుర్చుకున్న ఉపాధి ఒప్పందాలను, గత పదేళ్లుగా ఉద్యోగాలు సాధించిన వారి జాబితాలను పరిశీలించి కళాశాల ప్రాంగణ నియామక విభాగం పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ కుమార్, శిక్షణ విభాగం సమన్వయకర్త కేవీఎస్ఆర్ పవన్ కుమార్, సమన్వయకర్త డా.శేషకుమార్ పాల్గొన్నారు.



నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా స్కిల్ మేనేజర్ రవితేజ

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే కందుల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డులో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో నియోజకవర్గంలోని రైతులకు రాయితీపై అందిస్తున్న వ్యవసాయ వ్యక్తిగత పరికరాలు, పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలను త్వరలో రైతులకు అందజే యనున్నట్లు తెలిపారు. వర్షం, ఈదురు గాలులకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించి రైతులను ఆదుకుంటామన్నారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో 50 శాతం రాయితీతో 99 మంది రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు, కేకేమిట్ల, పొదిలి మండలాల వ్యవసాయ అధికారులు, మార్కెట్ యార్డు సిబ్బంది, టీడీపీ నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తర్లుపాడు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీకి మంజూరైన కొత్త ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీలకు ట్రాక్టర్లను మంజూరు చేసిందన్నారు. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేందుకు ట్రాక్టర్‌లను ఉపయోగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిఖామణి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, టీడీపీ నాయకులు అచ్చిరెడ్డి, మహేష్, నాగార్జునరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏసుదాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి



బంగారు చీర అలంకరణలో వాసవీమాత



గిద్దలూరులో అమ్మవారి కోసం కలశాలతో వస్తున్న మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు బుధవారం అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చన, అలంకరణ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ వైశ్య పతాకావిష్కరణ చేశారు. అనంతరం కోనేరు నుంచి కన్యకలు కలశాలతో నీటిని తీసుకొచ్చారు. మహిళలు అమ్మవారి పూజాసామగ్రి తీసుకొచ్చారు. కలశ ఉద్వాసన అమ్మవారికి గారెల నివేదన సమర్పించారు. మిథున కుల గోత్రం సహకారంతో ఆర్యవైశ్యులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కల్పించారు. సాయంత్రం శ్రీపతి అప్పనాచార్యులు వాసవీమాత ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం గజవాహనంపై నగరోత్సవం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, తీన్మార్ తప్పెట్లు, మహిళల కోలాటాల నడుమ అమ్మవారి ఊరేగింపు సాగింది.

గిద్దలూరు: అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కుసుమ హరనాథ మందిరం ఆవరణ నుంచి మహిళలు సామూహికంగా మేళతాళాల మధ్య గంగాజలం తీసుకుని రాగా మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. వివిధ సెంటర్ల నుంచి భక్తులు తెచ్చిన పంచామృతాలతో ఉత్సవ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం జరిగిన కోలాటం అందరినీ అలరించింది. కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు జనార్దన్, ముప్పూరి చంటి, జిలకర సత్యం, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు బిదరే రాంప్రసాద్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు దంపతులు ఉభయదాతలుగా పాల్గొని హోమాలు, గణపతి పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై వాసవీమాత ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు వెచ్చా హరగోపాల్, నాగెళ్ల సత్యనారాయణ,పెరుమాళ్ల సత్య నారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కొనకనమిట్ల : బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గిద్దలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఆర్‌కాలనీ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో సైతం ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఆరాధనకు మఠం వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్, రెవెన్యూ కార్యాలయాల అవరణలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు దత్తాచారి, రంగాచారి, వీరబ్రహ్మం, చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు. మఠం వెళ్లేవారి కోసం ఆర్టీసీ అధికారులు సామియానాలు వేయించగా, మాజీ సర్పంచ్ దప్పిలి శ్రీనివాసరెడ్డి సహకారంతో తాగునీటి సౌకర్యం, అల్పాహారం ఏర్పాటు చేశారు. గిద్దలూరు నుంచి 20 ప్రత్యేక బస్సులను బ్రహ్మంగారి మఠంకు నడిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, బీసీ సంఘ నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

తర్లుపాడు : తర్లుపాడులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా స్వామివారికి మంగళవారం మహానైవేద్యాన్ని నివేదించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మహా నైవేద్యం స్వీకరించారు.

పెద్ద దోర్నాల : శ్రీ మద్విరాట్ పోతులూరి బ్రహ్మేంద్రస్వా మి దేవాలయంలో, మండలంలోని తిమ్మాపురం, చిన్నదోర్నాల, కడపరాజుపల్లె గ్రామాల్లోని ఆలయాల్లో ఆరాధనోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. అనంతరం భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం బ్రహ్మంగారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమం లో గ్రామ పెద్దలు రాజ్, సుశీలమ్మ, ముత్తలూరి శివ శంకరాచారి, ఉమామహేశ్వరాచారి, వీరారెడ్డి,భాస్కర్ రెడ్డి, చల్లా వెంకట రెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారపేట : దరగాకొండ వద్ద శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనకనమిట్ల : చినమనగుండం గ్రామంలో వీరబ్రహ్మం బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో బ్రహ్మంగారు, పోలేరమ్మతల్లి ఆలయాలను గ్రామస్థులు నూతనంగా నిర్మించారు. ఈసందర్భంగా పండుతులు దైవజ్ఞ శర్మ ఆధ్వర్యంలో హోమాలు, నూతన విగ్రహాలకు పూజలు జరిపించారు. అనంతరం విగ్రహాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించి ప్రతిష్ఠ చేయించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రికి విద్యుత్ ప్రభలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



దాణాను ప్రారంభిస్తున్న పశుసంవర్ధశాఖ జేడీ బేబీరాణి

పశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

పొదిలి, మే 7 (ఆంధ్రజ్యోతి) : పశు సంపద సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబీరాణి అన్నారు. బుధవారం మండలంలోని ఉన్నగురువాయపాలెం పశు వైద్యశాలలో 50శాతంపై ప్రభుత్వం అందిస్తున్న దాణాను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేసవిలో పశువుల సంరక్షణకు పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారు నీటి తెట్టలను నిర్మించుకోవాలన్నారు. సబ్సిడీపై అందిస్తున్న గ్రాసం, విత్తనాలను పోషకులు వినియోగించుకోవాలన్నారు. మండలానికి 6.7 మెట్రిక్ టన్నుల దాణాను అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం దానాను పోషకులకు ఆమె అంజేశారు. కార్యక్రమంలో ఉన్న గురువాయపాలెం పశువైద్యాధికారి మణిశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : 9వ వార్డులో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 9న హనుమంత వాహనం, 10న గరుడ వాహనం, 11న గజవాహనం, 12వ తేదీన రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



గాలికి విరిగిన అరటి చెట్లు

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి

పెద్దదోర్నాల, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో సాగు చేసిన అరటి తోటలు మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు నేలకొరిగాయి. మండలంలోని తూర్పు గ్రామాల్లోనే కొద్దిపాటి మోస్తరు వానతో కూడిన ఈదురు గాలులు వీచాయి. దీంతో పెద్ద బొమ్మలాపురంలో అరటి తోటలు, బొప్పాయి చెట్లు విరిగిపోయాయి. దీంతో పంటల్లోనష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. బొమ్మలాపురం గ్రామానికి చెందిన ఎర్ర కోటిలింగం 2ఎకరాలు, పిన్నిక పెద్ద రాజయ్య 2ఎకరాలు,ఎర్ర లక్ష్మయ్య 2ఎకరాలు, దూదేకుల చిన్న కాశీం 3ఎకరాలు అరటి, మునగంటి శేఖరాచారి బొప్పాయి 2 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అల్లూరికి ఘన నివాళి

గిద్దలూరు టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వం చేయూత

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనందిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువుల దాణాను పోషకులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని రైతుల సంక్షేమానికి కట్టుబడి అనేక సబ్సిడీ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో పాల ఉత్పత్తులు తగ్గకూడదన్న ఉద్దేశంతో పాడి పశువులకు అవసరమైన దానా 50శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్థక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రావన్, ఏడీ యోగానంద్, ఏవో భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రామసుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, నంది శ్రీను, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

గిద్దలూరు టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను అందచేస్తున్నట్లు వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, పిల్లిపెసర, జీలుగ అందిస్తున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట వలన నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుందని, ఉత్పాదకత సామర్థ్యం కూడా పెరుగుతుందన్నారు. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చన్నారు.

విద్యార్థికి ప్రతిభ అవార్డు



ప్రతిభ అవార్డును అందజేస్తున్న మంత్రి స్వామి

గిద్దలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.మంత్రునాయక్‌కు ప్రతిభ అవార్డు లభించింది. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంత్రునాయక్ 583 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించగా, విద్యాశాఖ ప్రతిభ అవార్డుకు ఎంపిక చేసి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి అవార్డును మంత్రునాయక్‌కు అందజేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లునాయక్ తెలిపారు.

చిన్నకండ్లేరుపై ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

సీఎంకు పోస్టు కార్డులు పంపిన రైతులు

పుల్లలచెరువు, మే 7 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరును పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని కుందం పల్లిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై వెలిగొండ పూర్తి చేయాలని రాసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, శ్రీనివాస్, గురునాథం, జానకీరఘు, కోటిరెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ఎర్రగొండపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయని వారు వెంటనే చేసుకోవాలని నియోజకవర్గ ఎలక్టోరల్ ఓటరు రిజిస్ట్రేషన్ అధికారి సత్యనారాయణ తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం రాజకీయపార్టీల ప్రతి నిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లంతా ఈ ప్రక్రియ పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన నాయకులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎన్నికల డీటీ చంద్రశేఖర్, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

బోయలపల్లిలో పాఠశాల సంసిద్ధత

ఎర్రగొండపాలెం రూరల్ మే 7 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో పాఠశాల సంసిద్ధత ఉత్సవాలలో భాగంగా మండలంలోని బోయలపల్లిలో సీడీపీవో ఎం.పద్మావతి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీసీ ప్రథమ్ కోఆర్డీనేటర్ ఎస్.వెంకట్రావ్ తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

అవీ..ఇవీ



మంత్రి స్వామి నుంచి అవార్డును అందుకుంటున్న విద్యార్థి

హాస్టల్ విద్యార్థులకు మెరిటోరియల్ అవార్డులు

పీసీపల్లి,మే7(ఆంధ్రజ్యోతి):స్థానిక సంక్షేమశాఖ వసతి గృహంలో ఉంటూ పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మెరిటోరియల్ అవార్డును అందుకున్నారు.ఈ ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అవార్డులు ఇచ్చి సత్కరించేందుకు పూనుకుంది. అందులో భాగంగా పీసీపల్లి మండలంలో స్థానిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో ఉంటూ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ పరీక్షలు రాసిన ముగ్గురు విద్యార్థులు మెరిటోరియల్ అవార్డుకు ఎంపికయ్యారు. గుంటగాని సుదర్శన్ 580 , గంప మోహిత్ 577 , పరిమి తిరుపతయ్య 575మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. వీరికి బుధవారం విజయ వాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి విద్యార్థులకు అవార్డులను ఇచ్చి అభినందించారు. మెరిటోరియల్ అవార్డును పొందిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులతో పాటు వసతి గృహ ప్రత్యేక అధికారి సురేంద్రలు అభినందించారు.



తహసీల్దార్‌కు సమ్మె పత్రాన్ని అందజేస్తున్న వీఆర్‌ఏలు

కార్మిక చట్టాలను పటిష్ట పరచాలి

పామూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలను పటిష్ట పరిచి వీఆర్‌ఏలకు కనీసం వేతనం రూ.26 వేలు ప్రకటించాలని, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కే మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును తహసీల్దార్ బీవీ రమణారావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వీఆర్‌ఏలు బుధవారం అందజేశారు. వీఆర్‌ఏ లకు పదోన్నతి కల్పించాలని, నైట్ డ్యూటీల పని భారం తగ్గించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నారాయణమ్మ, కార్యదర్శి రసూల్‌బీ, కోశాధికారి ఖాజామస్తాన్, పి. శ్రీనువాసులరెడ్డి, ఇమ్మానుయేలు, కొండమ్మలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో వెంకటరావు

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

ముండ్లమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఏపీవో పీ వెంకటరావు అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12,500 మందికి పైగా జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. కనీసం ఆరు వేల మందికి తగ్గకుండా ప్రతి రోజు పనికి వచ్చే విధంగా చూడాలన్నారు. కనీస వేతనం రూ.300లుగా నిర్ణయించామన్నారు. పని ప్రదేశంలో బోగస్ మస్టర్లు వేస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన డిజిటల్ బోర్డు

డిజిటల్ ప్యానెల్ బోర్డు ధ్వంసం

సీఎస్‌పురం(పామూరం) మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని కేవీఎస్‌ఎల్ జడ్పీహెచ్‌ఎస్‌కేవీ నగర్ పాఠశాలలోని రూ, 1లక్ష విలువ చేసే 5 డిజిటల్ టీవీ బోర్డులను ఐఎఫ్‌టీ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఒక ప్యానెల్ బోర్డును పాఠశాల తలుపులను పగలకొట్టి బండరాయితో ప్యానెల్ బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు పగలకొట్టారని ఎస్ఎంసీ చైర్మన్ మూరం మస్తానయ్య, హెచ్‌ఎంలు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో పాఠశాల ఆవరణలోని 2 సిమెంటు బల్లలను కూడా ధ్వంసం చేశారని ఆ ఫిర్యాదులో తెలిపారు. పాఠశాలలో విలువైన రికార్డులు, రిజిస్టర్లు, వస్తువులు ఉన్నాయని వాటికి రక్షణ కల్పించాలని వారు కోరారు.

రేపు ఒంగోలులో ఏపీటీఎఫ్ ధర్నా

సీఎస్‌పురం(పామూరం) మే 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9న ఒంగోలులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్‌లు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1నుంచి 5తరగతులు ఉండే విధంగా మోడల్‌ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ ఉండాలని, సీఎస్‌పురం మండలంలో అన్ని యూపీ స్కూల్స్‌ను కొనసాగించాలని, 1 నుంచి 5వ తరగతులు హైస్కూల్‌కు అనుసంధానం చేసే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్‌చేస్తూ ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

స్వర్ణాంధ్ర సాధనే చంద్రబాబు లక్ష్యం

ఎంఎస్‌ఎంఈ పార్క్ శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి,మే7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేయడమే ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడి లక్ష్యమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పెదయిర్లపాడు రెవెన్యూ లింగన్నపాలెం గ్రామ పరిధిలో బుధవారం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్క్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉగ్ర మాట్లాడుతూ ప్రతిఇంట్లో పారిశ్రామికవేత్త తయారుకావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలో కనిగిరి నియోజకవర్గంతో పాటు మార్కాపురం, దర్శి నియోజకవర్గాలలో 3 ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనుమతిచ్చారన్నారు. అందులో భాగంగా లింగన్నపాలెం గ్రామంలో 20ఎకరాల విస్తీర్ణంలో 7కోట్ల రూపాయలతో పార్క్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.ఎంఎస్ ఎంఈ పార్క్ ఏర్పాటు ద్వారా ఆయా ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పడతాయని, తద్వారా నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, డిప్యూటీ జోనల్ మేనేజర్ స్వర్ణలత, ఏపీఐఐసీ ప్రాజెక్ట్ మేనేజర్ కూరపాటి మహేంద్ర, పారిశ్రామికవేత్త కొంపల్లి సురేష్, తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీవో ప్రభాకరశర్మ, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్‌ఎంఈ పార్క్ శిలాఫలకాన్ని అధికారులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

భారత సైన్యానికి అభినందనలు

దర్శి, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను మట్టుపెట్టిన భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి దర్శి తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్ అభినందనలు తెలిపారు. స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో తహసీల్దార్ ఎం. మురళీ కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాం దాడికి ప్రతిచర్యగా భారత సైన్యం జరిపిన సిందూర ఆపరేషన్ అద్భుతమన్నారు. ఒక్క ఆపరేషన్‌లో సుమారు వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో పాటు వారి స్థావరాలను ధ్వంసం చేయటంతో పాకిస్తాన్ వెన్నులో వణుకు పుడుతుందన్నారు. భారత్ జోలికి వస్తే ఎవరికైనా పుట్టగతులుండవనే విషయాన్ని ఈ ఆపరేషన్ ద్వారా భారతసైన్యం నిరూపించిందన్నారు. భాతర సైనికుల వీరోచిన పోరాటం దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ కమిషనర్ వై. మహేశ్వరరావు, సంఘ సేవకుడు జీవీ రత్నం, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



భారత సైన్యాన్ని అభినందిస్తూ దర్శిలో కేకు కట్ చేస్తున్న తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్, ఎస్ఐ మురళీ

దొనకొండలో

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలోని బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. పాటకచేరి, కోలాటం, వైసీపీకి చెందిన ఒక విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసి వాటిపై వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్‌కు ఉపాధికూలీల మద్దతు

పీసీపల్లి,మే7(ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ముష్కరులకు తగిన బుద్ధి చెప్పిన భారత సైన్యానికి అన్ని వర్గాలనుంచి మద్దతు లభిస్తోంది. ఇటీవల పహల్గామ్‌లో పర్యాటకులపై పాక్ తీవ్రవాదులు దాడిచేసి హతమార్చిన విషయం తెలిసిందే.అయితే మంగళవారం అర్ధరాత్రి భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో ముష్కరుల స్థావరాలపై దాడిచేసింది. బుధవారం మండలంలోని చిరుకూరివారిపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు పనిప్రదేశంలో జైహింద్ భారత్-జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి భారత సైన్యానికి మద్దతుగా నిలిచారు.



చిరుకూరివారిపల్లిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతున్న ఉపాధి కూలీలు

జవాన్లకు మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వం

దొనకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): జవాన్లకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వం వహించటం అభినందనీయమని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా రామయ్య వివరించారు. సిందూర్ ఆపరేషన్‌తో పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాదుల శిబిరాలను నాశనం చేసి శాంతి భద్రతలకు భంగం కల్గించే వారికి తగిన సమాధానం ఇచ్చారని అన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

దర్శి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. బొట్లపాలెం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లకు టీడీపీ, జనసేన, వైసీపీల ఆధ్వర్యంలో నాలుగు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే పాపారావు తిరునాళ్ల ఉత్సవాల్లో పాల్గొన్నారు. బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దర్శి పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని తూర్పుచౌటపాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఈశ్వరమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేశారు.



దర్శిలో ప్రభపై నుంచి మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

భక్తిశ్రద్ధలతో వేడుకలు

పామూరు : స్థానిక విరాట్ నగర్ కాలనీలో ఆరాధన వేడుకలను బుధవారం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అభిషేకాలు, సహస్రనామ అర్చనలు, నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివార్లను తప్పెట్లు, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, సయ్యద్ అమీర్‌బాబు, ఖాజారహంతుల్లా, ఎన్. సాంబయ్య, దేవస్థాన నిర్వాహకులు వి. రామస్వామి, ఎం దొరసానాచారి, ఎన్. నాగేంద్రచారి, విజయశేఖర్, ఎం. మణిభూషణాచారి, కదిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు :మండలంలోని పలుగ్రామాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. విఠలాపురం, తూర్పుగంగవరం, గుంటి గంగ సన్నిధిలోని కాశినాయన ఆలయాల్లో వీరబ్రహ్మేంద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. టీడీపీ మండల అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, నవులూరి సురేంద్ర మోహన్‌రావు, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, వేణుబాబు, పిన్నిక రమేష్‌బాబు, ఎంపీడీవో దారా హనుమంతరావు,ఎస్సై మల్లికార్జునరావులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముండ్లమూరులో

ముండ్లమూరు : స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణతో పాటు ముండ్లమూరు, పసుపుగల్లు, వేంపాడు, పెద రావిపాడు, నాయుడుపాలెం, గ్రామాలకు చెందిన భక్తులు వచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



విఠలాపురం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేకాలంకారంలో స్వాములు

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

తాళ్లూరు, మే 7(ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంసూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని దర్శి విద్యుత్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు తెలిపారు. తూర్పుగంగవరం గ్రామంలో పీఎం సూర్యఘర్‌పథకంపై వినియోగదారులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ మధ్యతరగతి విద్యుత్ వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజించి రాయితీ ఇస్తుందన్నారు. సోలార్ విద్యుత్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. మధ్యతరగతి విద్యుత్తు వినియోగదారులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు సబ్ ఇంజనీర్ ఇమ్మానియేల్‌బాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్‌లు వీవీఎస్ కాంతారావు, శ్రీనివాసరావు, లైన్‌మెన్ నారాయణ,వెంకటేశ్వర్లు, విద్యుత్ వినియోగదారులు, రైతులు,సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి వేడుకలు

దొనకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): దొనకొండలో వాసవీమాత జయంతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలన్నీ మూకుమ్మడిగా బ్రహ్మారావుపేటలోని శ్రీ పట్టాభిరాముల వారి దేవాలయంలో విఘ్నేశ్వరపూజ, క్షీరాభిషేకం, కలశ స్థాపన, సహస్రనామార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు వాయిస్తూ శ్రీ వాసవీమాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై దేవాలయం నుంచి ఆర్యవైశ్యులు నివసించే వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

3 యూపీ స్కూళ్లు అప్‌గ్రేడ్

పామూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడు, నర్రమారెళ్ల, పడమటకట్టకిందపల్లి గ్రామాల్లో ఉన్న యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా మారుస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా మండలంలోని బోడవాడ లో యూపీ స్కూల్‌ను రద్దుచేసి 6,7, తరగతుల విద్యార్థులను బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు.

నేరాల అదుపునకు గట్టి చర్యలు

పామూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : సర్కిల్ పరిధిలో నేరాల అదుపునకు గట్టి నిఘా చర్యలు తీసుకోవాలని సీఐ ఎం. భీమానాయక్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో క్రైం మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసులు, వారెంట్లను త్వరితగతిన క్లియరెన్స్ చేయాలని, బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పించాలని నేరాలు జరగకుండా రాత్రులు బీట్‌లు పెంచాలని సూచించారు. ఆకతాయిలు హద్దులు మీరితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు టికిశోర్‌బాబు, ఆర్ సుమన్, కృష్ణపావని పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ఊటకుంట నిర్మాణ పనుల తనిఖీ

సీఎస్‌పురం(పామూరు), మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆనకాలపల్లిలో జరుగుతున్న ఊటకుంట నిర్మాణ పనులను బుధవారం డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కూలీల మస్టర్ల రికార్డులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. కూలీలకు పనులు కల్పించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణంలో ఉన్న పశువుల నీటి తొట్లను పరిశీలించిన ఆయన నాణ్యతలో తేడాలు రాకూడదని సూచించారు. లక్ష్యం మేరకు సిబ్బంది పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫారం ఫాండ్ పనులు, నీటినిల్వ పనులు చేపించాలన్నారు. అనంతరం పామూరు మండల పరిషత్ కార్యాలయంలో పామూరు, సీఎస్‌పురం మండలాలకు సంబంధించిన ఉపాధి, ఉద్యాన, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో 2 వందల ఎకరాల్లో బత్తాయి, మామిడి, సపోటా, దానిమ్మ, నిమ్మ పంటలను సాగు చేసేందుకు ఐదు ఎకరాల లోపు రైతులను గుర్తించి పంటలు పండించేలా అవగాహన కల్పించాలని టార్గెట్ విధించారు. లక్ష్యాల మేరకు పనిచేయకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ భాస్కరరావు, ఏపీవోలు బి. మాల్యాద్రి, నాయక్, ఉద్యానశాఖ అధికారిణి కుసుమ తో పాటు వ్యవసాయశాఖ, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రమణ

మూడేళ్లకోసారి భూసార పరీక్షలు


- వ్యవసాయశాఖ ఏడీఏ రమణ

కనిగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలోని ఆర్బీకే కేంద్రంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవటం వలన నేలలో ఎటువంటి పోషకాలు పంటలకు అందుబాటులో ఉంటాయో రైతులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. అదే సమయంలో భూసారాన్ని బట్టి ఎలాంటి ఎరువులు వాడితే రైతులు సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు పొలాలలో మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలో రైతులకు చూపించారు. మట్టి నమూనాలను పొలంలో నాలుగు విభాగాలుగా విభజించి మట్టిని తీసుకుని వాటిని పలు విభాగాలుగా పరీక్షలు చేస్తామన్నారు. ఆయా మట్టిని 15 సెంటీమీటర్ల లోతుగా పొరల్లో నుంచి తీసుకుని పరీక్షలు చేయటం జరుగుతుందన్నారు. ఈ ఏడాది భూసార పరీక్షల కోసం ఇప్పటికే 1,280 శాంపిల్స్‌ను తీసుకున్నట్లు తెలిపారు. మట్టి పరీక్ష అనంతరం విశ్లేషణ పత్రాన్ని రైతులకు అందచేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రైతు సేవాకేంద్రం సిబ్బంది ద్వారా మట్టి నమూనాలు సేకరించి మండల కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ షబానా, గ్రామరైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో పంచాయతీలకు మౌలిక వసతులు

- డీఎల్‌పీవో పద్మావతి

ముండ్లమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తామని డీఎల్‌పీవో పద్మావతి అన్నారు. ఆమె బుధవారం మండలంలోని నూజెండ్లపల్లి, తూర్పుకంభంపాడు గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూసీ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని, వ్యర్థ పదార్థాలను డంపింగ్ యార్డులో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా వేసే విధంగా చూడాలన్నారు. డంపింగ్ యార్డులో కుళ్లిన ఎరువును అమ్మటంతో వచ్చిన ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి ఖర్చు అవుతుందన్నారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శులు వేణుగోపాల్, స్వర్ణలతను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాలరావు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.





ఉష్ణోగ్రత (అంచనా) 8-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	40	27
నరసరావుపేట	39	25
బాపట్ల	38	27
రెంటచింతల	39	26
చీరాల	38	27



రేపల్లె రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్ అధికారులు

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు

50 శాతం పూర్తి

రేపల్లె, వేమూరు స్టేషన్ పనులు పరిశీలించిన డీఆర్ఎం సుధేష్ణ సేన్ 22 బోగీలతో రేపల్లె టు తిరుమల రైలు

రేపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఐదు రైల్వేస్టేషన్లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ తెలిపారు. పథకంలో భాగంగా రేపల్లె రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. నూతన భవనాలు, పెంచిన ప్లాట్‌ఫాంలు, టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాలు, సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అభివృద్ధి పను ల్లో ఎక్కడా నాణ్యత లోపించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత్ భారత్ పథకంలో భాగంగా రేపల్లె, పిడుగురాళ్ల, తెనాలి, బాపట్ల, గుంటూరు స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 50 శాతం పైనే పనులు పూర్తయ్యాయని డీఆర్ఎం వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపల్లె నుండి వయా కడప మీదగా తిరుపతి వెళ్లే రైలు బోగీలు పెంచే ఆలోచన ఉందని తెలిపారు. దానికి అనుగుణంగా 22 బోగీలకు ప్లాట్ ఫాం పెంచి కట్టాలని అధికారులకు సూచించారు.

కొల్లూరులో అకాల వర్షం

- కల్లాల్లో నిలిచిన వర్షపు నీరు
- ఆందోళనలో మొక్కజొన్న రైతులు
- తడిసిపోయిన పచ్చి ఇటుకలు

కొల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైతులు అల్లాడిపోతున్నారు. ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షాలు పడటంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో కొల్లూరులో అకాల వర్షం కురిసింది. అప్పటి వరకు వాతావరణం బాగుండడంతో కల్లాల్లో ఉన్న మొక్కజొన్న గింజలను రైతులు ఆరబెట్టుకున్నారు. మరికొందరు కండెలను యంత్రాల సాయంతో నూర్పిళ్లు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం రావడంతో.. కూలీల సాయంతో వాటిని భద్రపరిచే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ మొక్కజొన్న కండెలు, గింజలు తడిసిపోయాయి. ఇటుక తీత చివరి దశకు వచ్చిన తరుణంలో అకాల వర్షం పరిశ్రమదారులను నష్టపరిచింది. కల్లాల్లోని పచ్చి ఇటుకలు తడిసిపోయాయి. గత సీజన్‌లో తీసిన ఇటుకరాయి కల్లాల్లో పేరుకుపోయి ఉండటంతో.. ఈ సీజన్‌లో పరిశ్రమదారులు ఇటుక తీత సగానికి సగం తగ్గించారు. కష్టనష్టాలు అనుభవిస్తున్న తమపై వరుణుడు కన్నెర్ర జేయడంతో మరింత నష్టపోతున్నామన్నారు.



కొల్లూరులో రహదారిపై వర్షపు నీరు

రాత్రి సమయంలో సూర్యలంక తీరంలో గస్తీ

బాపట్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పరిణామాలకు అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో రాత్రి సమయంలో కూడా గస్తీని ముమ్మరంగా నిర్వహిస్తామని బాపట్ల మెరైన్ పోలీసులు తెలిపారు. తీరానికి వచ్చే పర్యాటకుల్లో అపరిచిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

పౌరుల ప్రాణాలకు నష్టం జరగకుండా ప్రణాళిక

- ముఖ్యమంత్రికి వివరించిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే7 (ఆంధ్రజ్యోతి) : శత్రువుల దాడిలో సాధారణ పౌరుల ప్రాణాలకు ఎలాంటి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ జె.వెంకటమురళి వివరించారు. శత్రువుల దాడి హెచ్చరిక నేపథ్యంలో ముఖ్యమంత్రి బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్లలో ఇప్పటికే మాక్‌డ్రిల్ నిర్వహించామని కలెక్టర్ చెప్పారు. వైమానిక దళం అధికారులతో సూర్యలంకలో, రైల్వేస్టేషన్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించిన అంశాలను సీఎంకి తెలియజేశారు. రైల్వేస్టేషన్, రహదార్లు, చెరువులపై దాడి జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు.

హనుమంత వాహనంపై భావదేవుడి ఊరేగింపు



బాపట్ల, మే7 (ఆంధ్రజ్యోతి): శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణ స్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారు హనుమంత వాహనంపై కొలువుతీరారు. స్వామివారిని పురవీధులలో ఊరేగింపు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు నల్లూరి పాంచజన్యం, విఖనసమూర్తి, శ్రీనివాసచార్యులు, బృందావనం గోపిచంద్, వినుకొండ సత్యంబాబులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తజనం స్వామివారిని దర్శించుకుని ఆశీర్వచనాలు అందుకున్నారు. ఉత్సవకమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సాంకేతిక విద్యకు.. నిధుల సమస్య!

ఉమ్మడి గుంటూరు జిల్లాకే తలమానికం నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల. ఏకైక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కూడా ఇదే. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అంతంతమాత్రంగానే అందుతోంది. కళాశాలలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నిధుల కొరత వెంటాడుతుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఏళ్ల తరబడి కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి.





సాగుతూనే ఉన్నాయి..

- నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో వసతుల కొరత
- రూ.8 కోట్లు ఇస్తేనే వసతి భవనాల నిర్మాణం
- కళాశాల భవనాలకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు మంజూరులో జేఎన్‌టీయూ మీనమేషాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల కాకినాడ జేఎన్‌టీయూ నిర్లక్ష్యానికి గురైంది. కళాశాలను అభివృద్ధి చేయడం యూనివర్సిటీ అధికారులకు ఇష్టం లేదన్నట్లుగా ఉంది. స్థానిక కళాశాలకు రూ.8 కోట్లు నిధులు విడుదల చేస్తేనే వసతి గృహాల నిర్మాణాలు పూర్తవుతాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయింది. కళాశాల భవనాలు కూడా అరకొరగానే పూర్తయ్యాయి. వసతిగృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అసంపూర్తి భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

నరసరావుపేట కళాశాల భవనాల నిర్మాణానికి కాకినాడ జేఎన్‌టీయూ రూ.90 కోట్లు మంజూరు చేసింది. రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఆరేళ్లుగా నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తిస్థాయి భవనాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. మూడు ఫ్లోర్లలో రెండుఫ్లోర్లు మాత్రమే పూర్తి చేశారు. మరో అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. దాదాపు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఈ దిశగా వర్సిటీ స్పందించడం లేదు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడతారు. అయితే వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఆ పరిస్థితి ఇక్కడ కన్పించడం లేదు.



నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

ప్రతిపాదనలు వెళ్లాయి.. నిధులు రావాలి

ఇటీవల జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సందర్శించారు. వసతి గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహాలకు సంబంధించిన రివైజ్డ్ అంచనాలను వర్సిటీ అధికారులకు అందించామని సంబంధిత ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. నిధులు కేటాయిస్తేనే వసతి గృహాలను రానున్న విద్యా సంవత్సరానికి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. కళాశాల మూడో అంతస్తుకు రివైజ్డ్ అంచనాలను రూపొందించి, వర్సిటీకి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.



అసంపూర్తిగా బాలికల వసతి గృహం

విపత్తు నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే7 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో రాబోయే విపత్తు నివారణకు.. అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి సూచించారు. బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరంలోని ఎయిర్ బేస్ స్టేషన్‌లో విపత్తు నిర్వహణపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు గురించి అధికారులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. సూర్యలంక ఎయిర్ బేస్ స్టేషన్ క్యాటగిరి-2 పరిధిలోకి రాదని చెప్పారు. ఇక్కడ నుండి ఎటువంటి మిసైల్ దాడులు, ఆపరేషన్‌లు నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్ నుండి మిసైల్ ప్రయోగించినప్పుడు సూర్యలంక ఎయిర్ బేస్ అధికారులు రాడార్ ద్వారా 200 కిలోమీటర్ల దూరం నుండి వాటిని పసిగట్టి.. పోలీసులకు సైరన్ ద్వారా ముందుగా హెచ్చరికలు జారీ చేస్తారని చెప్పారు. ఆ హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి తగుజాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. విపత్తు నివారణకు సంబంధించి కలెక్టరేట్ పరిధిలో ఒకటి, పోలీసుశాఖ పరిధిలో మరో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సెల్‌ఫోన్ టవర్లు విధ్వంసం అయ్యే పరిస్థితుల నేపథ్యంలో.. కలెక్టరేట్, పోలీసు శాఖ, ఎయిర్ బేస్ స్టేషన్ అనుసంధానమయ్యే విధంగా ల్యాండ్ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో రిజర్వాయర్లు, డ్యామ్‌లు, రైల్వేలైన్‌లు విధ్వంసం జరిగినప్పుడు వాటి ప్రత్యామ్నాయాల గురించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులు.. అందులో పడకల వివరాలు అందుబాటులోకి ఉంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. అగ్నిమాపకశాఖ రక్షణ పరికాలను సిద్ధం చేసుకోవాలని, రవాణాశాఖ అందుబాటులోని ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విపత్తును సమర్థంగా ఎదుర్కోవడానికి అధికారులు ముందస్తు ప్రణాళికతో సంసిద్ధం అవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ తుషార్ డూడి, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల రైల్వే స్టేషన్‌లో..

బాంబు దాడి..! జరిగితే?



బాంబుదాడిలో గాయపడిన ప్రయాణికుడికి ఫస్ట్ ఎయిడ్ చేస్తూ..

- బాంబు దాడి, తదనంతర దృశ్యాల ఆవిష్కరణ
- ప్రయాణికుల రక్షణ.. క్షతగాత్రుల తరలింపు..
- పోలీసులు, డాగ్ స్క్వాడ్‌తో అంతా హడావుడి
- ఏం జరుగుతుందో అర్థం కాక జనాల్లో ఉత్కంఠ
- అరగంట తర్వాత అసలు విషయం వెల్లడి
- సన్నద్ధతపై స్టేషన్‌లో మాక్ డ్రిల్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లోకి ఉగ్రవాదులు చొరబడి.. ప్రయాణికులపై బాంబు దాడి చేశారని డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు బుధవారం ఉదయం 10.55 నిమిషాలకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. ఆయన కలెక్టర్, ఎస్పీలకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసు, ఫైర్, మెడికల్ విభాగాలను క్షణాల వ్యవధిలో అప్రమత్తం చేశారు. సరిగ్గా ఐదు నిమిషాల వ్యవధిలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ, టౌన్, రూరల్ సీఐలతో పాటు ఏఆర్ పోలీసులతో కలిపి దాదాపు 40 మంది 11 గంటలకు బాపట్ల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరితో పాటు డాగ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగింది. రెండు అంబులెన్సులతో పాటు మెడికల్ సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రైల్వే పోలీసులతో కలిసి ఓ టీం ప్రయాణికులను సురక్షితంగా బయటకు తరలించడంపై దృష్టిపెడితే.. మరో టీం బాంబుదాడిలో తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించింది. పోలీసులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరిని కాపాడగలగడంతో పాటు.. దాదాపు 34 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. ఇదే సమయంలో సహాయక చర్యల పర్యవేక్షణకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఓ టీం రంగంలోకి దిగింది. ఉగ్రవాదులు జిల్లా సరిహద్దులు దాటి పారిపోకుండా చెక్‌పోస్టులను అలర్ట్ చేశారు. బస్టాండు, రేల్వే స్టేషన్‌లలో తనిఖీలను నిమిషాల వ్యవధిలో చేపట్టారు. రైల్వే స్టేషన్ బయటే మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. ఉగ్రవాదులు అమాయకులే లక్ష్యంగా బాంబు దాడులకు తెగబడ్డారని, ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు చేర్చగలిగామని ప్రజలెవరూ ఆందోళన చెందనవసరం లేదని డీఆర్వో గంగాధర్ గౌడ్ తెలిపారు. మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశమున్నట్లు తమకు సమాచారముందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొత్త ముఖాల కదలికలపై అనుమానాలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అసలేం జరిగింది..?

ఈ దృశ్యాలన్నీ కూడా బాపట్ల రైల్వే స్టేషన్ వేదికగా బుధవారం ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు చోటు చేసుకున్నాయి. పదుల సంఖ్యలో పోలీసుల రంగ ప్రవేశం, అంబులెన్స్‌ల మోత, డాక్టర్ల హడావుడి, మరో వైపు డాగ్ స్క్వాడ్‌తో ఖాకీల ఉరుకులు పరుగులతో స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులతో పాటు బయట ఉన్న ప్రజలకు అసలు ఏం జరుగుతుందో తెలియక కంగారు పడ్డారు. రైల్వే స్టేషన్‌లోకి ఉగ్రవాదులు ప్రవేశించి బాంబు దాడులు చేశారనే సమాచారం పట్టణమంతా పాకింది. అటు ప్రయాణికులు, ఇటు ప్రజల్లో ఏం జరుగుతుందో తెలియక ఒకటే ఆందోళన నెలకొంది. అరగంట పాటు సాగిన ఈ ఉత్కంఠకు పోలీసులు తర్వాత తెరదించారు. రైల్వే స్టేషన్‌లో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారని తెలుసుకున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్ జరిగిన విధానంపై పోలీసులతో పాటు అన్ని విభాగాలు సమీక్ష నిర్వహించాయి.



అప్రమత్తంగా ఉండాలి

భారత్-పాకిస్థాన్ మధ్య దాదాపుగా యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితులు అందరికీ తెలుసుని, దీనిలో భాగంగా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు సన్నద్ధతపై మాక్‌డ్రిల్ నిర్వహించడం జరిగిందని ఏఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. ఇది మాక్‌డ్రిల్ అయినప్పటికీ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న ఇబ్బంది వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్పీ కోరారు.



మాక్‌డ్రిల్ అనంతరం అధికారులంతా..

సోలార్ సెజ్..

సంక్లిష్టం?

- రైతుల సహకరిస్తేనే పవర్‌ప్లాంట్ ఏర్పాటు
- భూసేకరణకు కసరత్తు.. అడ్డుకుంటున్న కొందరు రైతులు
- రాష్ట్రంలో మొదటగా అద్దంకిలో ఏర్పాటుకు మంత్రి ప్రయత్నాలు
- తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని గొట్టిపాటిపై నేతల ఒత్తిళ్లు

అద్దంకి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్ట మొదటగా సోలార్ పవర్ ప్లాంట్ సెజ్ ఏర్పాటు చేసే అవకాశం అద్దంకి నియోజకవర్గానికి దక్కింది. విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నియోజకవర్గంలో 2 వేల ఎకరాల్లో సెజ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. భూసేకరణకు రైతుల సహకరిస్తే ప్లాంట్ ఏర్పాటుకు అడుగు ముందుకుపడే అవకాశం ఉంది. పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, కూకట్లపల్లి, గొర్రెపాడు, సంతమాగులూరు మండలం కుందుర్తి, మామిళ్లపల్లిలో భూముల సేకరించాల్సి ఉంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా సర్వే కూడా చేశారు. అయితే అత్యధికశాతం ప్రైవేటు భూముల్లో భూసేకరణ కొంత సంక్లిష్టంగా ఉండే అవకాశం ఉంది. రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల పరిహారంగా చెల్లించే అవకాశం ఉండటంతో అత్యధిక శాతం రైతులు భూములు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారు. కొందరు



బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో భూములు



మాత్రం విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. రైతులు పూర్తిగా సహకరించి భూసేకరణ పూర్తయితే ఇక్కడ సోలార్ సెజ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. ఇక్కడ సమస్యలు తలెత్తితే కనిగిరి, దర్శి ప్రాంతాలతో పాటు రాయలసీమ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ఆయా నేతలు మంత్రి రవికుమార్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతాలలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అద్దంకి నియోజకవర్గంలో ప్లాంట్ ఏర్పాటుకు రైతుల సహకరించాలని పలువురు సూచిస్తున్నారు. ప్లాంట్ ఏర్పాటు ఇక్కడి రైతుల నిర్ణయంపై ఆధారపడి ఉంది. అద్దంకి నియోజకవర్గంలో ఇప్పటి వరకు గ్రానైట్ పరిశ్రమ మినహా మిగిలిన ఏ పెద్ద పరిశ్రమలు లేకపోవడంతో పనుల కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



అవీ.. ఇవీ..

బీసీల సంక్షేమానికి కలసికట్టుగా పనిచేయాలి

అద్దంకి, మే7 (ఆంధ్ర జ్యోతి): బీసీల సంక్షేమా నికి కలసికట్టుగా పనిచే యాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. శింగరకొండలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బాపట్ల జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కొండూరు గోవిందు, ఉపాధ్యక్షుడిగా గుంజి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కడియం రేణుకకుమార్, ఆర్గనైజర్‌గా అంగలకుదురుటి నటరాజన్, కార్యవర్గ సభ్యుడిగా సురేష్ లను నియమించారు. రాష్ట్ర కమిటీలోకి రాంబాబును తీసుకున్నట్లు ప్రకటించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో చేయూత

యద్దనపూడి,(మార్టూరు)మే7(ఆంధ్రజ్యోతి):హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యం లో బుధవారం యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పోపూరి కృష్ణమూర్తి అనే వృద్ధుని ఇంటికి వెళ్లి రూ.7 వేల ఆర్థికసాయాన్ని సభ్యులు అందజేశారు. ఇంకా ఆయనకు జాష్టి సాంబశివరావు, చెరుకూరి అంజయ్య, షేక్ బాషాలు 2 వేల వంతున, శిల్పాల కోటేశ్వరరావు వెయ్యిరూపాయలను అందజేశారు. కార్యక్రమంలో పటాన్ ఖాదర్‌వలి,షేక్ హబీబా, పుట్టా అయ్యప్ప స్వామి, పాల చౌదరి, ఎం.జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసుల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 20వతేదీన జరగనున్న సమ్మె నోటీసును బుధవారం ఏపీ పౌరస రఫరాల సంస్థ హమాలీల యూనియన్ జిల్లా కమిటీ ప్రతినిధులు ఒంగోలులో సివిల్ సప్లయీస్ డీఎంకు అందజేశారు. సమ్మెను జ యప్రదం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు, యూనియన్ జిల్లా అధ్య క్షుడు బి.ఆంజనేయులు, గోపీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేస్ కరెంటు సరఫరా ప్రారంభం

చీమకుర్తి, మే7(ఆంధ్రజ్యోతి) : పల్లామల్లి గ్రామంలోని సబ్ స్టేషన్‌లో త్రీఫేస్ కరెంట్ సర ఫరాకు వీలుగా నూతనంగా ఏ ర్పాటు చేసిన సిస్టమ్‌ను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రేడియేరూమ్ సెంట ర్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, బీసీకాలనీలో ఉన్న బ్రహ్మంగారి గుడిని ఎమ్మెల్యే సందర్శించి పూ జలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జా సుబ్బారావు, అన్నమనేని రాఘవయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాసరావు, లోకేష్, రామ బ్రహ్మం, మన్నం శేషయ్య, సుబ్బారావు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఏడుకొండలు

ఒంగోలు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలను నియమిస్తూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అ ధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ టి.జమున కడప మెడికల్ కాలేజీకి బదిలీ కాగా ఆమె బుధవారం రిలీవ్ అయ్యారు. దీంతో డాక్టర్ ఏడుకొండలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరిం టెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కొనసాగిన సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు స్థానిక కలెక్టరేట్ ఎదుట చే పట్టిన దీక్షలు బుధవారానికి తొమ్మిదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూ నియన్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రా జేష్, జీవనజ్యోతి, ప్రసన్న, రమేష్, దీప్తి పాల్గొన్నారు.

నేడు ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న వేదపండితులు

ఒంగోలు(రూరల్), మే7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కమ్మపాలెం స మీపంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వార్ల విగ్రహాలను గురువారం ఉ దయం 6.55గంటలకు ప్రతిష్ఠాపన జరుగుతుందని దేవాలయ ధర్మకర్త అబ్బూరి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గత మూడు రోజులు నుంచి దేవాలయ ప్రాంగణంలో హోమాలు, యాగాలను నిర్వహిస్తున్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు అబ్బూరి అనిల్, దాచర్ల రమణయ్య, భైరపునేని తిరుపతిరావు, బొల్లినేని కోటేశ్వ రరావు, నన్నపనేని ఆంజనేయులు (ఎస్‌వీబీసీ కన్వెన్షన్‌హాల్) పర్యవేక్షించారని తెలిపారు.



ప్రతిష్ఠకు సిద్ధమైన ఆలయం

భగవద్గీత పారాయణంలో బంగారు పతకం



చరితారెడ్డి

ఒంగోలు(కల్చరల్), మే 7(ఆంధ్రజ్యోతి): ఒం గోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో చదు వుతున్న ఇ.చరితారెడ్డి మైసూర్‌కు చెందిన గణప తి సచ్చి దానంద భగవద్గీత పారాయణ ట్రస్ట్ ఆ ధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన భగవ ద్గీత కంఠస్థ పోటీలలో బంగారు పతకం సాధించారు. శ్రీనివాసరెడ్డి, ఉమాదేవి దంపతుల కుమా ర్తె అయిన చరితారెడ్డి జాతీయస్థాయిలో బంగా రుపతకం సాధించటం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 18వ తేదీన మైసూర్‌లో జరిగే కార్యక్రమంలో శ్రీగ ణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదుగా ఆమె బంగారు పతకంతో పా టు ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మద్దిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులుకు గిట్టుబాటు ధరలు కల్పించే వరకు ఉద్యమం చేస్తామని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీపీ.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్య మం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హను మారెడ్డి, వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, పి.అంజయ్య, శరత్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేలం కేంద్రాన్ని పరిశీలించిన మలావి దేశ ప్రతినిధి

వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం మలావి దేశం పొగాకు కంపెనీ ఎలయన్స్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధి మిలోనేవో సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కంపెనీ బయ్యర్ వెంకటేశ్వర్లు, రైతు నాయకులు మిలోనేవోతో మాట్లాడారు.

మినీ పాలీహౌస్‌ల ఏర్పాటుతో పొగాకు రైతులకు మేలు



వెలమవారిపాలెం సమీపంలో రైతులు ఏర్పాటు చేసిన రెడీమేడ్ బ్యారన్లు

నాణ్యమైన వైట్ బర్లీ దిగుబడి

అద్దంకి, మే2 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన దిగుబడు లు పొందేందుకు రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాలలో పలువురు రైతులు మినీపాలీహౌస్‌ల వలే గుడారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. బర్లీ సాగు రైతులు సాధారణంగా పొలాలలో పందిర్లు వేసి ఎండకు ఎండేవిధంగా చేస్తుంటారు. అయితే వర్షాల సమయంలో తడిసి నాణ్యత తగ్గిపోయి ధరలు తగ్గుతున్నాయి. దీంతో ప్రస్తుతం కొంత మంది రైతులు కొత్త సాంకేతికతతో తయారు చేసిన ప్లాస్టిక్ పరదాలతో గుడారాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాస్టిక్ కావడంతో సూర్యరశ్మిని స్వీకరించి ఉష్ణోగ్రతను రెట్టింపు చేయడం ద్వారా అందులో ఉన్న బర్లీ పొగాకు క్యూరింగ్ అవుతుంది. నాణ్యమైన దిగుబడి వస్తుంది. వర్షాలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా రక్షణగా ఉంటుంది. దీని ద్వారా బర్లీ పొగాకు దెబ్బతినకుండా, నాణ్యతగా ఉంటుంది. పొగాకు నాణ్యతగా ఉండడంతో ధరలు ఎక్కువగా ఉండేందుకు అవకాశం కలుగుతుంది. సాధారణంగా ఎండ నుంచి క్యూరింగ్ చేసిన పొగాకు కంటే నాణ్యమైన దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మంచి ఫలితాలు ఇవ్వడంతో ప్లాస్టిక్‌తో తయారు చేసిన పరదాలతో మినీబ్యారన్లను పోలినవిధంగా పొలాలలోనే ఏర్పాటు చేసుకున్నారు. రూ.20 వేల ఖర్చుతో ఏర్పాటు కు అవకాశం ఉండడంతో సాగు చేసిన పొలానికి తగ్గట్టు నాలుగైదు మినీ బ్యారన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఈ ఏడాది బర్లీ పొగాకు కొనుగోలు లేకపోవటంతో నాణ్యమైన పొగాకు దిగుబడి వచ్చినా ఆశించిన ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు రైతులు అభి ప్రాయపడుతున్నారు.



రెడీమేడ్ బ్యారన్‌లో ఉన్న పొగాకు

నాణ్యత ఉన్నా ధరలు లేకే ఇబ్బంది

ప్లాస్టిక్ పరదాలతో తయారు చేసిన రెడీమేడ్ బ్యారన్లతో మంచి నాణ్యమైన పొగాకు దిగుబడి వస్తుం ది. బయట ఉన్న ఉష్ణోగ్రతను ప్లాస్టిక్ రెట్టింపు చేసి అందిస్తుండడంతో బర్లీ పొగాకు త్వరగా క్యూరింగ్ అవుతుంది. తక్కువగా ఖర్చు కావడం తో ఏర్పాటుకు కూడా పెద్దగా ఇబ్బంది లేదు. ఈ ఏడాది బర్లీ పొగాకు కు ధరలు లేకపోవడంతో నాణ్యమైన బర్లీ పొగాకు దిగుబడి వచ్చి కూడా ప్రయోజనం లేకుండా పోయింది. నిల్వలు పేరుకు పోయాయి. **వేముల రామకోటేశ్వరరావు, రైతు, వెలమవారిపాలెం**

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు(రూరల్), మే7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని పొగాకు వేలంకేంద్రం-2లో జరుగుతున్న వేలం ప్రక్రియను ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్సీ సమావేశం జరుగుతుందని, ఈక్రమంలో పొగాకు వ్యాపారులు, ఆయా సంస్థల యజమానులను పిలిపించి మాట్లాడతామని చెప్పారు. పొగాకు వ్యాపారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం కచ్చితంగా కొనుగోలు చేయాల్సి ఉందని, అలా చేయని వ్యాపారులపై చర్యలు తీసుకునేలా నివేదిస్తామని తెలిపారు. అనంతరం రైతు సంఘం నాయకుడు కేవీ వీ.ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత వ్యాపారుల పై ఉందన్నారు. పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ రైతుల నుంచి కొనుగోలు చేయక పోవటం మోసపూరితంగా ఉందని చెప్పారు. రైతులు తెచ్చిన బేళ్లను నోబిడ్ చేయకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి తులసి, రైతు సంఘం నాయకులు వి.హనుమారెడ్డి, వీరారెడ్డి, వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునీల్, బండారు రామాంజనేయులు, పోలరపు వెంకటరామయ్య, వై.వెంకటశేషయ్య పాల్గొన్నారు.

నేడు టీడీపీ నేత వీరయ్యచౌదరి సంస్మరణ సభ

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బీఎన్



దశదిన కర్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దశదిన కర్మ, సంస్మరణ సభ గురువారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యు లు తెలిపారు. కాగా ఆయా ఏర్పాట్లను బుధవారం రాత్రి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అమ్మనబ్రోలులో స్వయంగా పరిశీలించి పలు సూచనలు చే శారు. వీరయ్యచౌదరికి టీడీపీ పెద్దలతో పాటు రాష్ట్రస్థాయి నాయకులతో ప రిచయాలు ఉన్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు, వీరయ్యచౌదరి కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే బీఎన్ చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాజీ జడ్పీ చైర్మన్‌కు పరామర్శ

ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య సమాచారంతో గుండెపోటుకు గురై హైదరాబాద్‌లో చికిత్స అనంతరం అమ్మనబ్రోలు చేరుకొన్న మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబును ఎమ్మెల్యే బీఎన్ పరామర్శించారు. ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఈదర మోహన్, తేళ్ల మనో జ్‌కుమార్, గుమ్మడి సాయిబాబా, రంపతోటి అంకారావు పాల్గొన్నారు.

తప్పిపోయిన పాప తల్లిదండ్రుల చెంతకు..!



చిన్నారి లక్ష్మిని తల్లికి అప్పగిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గుజ్జుల యల్లమందారెడ్డి నగర్‌కు చెందిన గడిపూడి సురేష్, తిరుపతమ్మ దంపతుల ఐదేళ్ల కుమార్తె లక్ష్మి ఐదు నెలల క్రితం బాపట్ల రైల్వేస్టేషన్‌లో తప్పిపోయింది. దీంతో అక్కడ స్థానికులు పాపను ఒంగోలులోని చైల్డ్ హోంకు అప్పగించారు. అప్పటి నుంచి పాప తల్లిదండ్రుల గురించి సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు అ న్వేషిస్తున్నారు. అందులో భాగంగా సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో ఆరాతీయగా పాప తల్లిదండ్రులు గుజ్జుల యల్లమందారెడ్డి నగర్‌కు చెందిన సురేష్, తిరుపతమ్మగా గుర్తించారు. దీంతో బుధవారం తల్లి తిరుపతమ్మను స్టేషన్‌కు పిలిపించి ఎస్సై మహేంద్ర వారి పాప లక్ష్మిని అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- మాక్ డ్రిల్ నిర్వహించిన యంత్రాంగం



ఒంగోలు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

ఒంగోలు క్రైం, మే7(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ ముఖ్యమైన ప్రాంతాల్లో విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం యంత్రాంగం తీసుకునే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించామని అన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా జిల్లా యంత్రాంగం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, రైల్వే పోలీసులతో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంఘవిద్రోహ శక్తుల చర్యలను నిర్వీరం చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా కల్పించేందుకే మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఇలాంటి మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్

రైల్వేస్టేషన్‌లో విద్రోహ శక్తులు కొన్ని ప్రాంతాల్లో తగులబెట్టి అల్లర్లు సృష్టించారు. ఈ సమాచారం తెలుసుకున్న కలెక్టర్, ఎస్పీ తమ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో తొలుత రైల్వేస్టేషన్ ముందు అల్లర్లలో గాయపడిన వారికి ఆరోగ్య శాఖ తరుపున డాక్టర్లు ప్రథమ చికిత్స నిర్వహించారు. వారికి భద్రత కల్పించడానికి పోలీసు యంత్రాంగం అంతా అక్కడికి చేరుకుంది. గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రికి పంపించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీలు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా ఆ ప్రదేశంలో టిక్కెట్ కౌంటర్ వద్ద ఉన్న ప్రేలుడు పదార్థాలున్న బ్యాగ్‌ను బాంబు స్క్వాడ్ గుర్తించింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ వచ్చి బాంబును నిర్వీరం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ అంతా డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఇలా మాక్‌డ్రిల్ నిర్వహించిన తరువాత కలెక్టర్, ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడి భరోసా కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు కొన్ని ఆసుపత్రులను బాంబ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, అదనపు సీఐ కె.నాగే శ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీ నివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేష న్ సిందూర్ నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా శత్రువుల దాడి జరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికలతో ప్రజలు భయపడకుండా అవసరమైన చర్యలు తీసుకోవా లన్నారు. విపత్తు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అం శాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.







అద్దంకిలో గుండ్లకమ్మ నది నుంచి నీటిని తీసుకువస్తున్న మహిళలు, పర్చూరు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామోత్సవంలో భక్తులు, లక్ష మల్లెలార్చనలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

వైభవంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి

అద్దంకి,మే7(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరం అమ్మవారి జయంతి కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. గుండ్లకమ్మనది నుంచి మహిళలు కలశాలతో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. కార్యక్రమాలలో దేవస్థానం అధ్యక్షుడు పూటుకూరి రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, నేరేళ్ల శ్రీనివాసరావు, పోకూరి వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కార్యక్రమాలు

అద్దంకి : పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన కార్యక్రమాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. అద్దంకి మండలంలోని శాంతినగర్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అద్దంకి, బల్లికురవ మండలాలలోని పలు గ్రామాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పంగులూరు : మండలంలోని పలు గ్రామాలలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాలలోని పురవీధులలో ఊరేగిన స్వామివారికి హారతులిచ్చి భక్తులు తమ భక్తిని చాటారు. పంగులూరు, రేణంగివరం, భగవాన్‌రాజుపాలెం, ముప్పవరం, చందలూరు, కశ్యాపురం తదితర గ్రామాలలో ఆరాదన మహోత్సవాలు జరిగాయి. బ్రహ్మంగారి కాలజ్ఞాన విశేషాలను స్మరించుకున్నారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 19న జరగనున్న మహాకుంభాభిషేకానికి ఐదు నదులు, మూడు సముద్రాల జలం వినియోగించనున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. దేవస్థానం పూజారి చంద్రశేఖర్ బుధవారం గోకర్ణం వద్ద అరేబియా సముద్రం జలాన్ని పూజలు నిర్వహించి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి

పర్చూరు : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు 101 కలశాలతో గ్రామోత్సవం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అమ్మవారి వేషదారణలో ప్రత్యేక నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం వెంకటసుబ్బారావు నేతృత్వంలో కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు

చీరాల : స్థానిక సంతబజార్‌లో వేంచేసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండే అభిషేకము, లక్ష మల్లెలార్చన, మధ్యాహ్నం ఘనంగా అన్న సమారాధన చేశారు. దీంతో భక్తులు విశేషంగా హాజరయి పూజలు నిర్వహించారు. అలాగే రాత్రికి ఊంజల్‌సేవ భజన కార్యక్రమాలతో అలరించాయి.

ఇంకొల్లు : ఇంకొల్లు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం 102 కలశాలతో అమ్మవారి ఊరేగింపులో పాటు అభిషేకం, హోమపూజ నిర్వహించారు. అమర రామ్మోహనరావు అమ్మవారికి వెండి ఆభరణములను అందజేసి అలంకరించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.









వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్, పూజలు చేస్తున్న మహిళలు, భక్తులకు అన్నదానం, అరేబియా సముద్రంలో సేకరిస్తున్న జలాలు

అవీ..ఇవీ..

తక్కెళ్లపాడు - రావినూతల రోడ్డు అధ్వానం

● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు


రహదారిపై ఏర్పడిన గోతులు

పంగులూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు నుంచి రావినూతల వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు ఛిద్రమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తక్కెళ్లపాడు గ్రామ రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు చేరుకునే ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులు, చెల్లా చెదురుగా లేచిన కంకరపై ప్రయాణం సాగించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తక్కెళ్లపాడు రైతులు తాము పండించిన పంటఉత్పత్తులు శీతల గిడ్డంగులలో నిల్వచేసుకునేందుకు ట్రాక్టర్లపై రావినూతలకు సరుకు తరలిస్తుంటారు. తక్కెళ్లపాడు పరిసర గ్రామాల ప్రజలు వైద్య అవసరాల నిమిత్తం రావినూతలలోని ప్రవేట్ వైద్యశాలను ఆశ్రయిస్తుంటారు. వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం ఆటోలలో రావినూతల, నిడమానూరు పరిసర ప్రాంతాలకు తక్కెళ్ళపాడుతో పాటు అలవలపాడు గ్రామాలకు చెందిన వందలాది మంది వ్యవసాయ కూలీలు ఆటోలలో రాకపోకలు సాగిస్తుంటారు. ఛిద్రమై, గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఈ ప్రధాన రహదారికి తగిన మరమ్మతులు చేపట్టాలని తక్కెళ్ళపాడు పరిసర గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

నిండుగర్భిణి హత్యకేసులో మహిళకు జీవిత ఖైదు

బల్లికురవ, మే7(ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణి హత్యకేసులో మహిళకు జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయాధికారి రాజావెంకటాద్రి బుధవారం తీర్పు చెప్పినట్లు బల్లికురవ ఎస్సై నాగరాజు తెలిపారు. వివరాలలోకి వెళితే మండలంలోని వి.కొప్పెరపాడుకు చెందిన సురభి శారమ్మకు చార్లెస్‌తో 2014లో వివాహమైంది. మద్యానికి బానిసైన చార్లెస్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. అత్త, మామలు ఏసమ్మ, పున్నయ్య, ఆడబిడ్డ లింగమ్మలు కూడా వేధిస్తున్నారు. ఈ క్రమంలో 2015 సెప్టెంబరు 13న నిండు గర్భిణీ శారమ్మ తన భర్తను నీళ్లకు రమ్మని అడిగింది. దీంతో కోపంతో భర్త చార్లెస్, అత్త, మామలు ఏసమ్మ, పున్నయ్య, ఆడబిడ్డ లింగమ్మలు కర్రతో కొట్టి, ఒంటిపై కిరోసిన్ పోసి అగ్గిపుల్లతో నిప్పు అంటించారు. దీంతో శారమ్మ ఒళ్లు కాలి మంటలు పూరింటికి అంటుకుని కాలిపోయింది. శారమ్మ ఒంటిపై మంటలతో ఇంటి బయటకు వచ్చి నీటి తొట్టిలో కూర్చుంది. స్థానికులు శారమ్మను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అదే నెల 18వ తేది మృతి చెందింది. దీంతో హత్య కేసుగా నమోదు చేసి నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అత్త,మామలు కేసు విచారణ సమయంలోనే మృతి చెందగా, భర్త కోర్టు నుంచి బెయిల్ పై వచ్చి కనిపించకుండా పోయాడు. విచారణ చేపట్టిన ఒంగోలు 7వ అడిషినల్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి రాజావెంకటాద్రి బుధవారం తీర్పు చెప్పారు. సురభి లింగమ్మకు జీవితఖైదు, రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రశాంతికుమారి కోర్టులో వాదనలు వినిపించారు. కేసులో నిందితురాలికి శిక్షపడేలా దర్యాప్తు చేసిన అప్పటి పోలీస్ అధికారులు, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పేలా తర్ఫీదు ఇచ్చిన సంతమాగులూరు సీఐ వెంకట్రావు, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బల్లికురవ కోర్టు కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశాంతకుమారిలను బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడి అభినందించారు.

ఈ ప్రభుత్వ మందులు ఎక్కడవీ..?

ఇంకొల్లు సమీపంలో రోడ్డు అంచులో పడేసిన మందులు


కల్వర్టు వద్ద పడేసి ఉన్న ప్రభుత్వ మందులు

ఇంకొల్లు, మే 7, (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ కిందిస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ఆ లక్ష్యం నీరుగారుతోంది. పేదలకు అందాల్సిన మందులు వారికి సక్రమంగా చేరుకోవడం లేదు. దీనికి ఈ చిత్రమే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఇంకొల్లు నుంచి కడవకుదురు రోడ్డులో భీమవరం సమీపంలో ఓ కల్వర్టర్ వద్ద ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసిన మందులు 100ల సంఖ్యలో అట్టలు పడేసి దర్శనమిచ్చాయి. ఇవి ఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించినవో లేదా 104 వాహనంలో పంపిణీ చేయాల్సినవో తెలియాల్సి ఉంది. అలా అని కాలం ముగిసినవి కూడా కాదు. ఏది ఏమైనప్పటికీ రోడ్డు వెంబడి వెళ్లే ప్రతి ఒక్కరికి మాత్రం ఇది చర్చనీయంశంగా మారింది. ప్రజలకు అందాల్సిన మందు బిళ్లలు ఇలా ఎక్కువగా ఒకేచోట పడేసి కనిపించడంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బల్లికురవ, మే7(ఆంధ్రజ్యోతి):మండల కేం ద్రమైన బల్లికురవ లోని నాలుగు రోడ్ల కూడలి లో ఉన్న విద్యుత్ స్థంభాలను పక్కకు మార్చే పనులు గురువారం నుండి శనివారం వరకు జరుగుతాయని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 7 గంటల నుండి సాయం త్రం 6 గంటల వరకు పనులు జరుగుతాయని తెలిపారు.బల్లికురవ తో పాటు కొత్తపాలెం,చెన్నుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది గమనించాలన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

మంత్రి కొలుసు పార్థసారథి


మంత్రి కొలుసు పార్థసారథి

మార్టూరు, మే7 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర సమాచార పౌరసంబంధాల, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కే.పార్థసారధి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుల చేతుల మీదగా 37 మంది లబ్ధిదారులకు రూ.28.85 లక్షల విలువైన చెక్కులు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయగా, వాటిని బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ గత ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌ను రిజక్ట్ చేయడంతో ఎంతోమంది పేద ప్రజానీకం ఇబ్బందులు పడ్డారన్నారు. అంతేగాకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీకి బిల్లులు చెల్లించకపోవడంతో, ఆస్పత్రులు పేదలకు వైద్యం చేయలేదన్నారు. తద్వారా ఎంతోమంది వైద్యఖర్చుల కోసం తమ ఆస్తులను అమ్ముకొని అప్పులపాలయ్యారన్నారు. కేవలం బటన్ నొక్కడం దానిని ప్రచారం చేయడం తోనే గత ప్రభుత్వం కాలంగడిపిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 9 నెలలు కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెయ్యి కోట్ల రూపాయలను పేదల ఆరోగ్యం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరుచేశారన్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలను పారిశ్రామికంగా వ్యాపారపరంగా పెట్టుబడులు పెట్టడానికి వ్యాపారవేత్తలు ముందుకువచ్చారన్నారు. వారందరికీ, మరల మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న నమ్మకాన్ని కలిగించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ఏలూరి సన్నిహితుడని, రాజకీయం గాకుండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి పనులు గురించి ఎక్కువగా మాట్లాడేవారన్నారు. తాను వైసీపీలో ఉన్నప్పుడు అసెంబ్లీలో ఈ విషయాన్ని గమనించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ఇప్పటివరకు పర్చూరు నియోజకవర్గంలో 730 మందికి రూ.4.65 కోట్లను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో షేక్ రజాక్, కామేపల్లి హరిబాబు, రాయపాటి సీతయ్య, శివరాత్రి శ్రీను, శానంపూడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో భారీ వర్షం

జలమయమైన రహదారులు



పర్చూరు-చీరాల రోడ్డులో నిలిచిన వర్షపునీరు, బొమ్మలకూడలిలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

పర్చూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు బుధవారం ఉరుములు, మురుపులతో కూడిన భారీవర్షంతో ప్రజలు బెంబేలెత్తారు. ఒక్కసారిగా ఆకాశం మేఘామృతం కావడం, పెద్ద ఎత్తున వర్షం కువరడంతో ఆందోళనకు గురయ్యారు. ప్రదాన రహదారులు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రధాన రహదారులను ఆనుకొని డ్రైనేజ్ కాలువలపై వ్యాపార కట్టడాలు నిర్మించుకోవటంతో డ్రైనేజ్ కాలవల్లో ఉన్న మురుగు వర్షంపు నీటితో కలసి నివాసాల్లోకి చేరటంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ కౌన్సిలర్

అవిశ్వాసంలో జంజనంకే మద్దతు


ఎమ్మెల్యే కొండయ్యకు మద్దతు తెలిపిన కౌన్సిలర్ భర్త బాబ్జీ

చీరాల, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను 1వ వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక భర్త, మాజీ కౌన్సిలర్ మొగిలి బాబ్జీ ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలోనే టీడీపీకి పనిచేయగా, అప్పటి రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వైసీపీతో చేతులు కలిపినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం కూటమి అభివృద్ధి పనులు, టీడీపీపై గతంలోనే ఉన్న అభిమానంతో తిరిగి పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు బాబ్జి ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇకపై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతోనే ప్రయాణం ఉంటుందని వివరించా రు. కానీ మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసంలో మాత్రం జంజనంకే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే అవిశ్వాసంలో ముందున్న కౌన్సిలర్లు కూడా ఎమ్మెల్యే, నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్, యువ నాయకులు గౌరీ అమర్నాథ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

జలజీవన్ మిషన్‌తో నియోజకవర్గానికి మహర్దశ

● రూ.36.55 కోట్లు మంజూరు
● వేగంగా పనులు ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచన


ఎమ్మెల్యేకు వివరాలు వెల్లడిస్తున్న డీఈ సతీష్

పర్చూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : జలజీవన్ మిషన్ నిధుల ద్వారా పర్చూరు నియోజకవర్గానికి మహర్దశ పట్టనుంది. 81 పనులకుగాను రూ.39.46 కోట్లు నిధులు మంజూరయ్యాయని డీఈ సతీష్‌చంద్ర తెలిపారు. దీంతోపాటు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో 30 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు రూ.93 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా డిస్టిక్ మ్యాచింగ్ ఫండ్(డీఎంఎఫ్) ద్వారా 13 పనులకు రూ.1.97 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నియోజకవర్గంలో ఫిల్టర్‌బెడ్‌లు వాటర్ స్కీమ్స్ మరమ్మతులు నిర్వహించుకునేందుకు ఈ నిధులు దోహద పడనున్నాయి.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులకు సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించటమే ప్రజా కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పర్చూరు నియోజకవర్గానికి మంజూ రైన నిధులు వాటి వినియోగం తదితర అంశాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ నిర్వహించారు.

అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం

● మోటార్ బైక్, గృహోపకరణాలు దగ్ధం
● రూ. 3 లక్షల మేర ఆస్థినష్టం

బల్లికురవ, మే 7 (ఆంధ్రజ్యోతి) : బ్రతుకు దెరువుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లిన ఇరువురి కి చెందిన రెండు గృహాలు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి పోయాయి. గృహాలలో ఎవరు లేక పోవటం వలన పెను ప్రమాదం తప్పింది. అని స్థానికులు అంటున్నారు. అందిన సమాచారం మేరకు మండలంలోని వి. కొప్పెరపాడు ఎస్టీ కాలనీకి చెందిన మూడావత్ హనుమనాయక్, రాజు నాయక్ అను ఇరువురు పరదాలు తీసుకుని కర్నాటక రాష్ట్రానికి వలస వెళ్లారు. వారు గృహాలకు తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం రాత్రి ఒక్క సారిగా రెండు గృహాలలో నుండి మంటలు చెలరేగాయి. వెంటనే సమీప గృహాలు వారు చూసి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. గృహాలలో ఉన్న మోటార్ బైకు, మరియు గృహోపకరణాలు, విలువైన పత్రాలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. వారు ఇళ్లల్లో విద్యుత్ కూడా లేకుండా చేసి వెళ్లారు అయినప్పటికి అగ్ని ప్రమాదం జరగటంపై పలు అనుమానాలు ఉన్నాయని బాధిత కుటుంబాల వారు ఆరోపిస్తున్నారు. గృహాలలో ఉన్న వస్తువులు అన్ని కాలి పోయిన విషయంను తోటి గృహాల వారు కర్నాటకలో ఉన్న బాధితులకు తెలపగా వారు బుధవారం వచ్చి కాలిపోయిన గృహాలను చూసి లబో దిబో మన్నారు. మంటలను అద్దంకి అగ్నిమాపక యంత్రం కొంత మేర అదుపు చేసి ఇతర గృహాలకు మంటలు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలొ సుమారు రూ. 3 లక్షల మేర అస్థి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తమను అదుకోవాలని నిరుపేద లు కోరుతున్నారు.

నేడు తృతీయ వార్షికోత్సవం


రామలింగేశ్వరస్వామి

పంగులూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు కొండపై కొలువు దీరిన శ్రీరామలింగేశ్వరస్వామి తృతీయ వార్షిక మహోత్సవం గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు వెంకటేష్ తెలిపారు. ఉదయం ఐదు గంటలకు ఆలయ గిరిప్రదక్షణ, మహాగణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించనున్నారు.

10 నుంచి వార్షిక మహోత్సవాలు

ఇంకొల్లు,మే 7,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామి 71వ తిరునాళ్ల వార్షిక మహోత్సవాలు ఈ నెల 10వ తేది నుండి 12వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు, భజనా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తుల స్వామి వారి ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల ఏర్పాటు

● రోడ్డు వెంబడే బట్టీలో కాల్పు ● పొగ, దుమ్ము, ధూళి తో వాహనచోదకుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు


తిమ్మాయపాలెం సమీపంలో బట్టీల నుంచి వస్తున్న పొగ


అద్దంకి-కలవకూరు రోడ్డులో రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలు

అద్దంకి, మే4(ఆంధ్రజ్యోతి): ఇటుకబట్టీల నిర్వహకులు నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల వెంబడే ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోకపోవటం విమర్శలకు తావిస్తుంది. గతంలో అద్దంకి పట్టణాన్ని చుట్టిముట్టిన ఇటుక బట్టీల పొగ నాటి అధికారుల చర్యలతో పట్టణానికి దూరంగా ఏర్పాటు అయ్యాయి. అయితే ఆయా ప్రాంతాలలో రోడ్ల వెంబడే ఏర్పాటు చేయడంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. అద్దంకి సమీపంలో సుమారు 70కు పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. అత్యధిక శాతం ఇటుకబట్టీలు తిమ్మాయపాలెం సమీపంలో దర్శి రోడ్డు, కుంకుపాడు రోడ్డు, రామాయపాలెం రోడ్ల వెంబడి ఉన్నాయి. ఇక మిగిలిన ఇటుకబట్టీలు అద్దంకి పట్టణం నుండి కలవకూరు రోడ్డులో రోడ్డు అంచులనే రెండు వైపులా ఏర్పాటు చేశారు. ఆయా రోడ్లలో రోడ్ల వెంబడే ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో ఇటుక బట్టీల నుండి వచ్చే పొగ, దుమ్ము, ధూళి వాహనచోదకుల కళ్లలో పడి ఇబ్బంది పడుతున్నారు. దుమ్ము, పొగ నుండి తప్పించుకునేందుకు ఇటుక బట్టీల పొడవున ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు కళ్ళు మూసుకొని వాహనాలను నడపాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని సార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కళ్లలో దుమ్ము, పొగ పడుతుండటంతో కళ్లు మసకబారి వైద్య పరీక్షలు కూడా చేయించుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. రోడ్డు కు కనీసం 50 నుండి 100 మీటర్ల దూరంలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఉంది. అదే సమయంలో ఖచ్చితంగా ఇటుకబట్టీల చుట్టూ చెట్లు పెంచాల్సి ఉంది. చెట్లు పెంచటం ద్వారా పొగ, దుమ్ము, ధూళి రోడ్డు పైకి రాకుండా నివారిస్తుంది. ఇలా నిబంధనలు ఉన్నా ఏ ఒక్క ఇటుక బట్టీల యజమానులు కూడా నిబంధనలు పట్టించుకోకుండానే రోడ్డు మార్జిన్ లను సైతం ఆక్రమించి బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల మేరకు అన్ని ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ జీవితచరిత్రను వీక్షించండి

కలెక్టర్ వెంకటమురళి


కలెక్టర్‌కు కరపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ ప్రతినిధులు

చీరాల, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వ తేదీన చీరాల అంబేడ్కర్ భవనంలో ప్రదర్శిస్తున్న రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జీవితచరిత్రను ప్రతిఒక్కరూ చూసి అవగాహన పొందాలని కేవీపీఎస్ ప్రతినిధులు అన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించి, ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి కృష్ణమోహన్, చీరాల పట్టణ ఉపాధ్యక్షులు ఎన్ బాబూరావు పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

● ఈపూరుపాలెంలో కేసు నమోదు

చీరాల, మే 7 (ఆంధ్రజ్యోతి) : భార్యను వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కావూరివారిపాలెంకు చెందిన కావూరి మౌనికను భర్త కొంత కాలంగా వేధిస్తున్నాడు. ఈక్రమంలో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 216పై మంగళవారం అర్ధరాత్రి ఇరువురు యువకులపై దాడికి పాల్పడిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన గవిని విజయ్‌కుమార్, కీర్తివారిపాలేనికి చెందిన మరొక వ్యక్తితో కలిసి రేపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. తోటవారిపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద స్వర్ణుపురంకు చెందిన చౌట అభినయ్, బొజ్జగాని సంపత్, సిరాజ్ సాహో, కాశీంలు కారుతో వెంబడించి ఆపి విచక్షణ రహితంగా దాడి చేశారు. అయితే అదే సమయంలో వారు పారిపోయి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి, బాధితులు బంధువుల ట్రాక్టర్ ఎదురు రావడంతో వారు నింధితులను పట్టుకుని ఈపూరుపాలెం పోలీసులకు అప్పగించారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. అలాగే కారును సీజ్ చేశారు. ఘటనకు పాల్పడిన వారిలో ఒకరు పోలీసు విభాగంలో పనిచేస్తున్న కుటుంబ సభ్యుడు కూడా ఉన్నట్లు సమాచారం.

తీరంలో పటిష్ట భద్రత

● తీర ప్రాంత గ్రామాల ప్రజలకు అవగాహన
● చొరబాటు దారులపై ప్రత్యేక నిఘా


అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ సాంబశివరావు, ఎస్సై రాజేష్

వాడరేవు(చీరాల), మే 7 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్‌లో భాగంగా వాడరేవు, రామాపురం సముద్రతీరంలో కొత్తపట్నం కోస్టల్ సెక్యూరిటీ సీఐ సాంబశివరావు, ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఒక వైపు పహల్గాం ఉగ్రదాడికి ప్రతిఘటనగా భారత వీరజవాన్లు పాక్‌పై వీరోచిత పోరాటాలు చేస్తున్నారు. ఈక్రమంలోనే వాడరేవు, రామాపురం, పల్లెపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారిపాలెం ప్రాంతాల తీరం నుంచి శత్రువులు గ్రామాల్లోకి చొరబడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా ప్రమాదాల నియంత్రణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు వివరిస్తున్నారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1093, లేదా స్టేషన్ నెంబర్ 93929 14742కు అందజేయాలని సూచిస్తున్నారు.

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోండి


ఉద్యానపంటలను పరిశీలిస్తున్న పీడీ విజయలక్ష్మి

ఇంకొల్లు, మే 7, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఇంకొల్లులో ఆమె పర్యటించారు. నాగులచెరువుకట్ట చుట్టూ ఏర్పాటు చేస్తున్న వాకింగ్‌ట్రాక్, సుద్దబావి దగ్గర నిర్మిస్తున్న పార్కును పరిశీలించారు. పల్లె కుసుమం పథకంకింద ఉద్యానవనం, వాకింగ్‌ట్రాక్ వెంట నీడనిచ్చే మొక్కలు నాటాలన్నారు. ఇడుపులపాడు డొంక పొడవునా, ఇరువైపులా మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. ఇంకొల్లులో ఉపాధిపథకం ద్వారా సాగవుతున్న డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలించారు. ఉపాధి పథకం కింద ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. జామ, సపోట, డ్రాగన్, మునగ, కొబ్బరి, మామిడి లాంటి పంటలకు నూరుశాతం రాయితీ అందజేస్తుందన్నారు. రెండేళ్లపాటు నిర్వాహణ ఖర్చులు కూడా అందజేస్తామన్నారు. పొలాల్లో నీటి కుంటలు కూడా ఉచితంగా తీయిస్తున్నామని రైతులు రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట ప్లాంటేషన్ మేనేజరు కిరణ్, ఏపీడీ కోటయ్యనాయక్, ఏపీవో బుల్లెయ్య, కోటేశ్వరరావు ఉన్నారు.

రచ్చకెక్కిన స్థలం పంచాయితీ

● సొన పోరంబోకు ఆక్రమణ నేపథ్యంలో వివాదం
● పరస్పర ఫిర్యాదులు


గాయపడిన సంతోష్

రామన్నపేట (చీరాల), మే 7 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతి పరిధిలో నెలకొన్న సొన పోరంబోకు స్థలం వివాదం రచ్చకెక్కింది. పంచాయతి పరిధిలోని బాపయ్యనగర్‌లో ఉన్న సుమారు 80 సెంట్లు సొన పోరంబోకులో ముప్పావు భాగం ఇప్పటికే అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లింది. అయితే ఈ క్రమంలో కొంతభూమిలో కొంతకాలంగా గ్రామానికి చెందిన చొప్పవరపు సంతోష్ పశువుల కొష్టంగా వినియోగించుకుంటున్నాడు. అయితే ఆ స్థలం తనదంటూ ఆ పంచాయతీ సెక్రటరీ సురేంద్ర శాశ్వత కట్టడం కోసం సిమెంట్ రాళ్లు తోలిస్తుండగా నిలదీసినందుకు సెక్రటరీ సురేంద్ర విచక్షణ రహితంగా ఎడమకంటిపై దాడి చేశాడని సంతోష్ మంగళవారం రాత్రి చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సర్వేకు వెళ్లగా తనపై దాడి చేశారని సురేంద్ర ఆస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై వేటపాలెం పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే సంఘటన స్థలంలో వివాదం జరిగి సంతోష్ తీవ్రంగా గాయపడిన వీడియో సమాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనిపై ఉన్నతాధికారులు వాస్తవ పరిణామాలు విచారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


చికిత్స పొందుతున్న సంతోష్

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.4	28.1
కావలి	36	28
ఆత్మకూరు	38	28
ఉదయగిరి	38	27
కందుకూరు	38	28



ఆపరేషన్ సిందూర్.. కమలనాథుల సంబరం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై బీజేపీ నాయకులు నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్‌లో జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మహిళల నుదుట సిందూరాన్ని తుడిచి వేసిన ఉగ్రవాదులను మహిళా కమాండోల నాయకత్వంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఉగ్రవాదాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్న పాకిస్థాన్‌కు ఈ సైనిక దాడి హెచ్చరిక లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, పద్మావతి, నాగలక్ష్మి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు. కోవూరులో రాజకీయ పార్టీల నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు.

● **నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) :** పాకిస్థాన్ మోస్ట్ వాంటెడ్ లష్కర్ ఇ తోయిబా ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు హఫీజ్ సయ్యద్, మసుద్ అజర్‌లకు నగరంలోని పెన్నానది ఒడ్డున బీజేపీ నాయకులు కర్మఖండలు నిర్వహించారు.

● **నెల్లూరు (సాంస్కృతికం) :** పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను నిర్వీర్యం చేసిన భారత సైన్యానికి అభినందనలు తెలుపుతూ కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని నర్తకి సెంటర్‌లో జాతీయ జెండాను ప్రదర్శించి, మిఠాయిలు పంచిపెట్టారు. కేతా సుబ్బారావు, సింగంశెట్టి మురళీమోహన్‌రావు, షేక్ అబ్దుల్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో జెండావందనం చేస్తున్న బీజేపీ నాయకులు



పోలీసులు హెచ్చరించినప్పుడు కింద పడుకోవడం..





గాయపడిన వారిని తరలిస్తూ..

సన్నద్ధత సైరన్!

● **పోలీస్, అగ్నిమాపక దళం మాక్‌డ్రిల్**

దేశ సరిహద్దులో ఉద్రిక్తత నెలకొన్న వేళ ఎలాంటి పరిణామాలైనా ఎదుర్కొనేలా ప్రజలను సన్నద్ధం చేయడానికి పోలీసులు జిల్లావ్యాప్తంగా బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. దాడి జరిగిన సమయంలో ఏవిధంగా బయట పడాలన్న విషయాలపై ప్రజలకు చైతన్యం కల్పిస్తూ నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో నెల్లూరు ఆర్డీవో అనూష పర్యవేక్షణలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. దాడి జరుగుతున్న సమయంలో సైరన్ మోగినప్పుడు ప్రజలు కింద పడుకోవడం, దూరంగా పారిపోవడం, సెల్‌ఫోన్లు, లైట్లు ఆఫ్ చేయడం ఇలా అనేక జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రజలను ఏవిధంగా కాపాడతారన్న అంశాలను మాక్‌డ్రిల్‌లో చూపించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర తాహసీల్దార్ షఫీ మాలిక్, ఆర్టీసీ ఆర్ఎం ముధుబాబు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



డ్రోన్ ద్వారా పరిశీలన

ఉగ్రవాదం అణచివేతలో ఏకం కావాలి

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం : ఉగ్రవాదం అణచివేతలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే నిర్ణయాలకు అందరం కట్టుబడి ఉండాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం సోమశిలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని దేశాలు బాగుండాలని భారత్ కోరుకుంటూ ఉంటే పాకిస్థాన్ మాత్రం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ ఉగ్రమూకలు చేసే ఆగడాలను ప్రోత్సహించడం చూస్తున్నామని చెప్పారు. ఆ దేశానికి గుణపాఠం చెప్పే రోజు ఆసన్నమైందన్నారు. ఉగ్రవాద అణచివేతకు తీసుకొనే ప్రతి నిర్ణయానికి దేశంలోని 125 కోట్ల మంది ప్రజలు తమ మద్దతు తెలపాలని కోరారు.

● **మన సత్తా ఏంటో చూపించాం : ఎంపీ**

నెల్లూరు (హరనాథపురం) : భారత పరాక్రమాలకు ఆపరేషన్ సిందూర్ చర్య నిదర్శనమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత్ ఆర్మీపై ఆయన ప్రశంసలు కురిపించారు. భారత సైన్యం పరాక్రమాలు ఏంటో పాకిస్థాన్‌కు చూపించారని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శత్రువుకు భయంకర ప్రతిస్పందన ఇస్తున్న భారత సాయుధ దళాలకు ధన్యవాదాలు తెలిపారు.



ధ్వజారోహణ గావిస్తున్న ఆలయ అర్చక బృందం

వేదగిరీశుని ఉత్సవాలకు రారండి!

● శాస్త్రోక్తంగా ధ్వజారోహణ

● గరుడపటంతో దేవతలకు ఆహ్వానం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజపటం ఎగిరింది. ముందుగా అర్చక బృందం గరుడ పటానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆ తర్వాత ధ్వజస్తంభానికి అధిరోహింపజేశారు. అనంతరం లక్ష్మీ నృసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. తొలి వాహన సేవగా స్వామి వారు శేష వాహనంపై ఆలయ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో వేమూరి గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు.



అవార్డు అందుకుంటున్న కో ఆర్డినేటర్ పద్మజ

గురుకుల ఉత్తమ కో ఆర్డినేటర్‌గా పద్మజ

● పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ నెల్లూరు జిల్లా కో ఆర్డినేటర్ టీ పద్మజకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లా కో ఆర్డినేటర్ అవార్డు లభించింది. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించి జిల్లాను ఉత్తమ స్థానంలో నిలబెట్టినందుకు ఆమెకు ఈ అవార్డు దక్కింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నతాధికారులు పురస్కారంతోపాటు నగదు బహుమతిని అందజేశారు. జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా అవార్డులు లభించాయి. పెద్దపావని గురుకులంలో పదో తరగతి చదివిన ఎస్ కవిత(593 మార్కులు), ఇంటర్ చదివిన వీ ప్రవల్లిక (986), భావన (986)లకు అవార్డుతోపాటు నగదు బహుమతులు అందుకున్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించినందుకు అవార్డులు దక్కాయి.

నాన్‌డెల్టాకు నీటి విడుదల చరిత్రాత్మకం

● సమన్వయంతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వకు శ్రీకారం

● ఉమ్మడి జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో సాగు

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం మే (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి రెండవ పంట నాన్‌డెల్టాకు నీరు సరఫరా చేసి నూతన అధ్యయనానికి శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రాజెక్టును సందర్శించి, పవర్ ప్లాంట్‌లో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి స్విచ్ ఆన్‌చేసి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి ఆనం మాట్లాడుతూ సోమశిల, కండలేరు జలాశయాల్లో సమన్వయంతో నీటి నిల్వ చేసి ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 4 లక్షల ఎకరాలు డెల్టా, నాన్‌డెల్టాకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. జలాలను పొదుపుగా సద్వినియోగం చేసుకొని నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని రైతులను కోరారు. ఐఏబీ నిర్ణయం మేరకు ప్రతి కాలువకు నీరు ఇస్తామని చెప్పారు. గతంలో రెండవ పంట నాన్‌డెల్టాకు నీరు ఇచ్చేందుకు ప్రాంతాలు, నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు వచ్చేవని, గత వైసీపీ హయాంలో ఒక్కసారి కూడా రెండవ పంటకు నీరు సరఫరా చేసి రైతులను ఆదుకొన్న దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రయోజనాలు గుర్తించి రాష్ట్రంలోని ప్రాజెక్టులకు పునరుజ్జీవం పోస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, తాళ్లూరి గిరినాయుడు, ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షురాలు సునీత, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారు సుభాషిణి, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం

జేసీకి నుడా వీసీ బాధ్యతలు

నెల్లూరు (జడ్పీ), మే 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) వైస్‌చైర్మన్ బాధ్యతలను జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు అప్పగిస్తూ మున్సిపల్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటిదాకా నుడా వీసీ ఇన్‌చార్జి బాధ్యతలను కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ నిర్వహిస్తూ వస్తుండగా, గత నెల 16న ఆయన బదిలీ అయ్యారు. దీంతో అప్పటినుంచి వీసీగా ఎవరిని నియమిస్తారనే ఉత్కంఠ నెలకొంది. అయితే, అనూహ్యంగా జేసీ ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

బియ్యం కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

● నెల రోజులపాటు ప్రక్రియ ● 12 నుంచి వాట్సప్ ద్వారా కూడా..

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డులు (బియ్యం), ఉన్న కార్డుల్లో మార్పు, చేర్పుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ కార్డులను జూన్‌లో ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇక కొత్త కార్డుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ బుధవారం మొదలైంది. జిల్లాలో 6.37 లక్షల కుటుంబాలు ఉండగా, 24.69 లక్షల జనాభా ఉంది. ఇక 7.35 లక్షల బియ్యం కార్డులు ఉండగా, 1513 రేషన్‌డీలర్ల ద్వారా 13వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. కాగా, ఉన్న కార్డులలో 2.48 లక్షల కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదని నిర్ధారించి దశలవారీగా వారికి అవకాశం కల్పించారు. 1.25 లక్షల కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదు. కొత్త బియ్యం కార్డుల కోసం అర్హులు మూడేళ్లుగా ఎదురుచూస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అవకాశం కల్పించింది. సచివాలయాల్లో బుధవారం నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రారంభమవగా 12వ తేదీ నుంచి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు. నెలరోజులపాటు ఈ ప్రక్రియ ఉంటుంది. అనాథ ఆశ్రమాల్లో ఉండేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక జూన్‌లో జారీ చేసిన స్మార్ట్ కార్డుల ఆధారంగా దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈకేవైసీ పూర్తయిన వాళ్లు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక జూన్‌లో స్మార్ట్ కార్డుల రూపంలో కొత్త కార్డులను కొరియర్ ద్వారా లబ్ధిదారుల చిరునామాకు పంపిస్తారు.

● రేషన్‌కార్డుల్లో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను కలుపుకోవచ్చు.

● ఒకవేళ కార్డు వద్దనుకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు.

● కుటుంబ విభజనలో భాగంగా కొత్త కార్డు మంజూరు చేస్తారు.

● ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీల నుంచి కూడా దరఖాస్తు స్వీకరిస్తారు.

● చిరునామా మార్పు, తప్పులను సవరించుకోవచ్చు.

● రేషన్‌కార్డుల్లో తప్పుగా ఉన్న ఆధార్ నెంబర్‌ను సరి చేసుకునే వెసులుబాటు ఉంటుంది.



ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాము. సచివాలయాల్లో దరఖాస్తు అందజేయవచ్చు. అదేవిధంగా కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పు, మృతుల పేర్ల తొలగింపు, కార్డులు సరెండర్ తదితర రకాల సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలి.

- ఎన్.విజయకుమార్,

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి



రాజేశ్వరి

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజేశ్వరి

నెల్లూరు (వ్యవసాయం), మే 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జీ రాజేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడకు చెందిన రాజేశ్వరి రాజమండ్రి, గుంటూరు వైద్య కళాశాలల్లో పనిచేశారు. రాజమహేంద్రవరంలో బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్య కళాశాల, ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజేశ్వరి తెలిపారు.

ఉసురు తగిలింది..

శిక్ష పడింది!

● ఎందరో ప్రాణాలు బలిగొన్న 'గాలి' అత్యాశ

● 120 కి.మీ పొడవునా 'ఐరన్‌ఓర్' దారుణాలు

● జనార్ధన్‌రెడ్డికి శిక్షతో బాధిత కుటుంబాల్లో ఆనందం

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : అడవులను హరించి.. వందలాది కిలోమీటర్ల రహదారులు ధ్వంసం చేసి, వేలాది మంది ప్రజలను శ్వాసకోస వ్యాధులకు గురిచేసి, అడ్డూఅదుపు లేని వేగంతో అమాయకులను తొక్కించి, వారి సమాధుల మీద రూపాయలతో కోటలు కట్టుకున్న గాలి జనార్ధన్‌రెడ్డికి ఎట్టకేలకు పీడిత ప్రజల ఉసురు తగిలింది. ఓబులాపురం నుంచి కృష్ణపట్నం నౌకాశ్రయం వరకు ఇనుప ఖనిజం కొల్లగొట్టడానికి జనావాసాల మీదుగా వేలాది లారీలు నడిపిన జనపీడితుడికి తగిన శిక్ష పడింది. వ్యాపారాలు చేయడం తప్పు కాదు. అందుకు రవాణా చేయడమూ తప్పు కాదు. కానీ ప్రజలకు ఇబ్బంది కలగకూడదు. 2004 నుంచి 2009 వరకు ఐదేళ్లపాటు సాగిన ఈ దుర్మార్గమైన రవాణా జిల్లాలో ఎంతో మంది ప్రాణాలను బలిగొంది. జిల్లా పరిధిలోని 120 కిలోమీటర్ల ప్రయాణంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు ఐరన్ ఓర్ లారీల కింద పడి ప్రాణాలు విడిచారు. ఇనుప ఖనిజం రవాణా మంచి లాభసాటిగా మారడంతో విపరీతంగా లారీలు, టిప్పర్లు ఇందుకు పోటీ పడ్డాయి. అధికారం, అర్థబలం రెండు పుష్కలంగా ఉన్న కారణంగా అధికారులు ఇనుప ఖనిజం రవాణా వాహనం ఫిట్‌నెస్ గురించి పట్టించుకోవడం మానేశారు. దారినపోయే లారీలను లెక్కించుకొని మామూళ్లు తీసుకోవడమే తమ ఉద్యోగ ధర్మంగా భావించారు. దీంతో కండీషన్ లేని వాహనాలు, శిక్షణ లేని డ్రైవర్లు రహదారులపై సామాన్య ప్రజల రక్తం చవిచూశారు. ఐదేళ్ల కాలంపాటు తిరిగిన లారీల వల్ల కలిగిన వాయు కాలుష్యంతో వేలాది మంది ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధులకు గురయ్యారు. ప్రధానంగా మర్రి పాడు, సంగం, బుచ్చి, వెంకటాచలం, ముత్తుకూరు తదితర ప్రాంత ప్రజలు కాలుష్యానికి ఊళ్లు వదిలి వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది. పై ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ లారీల కింద పడి పదుల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. మరోవైపు ఓవర్‌లోడ్లు కారణంగా జిల్లాలోని 120 కి.మీ పరిధిలోని రహదారులు ధ్వంసం అయ్యాయి. మొత్తమ్మీద ఐరన్‌ఓర్ ట్రాన్స్‌పోర్టు ద్వారా కొందరతే లాభపడ్డారు కానీ అన్నెం, పున్నెం ఎరుగని సామాన్యులు మాత్రం నిత్య నరకం అనుభవించారు. ప్రజలను ఇంత క్షోభకు గురిచేసిన గాలి జనార్ధన్‌రెడ్డికి ఓబులాపురం మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడినందుకు సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించడం పట్ల జిల్లాలోని బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆనాటి భయంకర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని చేసిన తప్పునకు సరైన శిక్ష పడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొల్లా మాల్యాద్రి (ఫైల్)


ఈయన పేరు కొల్లా మాల్యాద్రి. సంగం వాసి. 9-10-2010 తేదీన సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సంగం బస్టాండు వద్ద ఐరన్ ఓర్ లారీ ఢీకొంది. దీంతో లారీ చక్రాల కింద నలిగి మాల్యాద్రి మృతి చెందాడు. ఇంటి యజమాని మృతి చెందడంతో భార్య సుబ్బమ్మ, ఇద్దరు కుమార్తెలు దిక్కులేని వారయ్యారు. నాడు ఇద్దరు కుమార్తెలు మైనర్‌లు కావడంతో మేజర్ అయిన తరువాత నగదు కోర్టులో నగదు ఇస్తామన్నారు. వారు మేజర్ అయి.. పెళ్లిళ్లు కూడా జరిగాయి. ఇంతవరకు పరిహారం మాత్రం అందజేలేదు. ఈ పరిస్థితి మాల్యాద్రి ఒక్కరిదే కాదు. నాడు ఐరన్ ఓర్ లారీల చక్రాల కింద నలిగిన ఎంతోమంది కుటుంబాల దీనగాథ ఇది.

● సంగం మండలం పల్లిపాళెంకు చెందిన అత్తిపాటి వెంకటరత్నంది పేద కుటుంబం. ఒకరోజు ఇదేవిధంగా తెల్లవారుజామున సైకిల్‌పై కూరగాయలు తీసుకుని సంగం దాటి పెరమనకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కొండ మలుపులో వెనుక నుంచి ఐరన్ ఓర్ లారీ తొక్కించి వెళ్లిపోయింది. మృతుడికి భార్య పద్మమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటిపెద్ద మృతితో ఆ కుటుంబం నానా కష్టాలు పడుతోంది.


● సంగం మండలం పెరమనకు చెందిన కొంజేజి అంకమ్మ, రమణయ్య ఇతర కూలీలతో కలిసి రోడ్డు పక్కన ఉపాధి పనులు చేస్తుండగా ఐరన్ ఓర్ లారీ అదుపు తప్పి కూలీల మీదకు దూసుకు వచ్చింది. ఆ ప్రమాదంలో అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలో ఇలాంటి సంఘటనలు ఒకటి కాదు... రెండు కాదు. ఐదేళ్లలో 25 మందికి పైగా ఐరన్ ఓర్ లారీల కారణంగా మృత్యువాత పడ్డారు.



సంగంలో మాల్యాద్రిని పొట్టనపెట్టుకున్న ఐరన్ ఓర్ లారీ (ఫైల్)



గాలి జనార్ధన్‌రెడ్డి



రోడ్డుపైకి రావాలంటేనే భయపడేవాళ్లం

మైనింగ్ లారీలు తిరుగుతున్న ఏ సమయంలో ఏం జరుగుతుందోననే భయంతో ఉండేవాళ్లం. బైక్‌పై ఆత్మకూరు వెళ్లి తిరిగి ఇంటికి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరిగేవాళ్లం. కృష్ణపట్నం పోర్టులో ఐరన్‌ఓర్‌ను అన్‌లోడ్ చేసి, తిరిగి సీరియల్ కోసం లారీలను డ్రైవర్లు పోటీపడి నడిపేవాళ్ల. ఒకరోజు నేను మర్రిపాడు బస్టాండ్‌లో ఉండగా, బద్వేల్ వైపు 2 కి.మీ దూరంలో మైనింగ్ లోడుతో ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వచ్చిన ఓ కారు ఢీ కొంది. ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఇప్పటికీ ఈ ఘటన నాకు గుర్తుంది.

- కె. వెంకటేశ్వర్లు, మర్రిపాడు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 500

గోకులం షెడ్లకు ప్రతిపాదనలు పంపండి

లింగసముద్రం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ తీర్మానాలు లేక మూడు నెలలుగా ఆగిన 27 గోకులం షెడ్లు, ఇతర నిర్మాణ పనులకు తీర్మానాలు ఇచ్చినందున ఉపాధిహామీ సిబ్బంది వెంటనే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని ఉపాధిహామీ పథకం ఏపీవో దయాసాగర్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 పశువుల నీటి తొట్ల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపించాలన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. గోకులం షెడ్లు ఒక్కోటి రూ.2.30 లక్షలు, పశువుల నీటి తొట్లకు ఒక్కోదానికి రూ.33 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈనెల 30 లోపు గ్రామానికి నాలుగు చొప్పున నీటితొట్లు నిర్మించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఉద్యానవన తోటల పెంపకంపై అవగాహన కల్పించి, రైతుల వివరాలు సేకరించి అంచనాలు తయారు చేయాలన్నారు. కూలీలు కొలతల ప్రకారం 4 గంటలు పనిచేస్తే రూ.290 కూలీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ విజయకుమార్ పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న పార్కు!



ముస్తాబైన లింగయ్యనాయుడు మున్సిపల్ పార్కు

కందుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ నడిబొడ్డున ఉన్న దివి లింగయ్యనాయుడు మున్సిపల్ పార్కు నూతన హంగులతో ముస్తాబుతోంది. కందుకూరు గ్రామపంచాయతీగా ఉన్నకాలంలో ఏర్పాటైన ఈ పార్కు ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు సేద తీరేందుకు దోహదపడగా గత వైసీపీ ప్రభుత్వంలో పార్కు సుందరీకరణ కోసం సుమారు రూ.50 లక్షల నిధులు కేటాయించి పాత నిర్మాణాలు, చెట్లను పూర్తిగా తొలగించివేసి ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. అయితే అప్పట్లో పనులు నత్తనడకన సాగాయి. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గత ఏడాదిన్నర కాలంగా ఈపార్కు ప్రజలకు ఉపయోగపడకుండా పోయింది. ఇటీవలికాలంలో తిరిగి పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయడంతో పార్కు ముస్తాబై ప్రారంభానికి సిద్ధమవుతోంది. పార్కులో నూతనంగా షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్‌లతో పాటు ఓపెన్ జిమ్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు అవసరమైన వివిధ రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. వాటర్‌ఫౌంటైన్, వివిధరకాల పూలమొక్కలతో సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రజలు సేదతీరేందుకు వీలుగా అక్కడక్కడ బల్లలు ఏర్పాటు చేసే పనులను రెండు మూడురోజుల్లో పూర్తి చేసి త్వరలోనే ప్రారంభించపజేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కాంట్రాక్టర్ పొడపాటి నాగేశ్వరరావు వివరించారు. అయితే పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ పార్కు గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలు మధ్యాహ్నం వేళల్లో సేదతీరేందుకు ఎంతో అనుకూలంగా ఉండేదని, గత రెండేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రస్తుతం కూడా కేవలం పూలమొక్కలే కాకుండా నీడనిచ్చే బాదం, పనస, మామిడి లాంటి చెట్లు కూడా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బల్లలు



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



జరుగుతున్న వాటర్ ఫౌంటైన్, వాకింగ్ ట్రాక్ పనులు

న్యూస్ బాక్స్

మండల సమావేశానికి అధికారుల డుమ్మా



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ మస్తానమ్మ, ఎంపీడీవో విజయ

ఉలవపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సమావేశానికి రెవెన్యూ, విద్యుత్, అటవీ శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. దీంతో తమ సమస్యలకు సమాధానం చెప్పేవారు లేనప్పుడు సమావేశాలు ఎందుకని ఎంపీటీసీలు, సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. భీమవరం పాఠశాల భవనం నిర్మాణ పనులు మొదలు పెట్టి పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేసేలా చూడాలని వైఎస్ ఎంపీపీ రమణయ్య కోరారు. ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా కోరారు. ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కలిగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఆధార్‌కార్డు ఇవ్వడానికి కలిగిరి, సిద్దనకొండూరు, చినఅన్నలూరు గ్రామాల్లో గురువారం నుంచి ప్రత్యేక అధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదుకు పుట్టినతేది ధ్రువీకరణ పత్రము తప్పనిసరని, లేనివారికి తహసీల్దారు మంజూరు చేసిన డొమైసిల్ సర్టిఫికెట్(అడ్రస్ ప్రూఫ్) ద్వారా ఆధార్ నమోదు చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ఆయా ప్రాంతాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగేటట్లు చూడాలని పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

లింగసముద్రం, మే 7(ఆంధ్రజ్యోతి) : వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీ.రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా, రోజుకు 15 గ్లాసులు నీరు తాగాలని పేర్కొన్నారు. మధ్యాహ్న సమయంలో అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

గుడ్లూరు, మే 7(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్రయాణికులకు బుధవారం దాతలు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ ప్రదేశంలో ప్రతిరోజు మంచినీరు అందిస్తామని, వారంలో 3, 4 రోజులు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నేత్రపురి శ్రీరామ్ సేవక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్నమూరి గరటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉలవపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్స్ అసోసియేషన్, నరయాస్ హస్పిటల్ ఆధ్వర్యంలో ఉలవపాడులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం డాక్టర్ రాజేష్ ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ ప్యాకెట్లు అందచేశారు. పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రత్నకుమార్, పాస్టర్ కమలాకర్, మోసేస్, నరయాస్ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ము లేస్తోంది!



కావలి రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలో అన్నపగుంట పూడికతీత పనుల్లో భాగంగా అక్కడ తీసిన మురుగును ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ల వేగానికి ఆ ప్రాంతంలోని గ్రావెల్ రోడ్డులో దుమ్ము లేసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నీరు చల్లకపోవడం, పగటి పూట మురుగు తరలిస్తుండడంతో అక్కడ రేగిన దుమ్ము రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లను చుట్టేస్తోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ట్రాక్టర్లలో తరలిస్తున్న మురుగు రోడ్డుపై పడుతుండడంతో ఆ బురదలో ప్రయాణించే దిచక్ర వాహనదారులు అదుపుతప్పి పడి గాయపడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

● ఎంఈవో గోవిందయ్య

కావలిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దారిద్రరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు నిర్ణయించింది. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని వారి పిల్లలను చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో గోవిందయ్య తెలిపారు.



? ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు. ఎవరు అర్హులు.

! ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించి ఉచిత విద్య అందిస్తారు. దీనికి దారిద్రరేఖకు దిగువనున్న కుటుంబాలకు చెందిన పిల్లలు అర్హులు.

? అన్ని తరగతులకు అవకాశం ఉందా. కావలిలో ఎన్ని పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి.

! కేవలం 1వ తరగతిలో ప్రవేశానికి మాత్రమే అవకాశం కల్పించారు. కావలి పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 35 ఉన్నాయి.

? ఎలా దరఖాస్తు చేసుకోవాలి. ఏఏ పత్రాలు సమర్పించాలి. చివరి తేదీ ఎప్పుడు.

! ఈనెల 15 తేదీ లోపల మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో దరఖాస్తుతో పాటు జత చేయాలి.

ఫైలాన్‌ను కూలుస్తామని చెప్పలేదా?

● కోనేరులో మునిగి ప్రమాణం చేస్తావా ● మాజీ ఎమ్మెల్యేని ప్రశ్నించిన టీడీపీ నేతలు

కావలి, మే 7(ఆంధ్రజ్యోతి): కావలిలో అమృత పథకం ఫైలాన్‌ను కూలుస్తామని చెప్పి మరీ కూల్చింది మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాదా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, తిరువీధి ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు, జనసేన నాయకుడు సిద్ధూ మాట్లాడుతూ 2019లో కావలి ప్రజల దాహార్తిని తీర్చటానికి అప్పటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడి సహకారంతో అమృత్‌పథకం మంజూరు కాగా దాని కోసం ఏర్పాటు చేసిన ఫైలాన్‌ను రాష్ట్రమంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారన్నారు. ఆ ఫైలాన్‌ను 2020లో రాత్రికి రాత్రి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నేతలు, కొందరు విలేకరులు ధ్వంసం చేశారన్నారు. వారిపై కేసులు ఉండవా అని ప్రశ్నించారు. అది వైసీపీ ప్రభుత్వంలో మీ ప్రమేయంతో జరుగటంతో కేసును దర్యాప్తు చేయనీయకుండా ఫైలును మూసివేసింది వాస్తవం కాదాన్నారు. రౌడీయిజం గురించి ప్రతాప్‌రెడ్డి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఫైలాన్ ధ్వంసంతో మాజీ ఎమ్మెల్యేకు సంబంధం లేకపోతే శివాలయం కోనేరులో మునిగి దేవుడి ముందు ప్రమాణం చేయాలని, లేకపోతే పోలీసులకు సరెండరై వాస్తవాలు ఒప్పుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం 332వ వార్షిక ఆరాధనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, చంద నాలంకారం, గణపతిపూజ, పుణ్యాహ వచనం, బ్రహ్మ కలిశ సకల దేవతల ఆహ్వా నం జరిగాయి. అనంతరం స్వామివారికి సమాధి పూజ, మూర్తి హోమం, సహస్ర నామార్చన నిర్వహించారు. ఆ తర్వాత అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సహస్ర దీపారాధన, కోలాటం, భరతనాట్య ప్రదర్శన జరిగాయి. కార్యక్రమాలను విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు కందు కూరు చెంగయ్య ఆచారి, కందుకూరి జనార్దన్, బాలకృష్ణ ఆచారి, అలిమేలి శ్రీహరి ఆచారి, సురేష్ ఆచారి, రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

జలదంకి బస్టాండులో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఆర్టీసీ హమాలీలు

జలదంకి, మే7(ఆంధ్రజ్యోతి): జలదంకి బస్టాండులో ఇటీవల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. ఈ నెల 1న వింజమూరులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్, నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి వచ్చారు. వారు కావలి నుంచి వింజమూరు వెళుతుండగా మార్గమధ్యంలో జలదంకి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో బీజేపీ నాయకులు ఆపి మంత్రికి స్వాగతం పలికి సన్మానించారు. ఆ సమయంలో సురేష్‌రెడ్డికి బస్టాండు దుస్థితిపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఆర్టీసీ అధికారులను బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో కావలి ఆర్టీసీ డిఎం శ్రీనివాసులు మంగళవారం బస్టాండును పరిశీలించి బుధవారం కావలి ఆర్టీసీలో పనిచేస్తున్న హమాలీలను వెంటబెట్టుకుని వచ్చి ముందుగా బస్టాండు ఆవరణలో ఉన్న ఫ్లెక్సీలను మొత్తం తొలగించారు. బస్టాండు ప్రాంగణంలో ఫ్లెక్సీలు కట్టకుండా ఉండేలా తరుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫ్లెక్సీలు తొలగించే సమయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి, నాయకులు చల్లా హనుమారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డిలు అక్కడే ఉండి పర్యవేక్షించారు. బీజేపీ నాయకుల చొరవతో బస్టాండు ప్రాంగణం ప్రయాణికులకు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీలో చేరిన వారికి సముచితస్థానం

● 29వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌కి ఎమ్మెల్యే ఆహ్వానం

కావలి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆతర రాజకీయ పార్టీల నుంచి టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 29వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి పెనుమల్లి అశోక్ బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి. అశోక్ చేరికతో వైసీపీకి ఆ వార్డులో షాక్ తగిలినట్లైంది.

● బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే

పట్టణంలోని వెంగళరావునగర్‌లోని నవవికాస్ వద్ద, శివాలయం సమీపంలో ఉన్న వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం జరిగిన బ్రహ్మంగారి ఆరాదనోత్సవాల్లో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి ఆశీస్సులు కావలి నియోజకవర్గ ప్రజలకు ఉండాలని కోరుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు టీడీపీ నాయకులు మొగిలి కల్లయ్య, పోతుగంటి అలేఖ్య, పోట్లూరు శ్రీనివాసులు,శానం హరి, నాయుడు రాంప్రసాద్, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



29వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌కు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

కొండాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మిలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చిన్నమఠం, పెద్దమఠంలలో ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. చిన్నమఠం ధర్మకర్త కంచర్ల కేశవచారి ఆధ్వర్యంలో పూర్ణకుంభ, కలశాలతో పవిత్ర జలాలను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రామానుజపురం, కుంకువారిపాలెం, సత్యవోలు, లింగనపాలెం గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయనిర్వాహకు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.



కొండాపురం : పూర్ణకుంభం, కలిశం ఉరేగింపులో భక్తులు

కావలిరూరల్ : కావలి మండలం కొత్తపల్లి మఠంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొవ్వూరు మాలకొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధన మహోత్సవంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బిట్రగుంట : బోగోలు మండలం పాతబిట్రగుంట, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామాల్లోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో స్వామి అమ్మవారలకు ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసంతర్పణ, రాత్రి గ్రామోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

సమన్వయంతో సాగునీరు వాడుకోండి

● సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్



లబ్ధిదారుడికి కల్టివేటర్ అందిస్తున్న బీద గిరిధర్, ఏడీఏ నాగరాజు, ఎంపీపీ శశిరేఖ, తదితరులు

అల్లూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఇరు గ్రామాల రైతులు సమన్వయంతో ఎడగారు పంటకు సాగునీటిని వాడుకోవాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ సూచించారు. బుధవారం స్థానిక ఇరిగేషన్ బంగ్లా వద్ద పురిణి, గోగులపల్లి ఆయకట్టు రైతులతో ఆయన సమావేశమయ్యారు. 810 ఎకరాలు విస్తీర్ణం కలిగిన పురిణి చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోయి 200 ఎకరాలకు చేరింది ఈ తరుణంలో గోగులపల్లి ఆయకట్టులోని 4 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఈ చెరువు నుంచి ఆక్రమణలతో సాగునీరు అందడం లేదని ఆ గ్రామ రైతులు పురిణి రైతులతో వాగ్వివాదానికి దిగడంతో సమస్మాత్మకంగా మారింది. ఈ సమస్యను బీద గిరిధర్ దృష్టికి తీసుకురాగా ఆయన ఇరు గ్రామాల రైతులతో చర్చించారు. ఇరు ప్రాంత రైతులు ఇబ్బందులు లేకుండా సాగునీటిని సరఫరా చేసుకోవాలని సూచించడంతో రైతులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, అంబటి రాజేంద్ర, రేబాల శంకర్‌రెడ్డి, సాగునీటి డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

● వ్యవసాయ పరికరాల పంపిణీ

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు బుధవారం జరిగిన వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రాయితీ పరికరాలు అందజేశారు. అర్హులను గుర్తించి యాంత్రీకరణ పనిముట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగరాజు, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఎంపీడీవో రజనీకాంత్, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

కొండాపురం, మే7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో బుధవారం ప్రజలకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు, మాజీ సర్పంచు ఎం.ఏడుకొండలు, కే.రామకృష్ణ, ఐతా వెంకటేశ్వర్లు, పీ.వేణు, తదితరులు పాల్గొన్నారు.



చెత్త బుట్టల పంపిణీ చేస్తున్న జాగర్లమూడి. తదితరులు

ఆర్యవైశ్య విద్యార్థులకు సత్కారం



టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థులను సత్కరిస్తున్న వాసవీసేవాదళ్ ప్రతినిధులు

కందుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన నియోజకవర్గంలోని ఆర్యవైశ్య విద్యార్థులను వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా డాక్టరు ధర్మతేజ, ఆర్యవైశ్యసంఘం జిల్లా కార్యదర్శి గుర్రం సింగయ్య, జిల్లా ఆర్యవైశ్యసంఘం మీడియా చైర్మన్ చక్కా వెంకటకేశవరావు, వాసవీసేవాదళ్ ఉపాధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు తదితరులు పాల్గొని పదవ తరగతిలో 580 పైగా మార్కులు సాధించిన, ఇంటర్‌లో ప్రథమ సంవత్సరం 96 శాతం, ద్వితీయ సంవత్సరంలో 970కి పైగా మార్కులు సాధించిన 35 మంది విద్యార్థులను సత్కరించి కాలేజీ బ్యాగులు, పెన్నులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, కోట వెంకటనరసింహం, కోట కిషోర్, కంకణాల వెంకటేశ్వర్లు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, రవ్వా అరుణ, పబ్బిశెట్టి వెంకట సురేష్, ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బిట్రగుంట, మే 7(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లిలోని కోదండరామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు వేదగిరి శ్యామసుందరాచార్యులు, సుబ్బారావు, చిట్టిబాబులు కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి అమ్మవార్లకు పూలంగి సేవకు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ, గ్రామోత్సవ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అల్లూరి సీతారామరాజుకి నివాళి

కందుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ధైర్యసాహసాలను, దేశభక్తిని, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన ధీరోదాత్తతను గుర్తుచేసుకున్నారు. ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ పాలకులపై పోరాటం సాగించి 27 ఏళ్లకే ప్రాణ త్యాగం చేసిన అల్లూరి తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. అల్లూరి మన నుంచి దూరమై వందేళ్లు గడిచినా నేటికీ ఆయన పేరు తలుచుకుంటే తెలియని ఉద్రేకం వస్తుందన్నారు. నాయకులు గట్టుమనేని హరిబాబు, రాఘవులు, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం వైకుంఠం, బొర్రా కోటేశ్వరరావు, యద్దనపూడి శ్రీధర్, చిన్ని పాండురంగయ్య పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం బాలాలయంలో కొలువు దీరిన మూలమూర్తులు, ఉత్సవమూర్తులు, ఆళ్వారులు

పునర్నిర్మాణ పనులు నేడు ప్రారంభం

వేణుగోపాలస్వామికి బాలాలయం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం బాలాలయం ప్రారంభమైంది. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్లను ధ్యానాధి వాసంలో ఉంచి, ఉత్సవ మూర్తులకు బాలాల యంలో నిత్యపూజలు చేస్తారు. మేల్కోటి భట్టర్ స్వాముల ఆధ్వర్యంలో బాలాలయం పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్త మన్నెం లక్ష్మీకాంతరెడ్డి, ఈవో, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభిస్తారు.

జూన్ 22న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

కావలిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 22వ తేదీన బృందావనం కాలనీలోని కల్యాణ మండపంలో మిస్టర్ సింహపురి స్టీల్ మేన్ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు, ఉమెన్ ఫిజిక్ మోడలింగ్ పోటీలు జరుగుతాయని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను బుధవారం ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శరీర సౌష్టవ పోటీలను కేవలం పోటీలుగా చూడకూడదని, ప్రతి ఒక్కరు దృఢమైన శరీర సౌష్టవం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్కే ముజీబ్, ఈసీ మెంబర్లు హరి, పవన్‌కుమార్, బీ.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాల సేకరణలో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలి

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు సంబంధించిన భౌతిక ఆధారాల సేకరణలో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ సిబ్బందికి సూచించారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై జిల్లాలో పనిచేస్తున్న దర్యాప్తు అధికారులకు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడటంలో నేర స్థలం నుంచి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణే కీలకమన్నారు. ఆధునిక నేరాలను ఆధునిక పద్ధతుల్లోనే ఎదుర్కోవాలని, విచారణలో సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తే నేరస్థులను శాస్త్రీయంగా, చట్టపరంగా నిలువరించగలమని తెలిపారు. సేకరించిన ఆధారాలను నిపుణుల పరీక్షలకు పంపే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్ర మంలో ఫోరెన్సిక్ నిపుణులు జయశ్రీ శ్రీరాం, శ్రీరాములు రెడ్డి, కే శిరీష, వీ వెంకటేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

రెడ్‌క్రాస్ అంటే సేవలకు పెట్టింది పేరు. అందులోనూ నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మొత్తం 13 రకాల విభాగాలతో ప్రత్యేక సేవలు అందిస్తోంది. కొవిడ్-19 విజృంభణ సమస్యంలో కరోనా బాధితులకు ప్లాస్మా సేవలు అందించటంలో దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది. ఇక, రక్తదానం సేకరణలో అయితే ఎల్లప్పుడూ ముందే ఉంటుంది. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి పలువురి ప్రశంసలు అందుకుంది.



రెడ్‌క్రాస్ సేవకు బాస్!

- అద్వితీయమైన సేవలు
- జిల్లా రెడ్‌క్రాస్‌కు దేశవ్యాప్త గుర్తింపు
- 13 విభాగాలతో విశిష్ట సేవలు
- రక్తం సేకరణలో రాష్ట్రంలోనే మొదటిస్థానం
- నేడు ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

నెల్లూరు (వైద్యం), మే 7 (ఆంధ్రజ్యోతి) : మొదటి ప్రపంచ యుద్ధానంతరం హెన్రీడ్యూనాట్ అనే మహనీయుడు యుద్ధం వద్దు.. శాంతి కావాలనే ధ్యేయంతో ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సంస్థను స్థాపించారు. రెండో ప్రపంచ యుద్ధంలో సైనికులకు, బాధితులకు సేవలు అందిస్తూ కాలక్రమేణ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, తీవ్రమైన వ్యాధులు ప్రబలినప్పుడు విశేష సేవలు అందించింది. ఈ నేపథ్యంలో మొదటి శాంతి బహుమతిని పొందిన హెన్రీ డ్యూనాంట్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ఏటా మే 8వ తేదీన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా రెడ్‌క్రాస్‌లో 7400 మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల సేవలు అందచేస్తున్నారు.

మృతదేహాలకు దహన సంస్కారాలు

కోవిడ్ సమయంలో సొంతవారు సైతం భయంతో శవాలను వదిలేసి వెళ్లగా అటువంటి వారికి రెడ్‌క్రాస్ అంత్యక్రియలు నిర్వహించింది. క్రిమిటోరియం మిషన్ కొనుగోలు చేసి వలంటీర్ల ద్వారా 155 శవాలకు దహన సంస్కారాలు చేసింది. ఆక్సిజన్ రథచక్రాలు పేరుతో ఆక్సిజన్‌తో కూడిన బస్సులను కోవిడ్ బాధితుల కోసం అందుబాటులో ఉంచింది. గత నవంబరులో వరదలు సంభవించినప్పుడు ఆహారం, దుప్పట్లు, నిత్యావసర సరకులు, మంచినీరు అందించింది. రక్తనిధి ద్వారా ఏటా వేలాది మందికి రక్తాన్ని సమకూర్చి వారి ప్రాణాలు నిలవడానికి దోహదపడుతోంది. స్పాస్టిక్ సెంటర్ ద్వారా 100 మంది దివ్యాంగుల బాలలకు ఉచిత వైద్యం అందిస్తోంది. డేకేర్ సెంటర్ ద్వారా తలసీమియా బాధిత 105 మంది పిల్లలకు రక్త మార్పిడి చికిత్సలు అందిస్తోంది. మరణించిన వారి భౌతిక కాయాలను భద్రపరిచేందుకు ఉచితంగా శీతల శవపేటికలు ఏర్పాటు చేసింది. ఇక, కేన్సర్ విభాగం ద్వారా అయితే జిల్లాతోపాటు చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, కడప జిల్లా రోగులకు కూడా చికిత్సలు అందిస్తోంది.

రెడ్‌క్రాస్ విభాగాలు ఇవి...

బ్లడ్‌బ్యాంకుతోపాటు కేన్సర్ విభాగం, ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్, జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్, డిసాస్టర్ మేనేజ్‌మెంట్, జనరిక్ మెడిసిన్, ఏఆర్‌వీ క్లినిక్, తలసీమియా విభాగం, వైఆర్‌జీ కేర్, సోషల్ ఎమర్జెన్సీ, పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం తదితర విభాగాలలో రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందిస్తుంది.

మరింత సేవ చేస్తాం



నెల్లూరు రెడ్‌క్రాస్ ద్వారా రోగులకు అవసరమైన రక్తంతోపాటు ప్లాస్మా వంటివి సరఫరా చేస్తున్నాం. మొత్తం 13 విభాగాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నాం. దీని వెనుక దాతల సహకారం ఎంతో ఉంది. కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించాం. భవిష్యత్తులో మరింత ఎక్కువ సేవ చేస్తాం.

- వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ పాలకమండలి చైర్మన్

ఒకరి ఆకలి తీర్చడమైనేది ఎవరికైనా తృప్తినిచ్చే అంశం. అలా ఎంతో మంది ఆకలి తీరుస్తూ తర్వాత ఉపాధి, ఆదాయం పొందే వ్యాపారాన్ని పొదుపు మహిళలు ప్రారంభించారు. వారికి చేయూతనిచ్చి ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి ప్రభుత్వం తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్ణయించింది. రాష్ట్రంలోనే మొట్టమొదట నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ వద్ద ఈ క్యాంటీన్‌ను ఇటీవల ఏర్పాటు చేసింది. ఇది సత్ఫలితాలను, మంచి ఆదాయాన్ని ఇస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా మహిళలతో మరిన్ని క్యాంటీన్లు నడిపించాలని మెప్మా అధికారులు నిర్ణయించారు. ఏపీ మెప్మా, సారా ప్రాజెక్టు ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.



తృప్తినిచ్చే ఉపాధి

- పొదుపు మహిళలతో క్యాంటీన్లు
- ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వ చేయూత
- నలుగురితో జట్టుగా ఏర్పాటు
- పైలెట్ ప్రాజెక్టుగా నెల్లూరులో ప్రారంభం
- సౌర విద్యుత్ వినియోగం
- మరిన్ని ఏర్పాటు చేస్తామంటున్న అధికారులు

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వమే 20-12 సైజు కంటైనర్లను సమకూరుస్తుంది. నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా తీసుకుని వారికి తృప్తి క్యాంటీన్లను అప్పగిస్తుంది. వంటశాల నిర్వహణపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణహితాన్ని కాంక్షిస్తూ ఈ క్యాంటీన్లో ఎలక్ట్రిక్ పరికరాలను, సౌర విద్యుత్‌తో పనిచేసే వాటిని ఉపయోగిస్తోంది. క్యాంటీన్ నిర్వ హణకు రూ. 16.40లక్షలు పెట్టుబడి అవసరమవుతుందని అధికారులు నిర్ణయించారు. నలుగురు సభ్యుల్లో ఒక్కొక్కరు రూ.3.10లక్షల వంతున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుది. మిగతా పెట్టుబడి కంటైనర్, యంత్ర పరికరాలు, సూర్య ఘర్ పథకం కింద సౌర విద్యుత్, ఇతర అవసరాల రూపంలో మెప్మా, సారా ప్రాజెక్టులు అందజేస్తాయి.



తృప్తి క్యాంటీన్ లోపల సామాన్లు

ఈ క్యాంటీన్‌లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన వంటవారు సేవలు అందిస్తారు.

లాభదాయకమే..!

తృప్తి క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి ఆదాయ, వ్యయాలను అధికారులు లెక్కకట్టారు. వారి అంచనా ప్రకారం నెలవారీ టర్నోవర్ రూ.6.39లక్షలుకాగా అందులో ఖర్చులు రూ.3.92లక్షలుపోగా మిగిలిన రూ.2.46లక్షలు ఆదాయంగా పేర్కొన్నారు. అయితే ఈ క్యాంటీన్లలో ఆహార పదార్థాల ధరలకు బయటి మార్కెట్‌లో ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడం గమనార్హం.

ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తాం



రాష్ట్రంలోనే మొట్టమొదటి తృప్తి క్యాంటీన్‌ను నెల్లూరులో ఏర్పాటు చేశాం. ఆదాయం బాగా వస్తోంది. నగరంలోని ప్రధాన కూడళ్లలో మరిన్ని ఏర్పాటు చేయిస్తాం. తర్వాత కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోనూ ఈ క్యాంటీన్లు ఎక్కువ సంఖ్యలో ప్రారంభిస్తాం.

- రాధమ్మ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

సమస్యలను పరిగణలోకి తీసుకుని రీ సర్వే పూర్తి చేయాలి

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటికే రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని సమర్థవంతంగా సర్వేను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో రీసర్వేపై సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ రెండవ విడత ఎంపికైన గ్రామాల్లో రీ సర్వే సక్రమంగా పూర్తి చేయాలని, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, అందుకుగాను ముందుగా రెవెన్యూ కార్యాలయంలో అందుబాటులో ఉన్న రికార్డుల జాబితా తయారు చేయాలని సూచించారు. నోషనల్ ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి తీరువా పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం పనికిరానిదని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, సర్వే ఏడీ నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బాండ్ల జారీ ప్రక్రియను నిలువరించట్లేదు

● అప్‌లోడ్ ప్రక్రియను కొనసాగించుకోవచ్చు: హైకోర్టు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): మైనింగ్ ప్రాజెక్టుల విస్తరణ, అభివృద్ధి, కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా బాండ్ల రూపంలో రూ.9వేల కోట్లు సమీకరించేందుకు ఏపీఎండీసీకి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. బాండ్ల జారీ ద్వారా రుణాన్ని సమీకరించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. నూతన మైనింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం సొమ్మును సమీకరిస్తున్నారని వ్యాఖ్యానించింది. విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ దశలో అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ గురువారం బాండ్లు అప్‌లోడ్ చేస్తున్నామని ధర్మాసనం దృష్టికి తీసుకురాగా... తాము ప్రక్రియను నిలువరించడం లేదని, బాండ్ల అప్‌లోడ్ ప్రక్రియను కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. పిటిషనర్, వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపించారు.

11 ఎర్రచందనం దుంగల పట్టివేత

అనంతసాగరం, మే 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గుడిగుంట బీట్ ఉత్తర కాలువ సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 11 ఎర్రచందనం దుంగలను బుధవారం సాయంత్రం అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని ఆత్మకూరు రేంజి కార్యాలయానికి తరలించారు. వాటి బరువు 300 కేజీలు ఉన్నట్లు జిల్లా అటవీశాఖాధికారి మహబుబ్‌బాష తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పట్టుకున్న ఎర్రచందనం దుంగలు

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట

క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు, వర్సిటీ వీసీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వెంకటాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ లీగ్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కొంతసేపు సాఫ్ట్‌బాల్ ఆడారు. తొలుత మంత్రికి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఘనస్వాగతం పలికి సత్కరించారు. అనంతరం టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన దాతలను మంత్రి సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ సీఎం చంద్రబాబు క్రీడల పట్ల ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారని, అందుకే గతంలో రెండు శాతం ఉన్న క్రీడల కోటా రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచినట్లు తెలిపారు. ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీలో 16 వేలకుపైగా పోస్టులు ఉండగా, క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా 421 పోస్టులను నోటిపై చేసినట్లు ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్నీ జిల్లాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, స్టేడియాలను నిర్మించి, అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోటీ పడుతున్న క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరింతగా రాణించేందుకు తోడ్పడతామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ యూనివర్సిటీల కోచ్‌లు, అంపైర్లు, రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు టోర్నీ ముగింపు

వీఎస్‌యూలో జరుగుతున్న అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ తుదిదశకు చేరుకుంది. ఈ పోటీల్లో భాగంగా నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ, మహారాష్ట్రలోని సంత్ గాడ్గే బాబా అమరావతి యూనివర్సిటీ, కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ జట్లు గురువారం పరస్పరం తలపడను న్నాయి. ఈ జట్లకు జరగనున్న మ్యాచ్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాలు ఖరారు కానున్నాయి. గురువారం సాయంత్రం 4 గంటలకు వీఎస్‌యూ ప్రాంగణంలో ముగింపు వేడుక జరగనుంది. పలువురు ప్రముఖులు హాజరై విజేతలకు ట్రోఫీలను అందచేయనున్నారు.

క్వార్ట్జ, మైకాకు భలే డిమాండ్

- ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉపాధి
- చైనాకు ఎగుమతి చేయడం వల్ల నష్టాలు
- నెల్లూరు మైనింగ్ యజమానులు

విజయవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం క్వార్ట్జ్, మైకాకు మంచి డిమాండ్ ఉందని, వీటిని చైనాకు పంపి ప్రాసెసింగ్ చేయడం వల్ల తాము నష్టపోతున్నామని నెల్లూరు జిల్లా క్వార్ట్జ్, మైకా మైన్స్ ఓనర్ మాల్యాద్రి అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెల్లూరులో అపారమైన ఖనిజ సంపద ఉందన్నారు. ఈ ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చైనాకు ఎగుమతులు నిలిపివేసి నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడం వల్ల స్థానిక యువతకు ఎక్కువగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ గనులను రీసర్వే చేసి అరవై మైనింగ్ గనులకు అనుమతి ఇచ్చారని, మరో పన్నెండు ప్రదేశాల్లో అనుమతి ఇవ్వాల్సి ఉందని మాల్యాద్రి చెప్పారు. 2024 నుంచి క్వార్ట్జ్, మైకా గనుల్లో పనులు జరగకపోవడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయాన్నారు. కొంతమంది అడ్డదారుల్లో క్వార్ట్జ్ ముడిసరుకు తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ యజమానులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న క్వార్ట్జ్, మైకా మైన్స్ ఓనర్ మాల్యాద్రి

జలజీవన్ పనులు
వేగవంతం చేయాలి

- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు
- గ్రామీణ నీటిసరఫరాశాఖ ఈఈ రెడ్డయ్య



కొలనుకుదురు వద్ద కొత్త పైపులైనును పరిశీలిస్తున్న ఈఈ రెడ్డయ్య

మనుబోలు, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో తలపెట్టిన జల జీవన్ పనులు వేగ వంతం చేయాలని జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ ఈఈ రెడ్డయ్య తెలిపారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కొలనుకుదురు, పల్లిపాళెంలో జరుగుతున్న జలజీవన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లిపాళెంలో రూ.39లక్షలతో రక్షిత మంచినీటి ట్యాంకు, కొలనుకుదురులో రూ. 68లక్షలతో కొత్తవాటర్ స్కీం,సంపునిర్మాణం, పైపులైను పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు వాడే సిమెంట్, ఇసుక, స్టీల్‌ను పరిశీలించామని చెప్పారు. పనులు నాణ్యత తగ్గకుండా చేయించాలని ఏఈకి, కాంట్రాక్టరుకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. అంతేకాక మండలంలో పలు గ్రామాల్లో రక్షితమంచినీటి ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ కసనానాయక్, నాణ్యత నియంత్రణ ఏఈ ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్‌జీటీ, ఎస్‌ఏ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ ప్రాతిపదికన ఉపాధ్యాయులు తెలిపిన అభ్యంతరాల పరిశీలన తరువాతనే తుది జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఎస్‌ఏల నుంచి హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కోసం సీనియారిటీ జాబితాను కూడా డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచామని, వీటిపై మరిన్ని అభ్యంతరాలుంటే ఈనెల 9వతేదీ వరకు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందచేయవచ్చని తెలిపారు.

డైట్ అధ్యాపకులుగా ఉపాధ్యాయులు

● 20 మందికి డిప్యుటేషన్

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : డైట్ కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు 20 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అర్హత కలిగిన సీనియర్ ఉపాధ్యాయులను ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్‌పై నియమించినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు.